ఆంధ్రభూమి

THAILAND PACKAGE
With 1N SRILANKA FREE
GROUP DEPARTURE ON 25FEB'18
INR 28,999* Per Person.
Above cost includes : 4Nights / 5Days
Airfare ex Hyderabad on Srilankan Airlines / Airport Taxes.
Airport transfers / 2N Pattaya - 1N Bangkok - 1N Negambo
Stay in 3* Hotel with Breakfast / Coral island tour with lunch
City tour of Bangkok / City tour of Colombo.
*Terms and conditions apply:
Booking First come basis only / Govt Taxes extra.
Visa charges extra / Rates are subject to change.
Contact us @ Hyd office : 040 23311495 / 9553304546. SriLankan Holidays

సంపుటి: 29 • సంచిక: 228 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | గురువారం 18 జనవరి, 2018 | 20 పేజీలు | ధర: ₹3.00

శుభోదయం

కలియుగం - 5119
శాలివాహన శకం - 1939

శ్రీ చాంద్రమాన హేమలంబ నామ సం॥
ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం,
శుక్లపక్షం; తిథి: శుద్ధ పాడ్యమి ఉ.8.53;
నక్షత్రం: శ్రవణం రా.12.02
వర్జ్యం: రా.తె.4.21 నుండి 6.04 వరకు
దుర్ముహూర్తం: ఉ.10.00 నుండి 10.48 వరకు,
తిరిగి మ.02.48 నుండి 03.36 వరకు;
రాహుకాలం: మ.1.30 నుండి 3.00 వరకు





భారత తొలి మహిళా రక్షణ మంత్రిగా నిర్మలా సీతారామన్ మరో రికార్డు సృష్టించారు. యుద్ధవిమానం సుఖోయ్-30 ఎంకేఐ సూపర్ సోనిక్ జెట్‌లో గగన వీధుల్లోకి దూసుకెళ్లారు. భూమికి 8వేల మీటర్ల ఎత్తుకు వెళ్లి 45 నిమిషాల పాటు విహరించారు. ఇది అనిర్వచనీయమైన అనుభవం. ప్రయాణం అద్భుతంగా జరిగింది అంటూ అనంతరం మీడియా ముందు వ్యాఖ్యానించారు.



7



బాధ్యుల్ని వదలం

- కోడి పందేల నిర్వాహకులపై కేసులు నమోదు
- డిప్యూటీ సీఎం చినరాజప్ప వెల్లడి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 17: కోర్టు ఆదేశాలు ధిక్కరించి కోడి పందేలు నిర్వహించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ఉప ముఖ్యమంత్రి (హోం) చినరాజప్ప వెల్లడించారు. వెలగపూడి సచివాలయంలో ఆయన బుధవారం విలేఖరులతో మాట్లాడుతూ కోడి పందేల నియంత్రణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని గుర్తుచేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి బాగుందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి, గురువారం నుంచి ప్రారంభం కానున్న జిల్లా కలెక్టర్ల సదస్సుకు ఏర్పాట్లపై డీజీపీతో చర్చించామని తెలిపారు. కాగా, డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన మాలకొండయ్య రాష్ట్ర హోంశాఖ మంత్రి చినరాజప్పను వెలగపూడి సచివాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి, కోడి పందేల నియంత్రణకు తీసుకున్న చర్యల గురించి డీజీపీ ఆయనకు వివరించారు.

మనకు సాటి లేదు

మహిళా సాధికారతలో ఏపీ నెంబర్ వన్

- అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు • సార్క్ మహిళా సదస్సు ప్రారంభంలో చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 17: మహిళా సాధికారతలో ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్ స్థానంలో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మూడు రోజులపాటు విశాఖలో జరిగే సార్క్ దేశాల మహిళా పారిశ్రామికవేత్తల అంతర్జాతీయ సదస్సును చంద్రబాబు నాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్న ఉద్దేశంతో సుమారు 20 సంవత్సరాల కిందటే డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేశామన్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపులలో ఉన్న మహిళలు ఆర్థికంగా ఎదగడమే కాకుండా, నాయకత్వ లక్షణాలను కూడా అలవరచుకున్నారని అన్నారు. కనీస విద్య కూడా లేని మహిళలు నేడు వివిధ రకాలైన వ్యాపారాలను చేసి రాణిస్తున్నారని అన్నారు. ఇది ఒక్క ఏపీలోనే సాధ్యమైందని చంద్రబాబు చెప్పారు. మహిళల్లో నిద్రాణమై ఉన్న శక్తి యుక్తులను ఇంకా ఉపయోగించుకోవాలని, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా అనేక కార్యక్రమాల రూపకల్పన చేస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగానే అమరావతిలో మొట్టమొదటిసారిగా ఉమెన్ పార్లమెంట్‌ను నిర్వహించామని చంద్రబాబు తెలియచేశారు. ఆ సమావేశంలో చేసిన సిఫార్సులను అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని చంద్రబాబు చెప్పారు. మహిళలకు విద్య, రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్ ఇచ్చాం. ఐటీ రంగంలో మహిళలు ఎంతగానో రాణిస్తున్నారని అన్నారు. ఈ రంగంలో అబ్బాయిలు కన్నా, అమ్మాయిలే ఎక్కువగా ఉన్నారని అన్నారు. ఏ కంపెనీలోనైనా పురుషుల కన్నా, మహిళలే ఎక్కువ ఉత్పత్తి సాధిస్తున్నారని సీఎం అన్నారు. సమాజంలో అమ్మాయిల సంఖ్య గణనీయంగా తగ్గుతోందని, కొన్నాళ్లకు అబ్బాయిలే, ఎదురు కట్నం ఇచ్చి అమ్మాయిలను పెళ్లి చేసుకోవలసి వస్తుందని చంద్రబాబు అన్నారు. మహిళల ప్రాధాన్యత పెంచేందుకు ప్రభుత్వం ఇచ్చే ప్రతి పథకం కూడా వారి పేరునే ఇస్తున్నామని చెప్పారు. ప్రతి మహిళ నెలకు 10 వేల రూపాయలు సంపాదించుకుంటే, వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో 24వేల ఎంఎస్‌ఎంఈలను ఇప్పటి వరకూ 700 కోట్ల రూపాయల రాయితీ ఇచ్చామని అన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఒక ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించామని, ఇవి - మిగతా 7వ పేజీలో


జ్యోతి ప్రజ్వలన చేసి మహిళా పారిశ్రామిక సదస్సును ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

కాళ్ల బేరానికి పాకిస్తాన్?

- డీజీఎంఓల భేటీకి ప్రతిపాదనలు
- అలాంటిదేమీ లేదన్న భారత్



5

భారత్ ఘోర పరాజయం

- 0-2 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకున్న దక్షిణాఫ్రికా



8


మంగళగిరిలో ఐటీ కంపెనీల ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న మంత్రి నారా లోకేష్

ఉపాధి వెల్లువ

- పదేళ్లలో 10లక్షల ఉద్యోగాలే లక్ష్యం
- డేటా సెంటర్ హబ్‌గా అమరావతి
- ఇప్పటికే 54 ఐటీ కంపెనీల రాక
- విశాఖ టూ అనంతపురం 'ఆంధ్రా వ్యాలీ'
- 16 ఐటీ కంపెనీల ప్రారంభోత్సవంలో మంత్రి లోకేష్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 17: రాబోయే దశాబ్ద కాలంలోపు రాష్ట్రంలో యువతకు ఐటీ రంగంలో 10లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఐటీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. 'హైదరాబాద్‌తో ఒక సైబరాబాద్‌ను కోల్పోయాం. అందుకే నాలుగు సైబరాబాదులు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. విశాఖ, అమరావతి, తిరుపతి, అనంతపురంలో నాలుగు ఐటీ క్లస్టర్లు రాబోతున్నాయి. సైబరాబాద్ పేరు చెబితే మైక్రోసాఫ్ట్ గుర్తుకొస్తుంది. ఇప్పుడు తిరుపతి పేరు చెబితే జోహో గుర్తుకొస్తుంది. యువకులు ముందు చిన్న కంపెనీలో చేరి అనుభవం సంపాదించుకోవాలి' అని ఆయన సూచించారు. కష్టపడి నిర్మించుకున్న రాజధాని సైబరాబాద్ పోయిందన్న బాధ ఉందని, అందుకే అంతకు మించి అభివృద్ధి - మిగతా 7వ పేజీలో

అన్ని రంగాల్లో భాగస్వామ్యం

- భారత్‌తో కలిసి పనిచేస్తాం • సృజనతో దేశ ముఖచిత్రాన్ని మారుస్తున్న మోదీ
- ఐ క్రియేట్ ప్రారంభంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

దేవ్ దోలేరా, జనవరి 17: ఎప్పటికప్పుడు కొత్త ఆవిష్కరణలతో భారత ప్రధాని నరేంద్ర మోదీ దేశ ముఖచిత్రాన్నే మారుస్తున్నారని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రశంసించారు. భారత్‌ను అంతర్జాతీయ శక్తిగా మార్చాలన్న అకుంఠిత దీక్షతో మోదీ పనిచేస్తున్నారని చెప్పిన ఆయన అన్ని రంగాల్లోనూ భారత్‌తో భాగస్వామ్యాన్ని పెంపొందించుకుంటామని స్పష్టం చేశారు. ఇజ్రాయెల్ యువత భారత్‌కు వచ్చి ఇక్కడ జరుగుతున్న మార్పులను ఆకళింపు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్ కూడా అన్ని రంగాల్లోనూ కొత్త ఆవిష్కరణలకు నాందీ ప్రస్తావన చేస్తోందని భారత ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఎప్పటికప్పుడు కొత్త వ్యవస్థలను పాదుకొల్పుతూ భారత్‌కు సహకరిస్తోందని తెలిపారు. బుధవారం ఇక్కడ జరిగిన ఔత్సాహిక పారిశ్రామిక, సాంకేతిక విజ్ఞాన అంతర్జాతీయ కేంద్రం (ఐ-క్రియేట్)ను ప్రారంభించిన అనంతరం ఇరు దేశాల ప్రధానులు మాట్లాడారు. ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంతో పనిచేసే సంస్థ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు భిన్న రంగాల్లో రాణించడానికి అన్ని విధాలుగా సహకారాన్ని అందిస్తుంది. ఈ సందర్భంగా మాట్లాడిన నెతన్యాహు ఇరు దేశాల యువత తమ క్రియాశీలతతో సృజనతో ముందుకు రావాలని కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. భారత ప్రధాని మోదీ దేశంలో అనూహ్యమైన మార్పులు తెస్తున్నారని, విప్లవాత్మక రీతిలో భారత భవిష్యత్ పథాన్ని నిర్దేశిస్తున్నారని తెలిపారు. ఇదంతా కూడా సరికొత్త ఆవిష్కరణల శక్తితోనే మోదీ - మిగతా 7వ పేజీలో


ఐ క్రియేట్ వేదికపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో భారత ప్రధాని నరేంద్ర మోదీ

ఘనగామా



మనం ఇప్పుడు వాడుతున్న సైకిల్ మాదిరి ఒకప్పుడు ఇవి వాడే వారట!!

పెరుగుతున్న తటస్థ ఓటర్లు!

- పార్టీ ఫిరాయింపులే కారణం.. • ప్రజల నాడి పట్టడం కష్టమే...

వై.వి. కృష్ణారెడ్డి

కర్నూలు, జనవరి 17: రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిస్థితులకు తోడు ప్రజల అభిప్రాయాల్లో కూడా మార్పు స్పష్టంగా కనిపిస్తోందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో రానున్న ఎన్నికల్లో ఓటరు నాడి పక్కాగా కనిపెట్టడం అంత సులభం కాదని వారు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో ఓటర్ల అభిప్రాయాలు 2014 ఎన్నికల వరకు తెలుసుకోవడం సులభంగా ఉండేదని, ఆ తరువాతి కాలంలో రాజకీయాల్లో వచ్చిన మార్పులతో ప్రజలు విసుగు చెందారన్న అభిప్రాయం వినిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా నాయకుల పార్టీ ఫిరాయింపులు, సొంత పనుల కోసం అధికార పార్టీ నాయకుల పంచన చేరడం వంటి కారణాలు ప్రజల్లో మార్పునకు కారణమైందని భావిస్తున్నారు. దీనికి తోడు ప్రతి నియోజకవర్గంలో అన్ని రాజకీయ పార్టీల్లో నాయకుల సంఖ్య పెరగడంతో ఎవరి మాట వినాలో, ఎవరు ప్రజా నాయకులో తెలుసుకోవడం కష్టంగా మారడంతో ప్రజలే తమ అభిప్రాయాన్ని మార్చుకుని ఉంటారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో అప్పటి వరకు ఒక పార్టీకి అభిమానులుగా ఉన్న ఓటర్లు తటస్థంగా ఉండాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ లెక్కల ప్రకారం 3,70,82,855 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 1,84,14,685 మంది, మహిళలు 1,86,64,912 మంది, ఇతరులు 3,258 మంది ఉన్నారు. వీరిలో తటస్థ ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగి 40 శాతానికి పైగా ఉంటారని భావిస్తున్నారు. గతంలో తటస్థ ఓటర్లుగా మేధావులు, పట్టణ ప్రాంతాల్లోని విద్యాధికులు ఉండే వారు. వారి శాతం 10 శాతం లోపే ఉండేది. ఈ కొద్ది శాతం ఓటర్లే గతంలో రాజకీయాల్లో అధికారం కట్టబెట్టడంలో కీలక భూమిక పోషించారు. మారుతున్న పరిస్థితులతో గ్రామాల్లో సైతం తటస్థ ఓటర్ల సంఖ్య పెరగడం గమనించదగ్గ పరిణామం.

రాష్ట్రంలో కులం, ఫ్యాక్షన్, రాజకీయ పార్టీల అభిమానులుగా ఉన్న ఓటర్లు ఇప్పుడు అన్నింటినీ వదిలి తమకు తాము ఒక అభిప్రాయంతో ఉన్నారన్నది స్పష్టమవుతోంది. ప్రతి కులంలో ఒకటికి మించి సంఘాలు ఉండటం, ఆయా సంఘాలు ఏదో ఒక రాజకీయ పార్టీకి అనుబంధంగా ఉండటం వల్ల ఆయా కుల ఓటర్లలో గందరగోళం ఏర్పడిందనే చెప్పాలి. ఫ్యాక్షన్ రాజకీయాలు కనుమరుగయ్యాక పార్టీ ఫిరాయింపులతో ఇరుపక్షాల నాయకులు ఒకే ఒరలో చేరడం వంటి కారణాలు ప్రజల్లో తటస్థంగా ఉండటానికి దోహదపడుతున్నాయని చెప్పాలి. ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉన్న ఓటర్లు ఆ పార్టీ చేస్తున్న తప్పులు, మరో పార్టీతో జత కట్టడం వంటి చర్యలు ఇష్టం లేక ఎన్నికల సమయంలో కీలక నిర్ణయం తీసుకోవచ్చని భావిస్తున్నారు. అందులో భాగంగానే - మిగతా 7వ పేజీలో



6

సెన్సెక్స్ 35,000

స్టాకెద్దు పరుగుతీసింది. ద్రవ్య లోటు భారీగా పెరుగుతుందనే భయాలు వీడటంతో మదుపరులు ఎడతెరిపి లేకుండా కొనుగోళ్లకు పూనుకోవడం వల్ల బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్ కీలక సూచీలు ఉవ్వెత్తున ఎగిశాయి. బుల్ రన్‌తో బీఎస్ఈ సెన్సెక్స్ 310 పాయింట్లు పుంజుకొని, తొలిసారి 35,000 మైలురాయిని అధిగమించింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 88 పాయింట్లు పుంజుకొని, 10,788.55 పాయింట్ల సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయికి చేరింది.

మరో మూడేళ్లలో గణనీయ పారిశ్రామికాభివృద్ధి

- వ్యాపారం తెలుగువారి రక్తంలోనే ఉంది
- ప్రపంచ స్థాయి ఎకోసిస్టమ్‌లో మనమే ముందు
- మైక్రోసాఫ్ట్ సారథి కూడా మనోడే
- ‘టై అమరావతి - ఏంజెల్స్ నెట్‌వర్క్’ సదస్సులో మంత్రి లోకేష్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 17: రానున్న కాలంలో రాజధాని అమరావతిలో టై అమరావతి - ఏంజెల్స్ నెట్‌వర్క్ సంయుక్తంగా ప్రముఖ పాత్ర పోషించనున్నాయని రాష్ట్ర ఐటీ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ‘మైక్రోసాఫ్ట్ వంటి అతిపెద్ద కంపెనీని నడిపిస్తున్నది కూడా మన తెలుగు వాడే. మన దేశ ప్రజలను మెప్పించగలిగే ఒక ప్రాజెక్టు తయారుచేస్తే ప్రపంచాన్ని జయించ వచ్చు. స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ. 100కోట్ల నిధి ఏర్పాటు చేసింది. మరికొందరు పారిశ్రామికవేత్తలతో కలిసి మరో 300 కోట్లు సమీకరించి పూర్తిస్థాయి స్టార్టప్ ఎకో సిస్టమ్ ఏర్పాటు చేయబోతున్నాం. పంచాయతీ రాజ్ శాఖలో టెక్నాలజీ ద్వారా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నాం. డ్రోన్లతో రోడ్డుపై ఉన్న గుంతల లోతును తెలుసుకునే టెక్నాలజీ ఒక స్టార్టప్ కంపెనీ ద్వారా వినియోగిస్తున్నాం. 17 వేల ఓవర్ హెడ్ ట్యాంకుల్లో సెన్సర్లు ఏర్పాటు చేసి మంచి నీటి నాణ్యతను పరిశీలిస్తున్నాం’ అని లోకేష్ వివరించారు. బుధవారం నగరంలోని ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన ‘టై అమరావతి - ఏంజెల్స్ నెట్‌వర్క్’ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వ్యాపారమనేది తెలుగువారి రక్తంలోనే ఉందన్నారు. ఫుడ్ ఇండస్ట్రీ ఆంధ్రాలో ప్రముఖంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో విభజన కష్టాలు వెంటాడుతున్నా గత మూడున్నరేళ్లుగా రాష్ట్రంలో అభివృద్ధే ప్రాధాన్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక ప్రోత్సాహకాలు కల్పిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 70 శాతం కుటుంబాలు డిజిటల్ లిటరసీ కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. తలసరి ఆదాయంలో రాష్ట్రం ముందుండాలనే లక్ష్యంతో పని చేస్తూ ముందుకు వెళుతున్నామన్నారు.



విజయవాడలో జరిగిన సదస్సులో ప్రసంగిస్తున్న ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్

రాష్ట్రంలో అభివృద్ధితో పాటు రెండంకెల వృద్ధిని సాధించటమే ధ్యేయమని చెప్పారు. వ్యవసాయ పరంగా దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా రాష్ట్రంలో 25 శాతం వృద్ధిరేటు సాధిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఐటీ పరంగా అభివృద్ధి సాధించేందుకు ఏపీ ఇన్నోవేటివ్ సొసైటీ బహుముఖ పాత్ర పోషిస్తోందని ఆయన చెప్పారు. ఐటీ పరిశ్రమలు రావడంలో బిల్డింగ్ ఎకో సిస్టమ్ ప్రముఖ పాత్ర వహిస్తుందన్నారు.

రాష్ట్రంలో ఐటీ కంపెనీలు ప్రారంభించేవారికి ప్రభుత్వపరంగా తగిన ప్రోత్సాహం కల్పిస్తున్నామని, ఇ-ఆఫీస్ ఫైలింగ్, రియల్ టైమ్ గవర్నెన్స్‌లో ప్రజల సమస్యల పరిష్కారానికి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పరిపాలన కొనసాగిస్తున్నామన్నారు. రాజధానిలో భూవివాదాలు తలెత్తకుండా బ్లాక్‌చైన్ టెక్నాలజీ ఉపయోగించి రికార్డులను భద్రపరుస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ స్థాయి ఎకోసిస్టమ్ సృష్టించడంలో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. మరో మూడేళ్లలో ఏపీ పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఐటీ ఆధారిత పరిశ్రమలతో పాటు ఇతర పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున కృషి చేస్తోందన్నారు. ప్రైవేట్ సెక్టార్‌లో కూడా లేనంత టెక్నాలజీని ఏపీ ప్రభుత్వ పాలనలో వినియోగిస్తున్నామన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో టెక్నాలజీ వినియోగం భారీస్థాయిలో ఉందన్నారు.

కొత్త టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్లు అందుబాటులోకి వస్తే ఏపీలో మార్కెటింగ్‌కు ఇబ్బంది ఉండదన్నారు. స్టార్టప్ కంపెనీలకు వేదికగా వ్యవహరిస్తున్న టై అమరావతి ముున్ముందు అమరావతి అభివృద్ధిలో భాగం కావటం పట్ల మంత్రి లోకేష్ హర్షం వ్యక్తపరిచారు.

ఎకో సిస్టమ్ అభివృద్ధి ఆవశ్యం

ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఐటీ సలహాదారు జేఏ చౌదరి మాట్లాడుతూ ఏ ప్రాంతంలోనైనా ఐటీ పరిశ్రమ వృద్ధి చెందాలంటే ఆ ప్రాంతంలో తగినవిధంగా ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందాల్సి ఉంటుందన్నారు. అందులో భాగంగా రాజధాని అమరావతిలో దాని అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. స్టార్టప్ కంపెనీలు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ సహాయ సహకారాలు అవసరమన్నారు. టై అమరావతి ఎకో సిస్టమ్ అభివృద్ధిలో తమవంతు కృషిని అందిస్తున్నదన్నారు. ఐటీ పరిశ్రమ 5 అంశాల ఆధారంగా ముందుకెళ్తుందని, అవి బ్యాంక్ పవర్, రా మెటీరియల్, రీసెర్చ్ కాంపొనెంట్స్, మార్కెట్ యాక్సెస్, స్థానిక ప్రజల ప్రాతినిధ్యమని ఆయన వివరించారు. ఐటీ ముఖ్య కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ పరిశ్రమకు వెన్నుదన్నుగా ప్రభుత్వం ప్రోత్సాహకాలు కల్పిస్తోందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ క్లౌడ్ విధానం, డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తూ రాష్ట్రం సాంకేతికంగా ముందంజలో వుండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇంక్యుబేషన్ ఏర్పాటుతో పాటు ఫిన్‌టెక్ వ్యాలీ సృష్టించడంలో రాష్ట్రం ముందుకు వెళుతోందని తెలిపారు.

సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ మాట్లాడుతూ రాజధాని అమరావతి అభివృద్ధికి గత మూడేళ్లుగా వివిధ కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా రైతుల భూములకు టైటిల్స్‌ను ఇచ్చి బ్లాక్‌చైన్ టెక్నాలజీతో పబ్లిక్ డొమైన్‌లో పెట్టామని వివరించారు. టై అమరావతి - ఏంజెల్స్ నెట్‌వర్క్ కార్యక్రమంలో ఐటీ కంపెనీల ప్రతినిధులు, స్టార్టప్ కంపెనీల సీఈవోలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ పట్టుదలే నాకు తారకమంత్రం

- ప్రజా సంక్షేమంతోనే రాష్ట్రం క్షేమం
- ఎన్టీఆర్‌ను స్మరించుకున్న చంద్రబాబు


ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 17: తలపెట్టిన పని పూర్తిచేయడంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు పట్టుదల, స్ఫూర్తి తనకు తారకమంత్రమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. ఎన్టీ రామారావు 22వ వర్ధంతి సందర్భంగా ఆయన్ని స్మరించుకున్నారు. ఎన్టీఆర్ భరోసా పేరుతో అరకోటి మందికి పెన్షన్లు, ఎన్టీఆర్ వైద్యసేవ, చంద్రన్న బీమా పేరుతో కార్మికులకు బీమా పథకాలతో సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామని, ఇదే ఎన్టీఆర్‌కు సరైన నివాళిగా అభివర్ణించారు. ఎన్టీఆర్ భౌతికంగా దూరమై 22 ఏళ్లు అయిందని, అయినా జన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. తెలుగువారికి తెలుగువారుగా గుర్తింపు లేక మద్రాసీలుగా ముద్రపడినప్పుడు ఎన్టీ రామారావు ఆ ముద్రను తుడిచివేశారని, తెలుగు జాతి యశస్సును దశదిశలా చాటారని కొనియాడారు. సినీ రంగంలో పౌరాణిక పాత్రలకు జీవం పోశారని, శ్రీకృష్ణుడుగా, రాముడుగా, మరోవైపు సాంఘిక చిత్రకథా నాయకుడుగా ప్రజల మనస్సులపై ప్రగాఢ ముద్ర వేశారని, దుర్యోధనుడు, రావణుడు లాంటి ప్రతినాయక పాత్రలకు ఔన్నత్యం చేకూర్చి మెప్పించారని, ప్రజాకంటక పాలనకు అవసాన పలికే పటేల్, పట్వారీ వ్యవస్థను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్టీ రామారావు రద్దుచేశారని ప్రస్తుతించారు. కిలో బియ్యం రెండు రూపాయల పథకం ద్వారా పేదలకు కడుపునిండా అన్నం తినే అవకాశం కల్పించారని, నిరుపేదలకు తొలిసారిగా దేశంలో పక్కా ఇళ్లు నిర్మించింది ఎన్టీ రామారావేనని గుర్తుచేశారు. ఆ స్ఫూర్తిని తాము కొనసాగిస్తూ పక్కా ఇళ్ల పథకాన్ని మరింత ముందుకు తీసుకువెళుతున్నామన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని, 12 లక్షల మందికి వైద్య సహాయం అందించామని, 6,700 మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చామని చంద్రబాబు తెలిపారు. 15వేల మందికి తమ కార్యకర్తలు రక్తదానం చేశారని, ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాల్లో ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా ప్రతి ఇంటికీ ఇరవై లీటర్ల నీరిస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్ వర్ధంతి నాడు (18న) తెలుగు రాష్ట్రాల్లో 120, ఇతర రాష్ట్రాల్లో 150 రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. రక్తదానం మహాదానమని, ప్రాణదానంతో సమానమని, రక్తదానం చేయడానికి సేవా భావం ఉన్నవారంతా ముందుకు రావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

హజ్ యాత్రకు 96 శాతం మంది ఎంపిక

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 17: ఏపీ స్టేట్ హజ్ కమిటీ విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం 2018 హజ్ యాత్రికుల ఎంపికకు డ్రా నిర్వహించింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ మహ్మద్ అహ్మద్ షరీఫ్, స్టేట్ హజ్ కమిటీ చైర్మన్ మోమిన్ అహ్మద్ హుస్సేన్, హజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. చిత్తూరు జిల్లా నుంచి 316, తూర్పుగోదావరి జిల్లా 41, గుంటూరు జిల్లా 454, కడప జిల్లా 311, కృష్ణా జిల్లా 236, కర్నూలు జిల్లా 533, నెల్లూరు జిల్లా 152, ప్రకాశం జిల్లా 101, శ్రీకాకుళం జిల్లా 5, పశ్చిమగోదావరి జిల్లా నుంచి 46 మంది డ్రాతో నిమిత్తం లేకుండా హజ్ యాత్రకు ఎంపికయ్యారు. 70 ఏళ్లు పైబడిన యాత్రికులు 107 మంది కూడా డ్రాతో సంబంధం లేకుండా ఎంపికయ్యారు. దరఖాస్తు చేసుకున్న వారిలో ఇంకా 99 మంది మిగిలి ఉన్నారు. వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న వీరిని అదనపు కోటాలో హజ్ యాత్రకు పంపడానికి ప్రయత్నిస్తున్నామని అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మన రాష్ట్ర హజ్ యాత్రికుల సౌలభ్యం కోసం ప్రతి సంవత్సరం రూ. 15కోట్లు భారీ బడ్జెట్ కేటాయించడం హర్షణీయమని, కడపలో రూ. 12 కోట్ల వ్యయంతో ఇప్పటికే హజ్ హౌస్ నిర్మాణం జరుగుతోందని అహ్మద్ షరీఫ్ తెలిపారు. విజయవాడలోనూ హజ్ హౌస్ నిర్మించడానికి స్థల సేకరణ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని, స్థలం సమకూరగానే ఇప్పటికే విడుదల చేసిన రూ. 24 కోట్లతో వెంటనే అధునాతన హజ్ హౌస్ నిర్మాణ పనులు చేపడతామన్నారు. గన్నవరం విమానాశ్రయంలో రన్‌వే నిర్మాణం పూర్తయిన వెంటనే 2019 హజ్ యాత్రికులను ఇక్కడి నుంచే పంపేందుకు ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఉపసంహరించుకోవడం వల్ల హజ్ యాత్రికులపై ఎలాంటి ప్రభావం ఉండదని, ప్రతి సంవత్సరంలా పెరుగుతుంది తప్ప సంఖ్య ఏమాత్రం తగ్గదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, అదనపు సెక్రటరీ పి ఉషాకుమారి, హజ్ కమిటీ సభ్యులు ముఫ్తీ మహ్మద్ ఫారూఖ్, మౌలానా ఇలియాస్, మహ్మద్ రఫీ, షేక్ మస్తాన్ షరీఫ్, హాజీ షేక్ హసన్ బాషా, టీ మహబూబ్ సాబ్, షేక్ అక్బర్ సాహెబ్, అబ్దుల్ చిన రెహ్మాన్, సయ్యద్ మఖ్దూమ్ బుఖారి, ఎండీ ఉస్మాన్, హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ లియాఖత్ అలీ, హిదాయత్ పాల్గొన్నారు.



విజయవాడలో హజ్ యాత్రికుల ఎంపికకు డ్రా తీస్తున్న దృశ్యం

వలస కూలీపై సామూహిక అత్యాచారం.. హత్య

★ పాత మాగులూరు వద్ద దారుణం

సంతమాగులూరు, జనవరి 17: జీవనోపాధి కోసం ఊరుగాని ఊరు వచ్చి కూలి పనులు చేసుకుని జీవిస్తున్న మహిళపై పాశవికంగా అత్యాచారం జరిపి హత్య చేసి బావిలో పడవేసిన ఘటన ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం పాతమాగులూరు సమీపంలోని బొద్దుల వాగు వద్ద బుధవారం ఉదయం వెలుగు చూసింది. ఈ దుర్ఘటనలో గుంటూరు జిల్లా రొంపిచర్ల మండల మండలం ఆరేపల్లి ముప్పాళ్లకు చెందిన మంచాల కనకమ్మ(40) దారుణ కృత్యానికి గురైంది. రొంపిచర్ల మండలం ముప్పాళ్లకు చెందిన కనకమ్మకు బధిరుడైన రంగారావుతో వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం . అయితే గత ఐదేళ్లుగా భార్యాభర్తలు విడి విడిగా ఉంటున్నారు. కుమార్తె రెండేళ్ల క్రితం మృతిచెందగా కుమారుడు నరసింహారావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఐదేళ్లుగా కనకమ్మ పాతమాగులూరు వచ్చి గ్రానైట్ పరిశ్రమలలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తోంది. ఒంటరిగా ఉంటున్న కనకమ్మ ఫ్యాక్టరీ కూలీలతోనూ స్థానికులు కొందరితో చనువుగా మెలుగుతున్నట్లు సమాచారం. ఐదేళ్లలో నాలుగైదు పరిశ్రమల్లో కూలి పనులు చేసుకుంటోంది. ఈనేపథ్యంలో సంక్రాంతి పండుగ రావడంతో పరిశ్రమకు మూడు రోజులుగా సెలవులు ఇచ్చారు. మంగళవారం సాయంత్రం వరకు పరిశ్రమలో పనిచేసి ఐదు గంటల ప్రాంతంలో తను ఉండే గదికి తాళంవేసి ఎక్కడికో వెళ్లింది. అప్పటినుండి తిరిగి రాలేదు. ఫ్యాక్టరీలకు పడమరగా గల బొద్దుల వాగులో బుధవారం శవమై కనిపించింది. బావిలో వివస్త్రఅయిన మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికులు బుధవారం ఉదయం గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. అయితే అక్కడ కన్పించిన ఆధారాల ప్రకారం మృతురాలి వంటిపై బట్టలు లేకపోవడం, శరీరంపై గాయాలు ఉండటం, బావిలో ఇంజన్ పైపుకింద పడవేసి ఉండటం, బావి ఒడ్డున నిందితులకు సంబంధించిన చినిగిన నిక్కరు, చిల్లర డబ్బులు, బెల్టు ఉండటాన్ని బట్టి కనకమ్మ ప్రాథమికంగా అక్కడకు ఎలా వచ్చినా ఆ తరువాత ఆమెపై బలవంతపు అకృత్యానికి పాల్పడే సమయంలో ఆమె పెనుగులాడినట్లు స్పష్టంగా ఆనవాళ్లు ఉన్నట్టు పోలీసులు భావిస్తున్నారు.



అనిల్‌చంద్ర పుణేఠాకు ఐఎస్ఓ సర్టిఫికెట్ అందజేస్తున్న కేకే రావు

సీసీఎల్ఏకు ఐఎస్ఓ గుర్తింపు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 17: రాష్ట్ర భూ పరిపాలన, రెవెన్యూ శాఖకు ఐఎస్ఓ గుర్తింపు లభించింది. అంతర్జాతీయ స్థాయిలో నాణ్యతా ప్రమాణాలను గుర్తించే గ్లోబల్ మేనేజ్‌మెంట్ సర్టిఫికేషన్ సర్వీసెస్ సంస్థ (జీఎంసీఎస్) రెవెన్యూ శాఖలో అమలు చేస్తున్న ఇ-గవర్నెన్స్, సిటిజన్ సెంట్రిక్ సేవలు, ఆటోమేషన్, డిజిటల్ లావాదేవీలు, ఎలక్ట్రానిక్ రికార్డు ఆఫ్ రైట్స్, రియల్ టైమ్ గవర్నెన్స్‌లకు సంబంధించి అనువర్తనాలు, సేవలకు ఈ గుర్తింపు ఇచ్చిందని సీసీఎల్ఏ కమిషనర్ అనిల్‌చంద్ర పుణేఠా వెల్లడించారు. ఈమేరకు ఐఎస్ఓ 9001:2015 ధ్రువీకరణ పత్రాన్ని జీఎంసీఎస్ సీఈవో కేకే రావు బుధవారం పుణేఠాకు అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గుర్తింపు రావడంతో తమ బాధ్యత మరింత పెరిగిందన్నారు. అంతర్జాతీయ గుర్తింపు వచ్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు, అధికారులు చేసిన కృషి కారణమని చెప్పారు. ప్రజలకు మరింతగా చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భూ పరిపాలనా శాఖ కార్యదర్శి బీ రామారావు, ప్రాజెక్టు డైరెక్టర్ తేజ్‌భరత్ నంబూరి, తదితరులు పాల్గొన్నారు.

‘గ్రీన్ అవార్డు’లకు దరఖాస్తుల ఆహ్వానం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 17: ఏపీ గ్రీన్ అవార్డులు-2017 కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పట్టణ పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ ఎండీ ఎన్ చంద్రమోహన రెడ్డి చెప్పారు. వెలగపూడి సచివాలయం 4వ బ్లాక్ పబ్లిసిటీ సెల్‌లో బుధవారం మధ్యాహ్నం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మూడేళ్ల క్రితం ప్రారంభించిన తమ కార్పొరేషన్ ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్‌లు, ఉద్యానవన శాస్త్రవేత్తలు రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనం, సుందరీకరణ కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా విశాఖపట్నం, విజయవాడతో పాటు తిరుపతిలో జోనల్ కార్యాలయాలు ఉన్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, విశ్వవిద్యాలయాలు, రహదారులు, దేవాలయాలు వంటిచోట్ల పచ్చదనం నింపేందుకు ల్యాండ్ స్కేప్ మాస్టర్ ప్లాన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. పచ్చదనం నింపడానికి సర్వే, డిజైన్, ఎస్టిమేషన్, ప్రాసెసింగ్ వంటి అంశాల్లో తాము సహాయపడతామన్నారు. రాష్ట్ర ప్రజలకు కూడా అన్నిరకాలుగా ఉచితంగా సహాయ సహకారాలు అందించటానికి గ్రీన్ ఏపీ అనే సాఫ్ట్‌వేర్ కూడా రూపొందించినట్లు తెలిపారు. మొక్కలు పెంచాలన్న ఆసక్తి ఉన్నవారు గ్రీన్ ఏపీ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ పేరు నమోదు చేసుకొని కావలసిన సూచనలు, సలహాలు పొందవచ్చన్నారు. సలహా గ్రూపు సభ్యులు తగిన సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. ఈ సాఫ్ట్‌వేర్‌ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 18న ఆవిష్కరిస్తారని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ఏపీ గ్రీన్ అవార్డులు-2017 ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది అవార్డులు ఇవ్వాలని కూడా ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. పచ్చదనం పెంపొందించడంలో విశేషంగా కృషి చేసిన వారికి ఈ అవార్డులు ఇస్తారన్నారు. మొత్తం 8 విభాగాల్లో అవార్డులు ప్రకటిస్తారని చెప్పారు. అర్బన్ గ్రీనింగ్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని ఆన్‌లైన్, లేదా పోస్ట్ ద్వారా దరఖాస్తులను ఫిబ్రవరి 15కల్లా పంపాలని చంద్రమోహన రెడ్డి సూచించారు.

20న మంత్రి మండలి సమావేశం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 17: రాష్ట్ర మంత్రి మండలి ఈ నెల 20న సమావేశం కానుంది. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ సమావేశం సాయంత్రం 3 గంటలకు ప్రారంభం కానుంది. తొలుత ఈ సమావేశం బుధవారం నిర్వహించాలనుకున్నారు.కానీ వివిధ కారణాల వల్ల 20వ తేదీకి వాయిదా వేశారు.

21 నుంచి దావోస్‌లో సీఎం పర్యటన

దావోస్‌లో ఈ నెల 21 నుంచి 25 వరకు జరగనున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ వేదికను ఉపయోగించుకునేందుకు వీలుగా సీఎం బృందం పర్యటనకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే దావోస్ వీధుల్లో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతి రథం పరుగులు పెడుతోంది.

జన్మభూమి ఫిర్యాదుల పరిశీలన

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 17: ఇటీవల ముగిసిన జన్మభూమి సభల్లో వచ్చిన వివిధ ఫిర్యాదుల పరిష్కారంపై భూసేకరణ చీఫ్ కమిషనర్ అనిల్ చంద్ర పుణేఠా దృష్టి సారించారు. ఇప్పటికే ఆర్థికేతర అంశాలకు సంబంధించి 99 శాతం మేర ఫిర్యాదులను పరిష్కరించారు. జన్మభూమిలో వచ్చిన వివిధ ఫిర్యాదుల పరిష్కారం అంశాలను సీసీఎల్ఏ పర్యవేక్షిస్తోంది. జన్మభూమిలో 15.31 లక్షల ఫిర్యాదులు అందగా, ఇప్పటికే 15.09 లక్షలు పరిష్కరించారు. ఆర్థిక అంశాలతో ముడిపడిన ఫిర్యాదులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు కసరత్తు ప్రారంభించారు. ఇందులోభాగంగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి ఇళ్లస్థలాల కేటాయింపునకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కొత్తగా ఇళ్లు కేటాయించడం లేదా ఇప్పటికే ఉన్న వాటిని క్రమబద్ధీకరించడం వంటి అంశాలపై దృష్టి సారించారు. గ్రామీణ ప్రాంతాల్లో 91876, పట్టణ ప్రాంతాల్లో 74850 దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పుణేఠా తెలిపారు. జన్మభూమిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. గంటగంటకూ ఎన్ని సమస్యలు పరిష్కరించారన్న అంశంపై నిఘా ఉంచారు. జిల్లా యంత్రాంగం కూడా సమస్యల పరిష్కారానికి పూర్తిగా సహకరిస్తుండటంతో ఆశించిన వేగంతో ఫిర్యాదులు పరిష్కరించగలుగుతున్నారు. రాష్ట్ర విభజన తరువాత అన్ని ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి చెందేందుకు వీలుగా జన్మభూమి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వీటిని పరిష్కరించడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వం పట్ల సంతృప్త స్థాయిని పెంచేందుకు కృషి చేస్తున్నారు. జన్మభూమి కింద వ్యక్తిగత అర్జీలు 64278 రాగా, వాటిలో 62042 పరిష్కరించారు. కమ్యూనిటీ ఆర్థికేతర అర్జీలు 1.46 లక్షలు రాగా వాటిలో 1.44 లక్షల మేరకు పరిష్కరించడం గమనార్హం. వ్యక్తిగత అర్జీలు ఎక్కువగా నెల్లూరు నుంచి రాగా, తక్కువగా విజయనగరం నుంచి వచ్చాయి. సమస్యల పరిష్కారంలో కృష్ణా జిల్లా 99.86 శాతంలో మొదటి స్థానంలో ఉండగా, 95.86 శాతంలో విజయనగరం చివరి స్థానంలో ఉంది. ఇప్పటివరకూ రాష్ట్రంలో 1.66 లక్షల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు.

కలెక్టర్లకు ఏదీ కనెక్టివిటీ?

- భారీ కంపెనీలకు భూసేకరణ చిక్కు
- రైతులను ఒప్పించటంలో వైఫల్యం
- కియా కంపెనీ ఉద్యోగులకు సౌకర్యాల లేమి
- హెచ్‌వోడీ, కమిషనర్లు, ఎండీల వద్ద పేరుకుపోయిన ఫైళ్లు
- సీఎం వేగం అందుకోలేకపోతున్న ఏపీఐఐసీ
- నేటి నుంచి కలెక్టర్ల సదస్సు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 17: మరో ఏడాదిలో ఎన్నికలు. ఆలోగా ప్రారంభించిన ప్రతిష్ఠాత్మక కంపెనీలు పనిచేయాలి. దానికోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను పరుగెడుతూ అందరినీ పరుగులు పెట్టిస్తున్నారు. వయసును కూడా ఖాతరు చేయకుండా కాళ్లకు బలపం కట్టుకుని, కొత్త కంపెనీల కోసం చేతిలో ఫైళ్లు పట్టుకుని దేశదేశాలు తిరుగుతున్నారు. మరి వచ్చిన కంపెనీల చుట్టూ మౌలిక సదుపాయాలు, తరలివచ్చే ఉద్యోగుల జీవన వికాసం కోసం తగిన ఏర్పాట్లు చేయాల్సిన కలెక్టర్లు, ఏపీఐఐసీ అధికారులు ఏం చేస్తున్నారు? ఒక ఎకరా, రెండెకరాల కోసం మొత్తం ప్రాజెక్టే నిలిచిపోయే పరిస్థితి వస్తే, రైతును ఒప్పించే కనెక్టివిటీ కూడా లేకపోతే ఆ ప్రాజెక్టులు ఎప్పటికి పూర్తవుతాయి? కంపెనీల సమీపంలో ఉద్యోగులకు ఇళ్ల సౌకర్యం కల్పించేందుకు చేతిలో ఉన్న భూములు కేటాయించాల్సిన ఏపీఐఐసీ ఏం చేస్తోంది? ఇలాగైతే కొత్త కంపెనీలు వస్తాయా?.. ఇదీ పలు జిల్లాల్లో నెలకొన్న పరిస్థితి. మీరు ఓ పది ఎకరాల్లో ఓ కంపెనీ పెట్టాలనుకోండి. తొమ్మిది ఎకరాలు మీవే అయినప్పటికీ, మధ్యలో ఒక్క ఎకరం వేరే రైతుది ఉందనుకోండి. మీరేం చేస్తారు? ఆ రైతును బుజ్జగించో, బతిమాలో ఎంతోకొంత ఖరీదుకట్టి ఆ ఎకరాను కొనుగోలు చేస్తారు. మరి ఏకంగా ప్రభుత్వమే ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టులకే అలాంటి అడ్డంకులొస్తే కలెక్టర్లు, జిల్లా అధికారులు భూమి కోల్పోయే సదరు రైతులను పిలిపించి, వారిని మెప్పించి ఒప్పించాల్సి ఉండగా, ఆ బాధ్యత నెరవేర్చటంలో వారు చేతులెత్తేస్తున్నారన్న విమర్శలున్నాయి. ప్రజల నాడి తెలుసుకుని ఆమేరకు నడవకపోతే ఇప్పుడున్న రాజకీయ క్లిష్ట పరిస్థితిలో ప్రాజెక్టులు పూర్తికావన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కేవలం ఒకటి నుంచి ఐదు ఎకరాలు కోల్పోయే రైతులను ఒప్పించలేకపోవడం వల్లే కొన్ని ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు ఆలస్యమవుతున్నాయి. తిరుపతి సమీపంలో హెచ్‌సీఎల్ కంపెనీకి సంబంధించి భూసేకరణ పూర్తయింది. అయితే ముందు రోడ్డుకు సంబంధించి రెండు, మూడు ఎకరాలు కోల్పోనున్న ఒకే ఒక్క రైతు ఎక్కువ ధర అడుగుతున్నారు. దాంతో ఆ సమస్య అలాగే ఉండిపోయింది. ఫలితంగా ఇప్పటివరకూ భూమిని హెచ్‌సీఎల్‌కు స్వాధీనం చేయలేని దుస్థితి నెలకొందంటున్నారు. దాదాపు 3వేల మందికి ఉపాధి చూపే ఆ ప్రాజెక్టు కేవలం ఒక్క రైతుతో మాట్లాడే సామర్థ్యం లేని ఫలితంగా ఆలస్యమవుతున్న పరిస్థితిపై విస్మయం వ్యక్తమవుతోంది. దేశంలోని అన్ని రాష్ట్రాలను వెనక్కినెట్టి ప్రపంచ దిగ్గజ కంపెనీ కియా మోటార్స్‌ను చంద్రబాబు సాధిస్తే, అక్కడ బయట ఇప్పటివరకూ కొత్తగా వచ్చే ఉద్యోగుల కోసం ఒక్క సౌకర్యం కూడా కల్పించలేని జిల్లా యంత్రాంగం, ఏపీఐఐసీ పనితీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. పెద్ద కంపెనీలు వస్తున్న నేపథ్యంలో పనిచేస్తున్నచోట నివాస సదుపాయం కల్పించాల్సి ఉంది. ఆమేరకు ఏపీఐఐసీ తన వద్ద ఉన్న భూములను ఇండస్ట్రియల్ హౌసింగ్ కోసం కేటాయిస్తే, ఇళ్లు నిర్మించే కంపెనీలు వాటిని కొనుగోలు చేసి, ఉద్యోగులకు ఇళ్లు కేటాయించే వెసులుబాటు ఉంటుంది. ఈ మొత్తం వ్యవహారంలో ప్రభుత్వానికి గానీ, ఏపీఐఐసీకి గానీ వచ్చే ఆర్థిక భారం ఏమీ ఉండదు. చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో పెట్టుకున్న దరఖాస్తులన్నీ ఏపీఐఐసీలో పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. ఇప్పటినుంచి ప్రారంభిస్తే గానీ ఇళ్ల నిర్మాణాలు అప్పటికి పూర్తికావు. కేంద్రం 500 ఎకరాలతో తిరుపతి వద్ద మంజూరు చేసిన ఎలక్ట్రానిక్ క్లస్టర్‌లో భూసేకరణ వ్యవహారంపై ఎలాంటి సమస్యలు లేకపోయినా, అక్కడ పనిచేసే ఉద్యోగులు సుమారు 20 కిలోమీటర్ల దూరం నుంచి రావలసి వస్తోంది. అదే వారికి సమీపంలోనే ఇండస్ట్రియల్ హౌసింగ్‌లో ఏపీఐఐసీ ద్వారా ప్రైవేటు హౌసింగ్ కంపెనీలతో ఇళ్లు కట్టిస్తే ఉద్యోగులకు భరోసా ఉంటుందన్న కనీస ఆలోచన అధికారులకు లేకపోవడం విచారకరమన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. 20వేల మంది ఉద్యోగులు, 7వేల కోట్ల వ్యయంతో నిర్మించనున్న కియా కంపెనీ నుంచి తొలి ఉత్పత్తి వచ్చే ఏడాది జూన్‌లోగా ప్రారంభించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి ఉన్నారు. ఆ జిల్లాకు చెందిన మంత్రి కాలవ శ్రీనివాసులు, పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డిని ఎప్పటికప్పుడు పురోగతిని పర్యవేక్షించాలని ఇప్పటికే ఆదేశించారు. దాంతోవారు అక్కడికి వెళ్లి స్వయంగా సమీక్షిస్తున్నారు. అటు చంద్రబాబు కూడా కియా త్వరగా ప్రారంభించాలన్న తపనతో పనిచేస్తున్నారు. అయితే దాదాపు 20వేల మంది ఉద్యోగులు రావలసిన ఆ కంపెనీ బయట ఇప్పటివరకూ ఒక్క కనీస సౌకర్యం కోసం కల్పించడంలో జిల్లా యంత్రాంగం, ఏపీఐఐసీ విఫలమయ్యాయి. కంపెనీ నుంచి బయటకు వచ్చే ఉద్యోగిమల విసర్జనకు పోవాలంటే 20కిలోమీటర్ల దూరంలోని పెనుగొండకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని చెబుతున్నారు. కియా తొలి కారు బయటకు వచ్చేలోపు ఆ పరిసర ప్రాంతాల్లో ఇళ్లు, ఇతర సౌకర్యాలు కల్పిస్తేనే అక్కడకు బయట నుంచి ఉద్యోగులు వచ్చే అవకాశం ఉందన్న కనీస విషయాన్ని కూడా జిల్లా అధికారులు విస్మరించడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో కేవలం ఒకటి, రెండు ఎకరాల రైతులను ఒప్పించడంలో అధికారుల వైఫల్యం హంద్రీ-నీవా సుజల స్రవంతి పనుల పురోగతి నిలిచేందుకు కారణమవుతోందంటున్నారు. ఇప్పటికే నీరు ధర్మవరం వరకూ వచ్చింది. ఇక కుప్పం వరకూ రావల్సి ఉండగా, మధ్యలో చిన్నచిన్న సమస్యలను పరిష్కరించడంలో జిల్లా అధికారులు చొరవ చూపకపోవడంతో పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టరు కూడా పనులు ఆపేయడంతో ప్రాజెక్టు వ్యయం పెరిగిపోతోంది. చివరకు ఆ భారం కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సిన పరిస్థితి నెలకొంది. అదేదో జిల్లా అధికారులే రైతులతో మాట్లాడి ఒప్పిస్తే ఈ సమస్యలు వచ్చేవి కావంటున్నారు. భూమి కోల్పోయే రైతులను ఒప్పించటానికి బదులు, వారు కోర్టుకు వెళితే దానికి ప్రతిగా, కౌంటర్ ఫైల్ దాఖలు చేయడం వల్ల సమయం వృథానే అని అంటున్నారు. దీనివల్ల షెడ్యూల్ ప్రకారం నీరు ఇప్పటికే పుంగనూరు దాటాల్సి ఉండగా, ఇంకా అనంతపురం జిల్లా ధర్మవరంలోనే ఉందని టీడీపీ నేతలు వాపోతున్నారు. ప్రధానంగా ఏపీఐఐసీ చంద్రబాబు వేగంలో పదిశాతం కూడా అందుకోలేకపోతోందన్న విమర్శలున్నాయి. ఏపీఐఐసీకి పూర్తిస్థాయి ఎండీ లేకపోవడం, దానికి ఇన్చార్జిగా వ్యవహరిస్తోన్న అహ్మద్ బాబు రియల్ గవర్నెన్స్‌కే ఎక్కువ సమయం కేటాయించడంతో పనులు ఆలస్యమవుతున్నాయన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఏపీఐఐసీకి పూర్తిస్థాయి ఎండీని నియమించాల్సిన అవసరం ఉందంటున్నారు. ఇక హెచ్‌వోడీ, కమిషనర్లు, ఎండీలు తమ శాఖల్లో పేరుకుపోయిన ఫైళ్లను క్లియర్ చేయటం లేదన్న విమర్శలున్నాయి.


‘చాలామంది ఆఫీసర్లు వాళ్ల శాఖల పని బదులు ఎక్కువసేపు సీఎం చుట్టూ తిరిగి, ఆయనకు ఏదైతే ఇష్టమో ఆ పనిచేసి ఆయనను మెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. అదేమంటే అంతా సీఎంవో చూసుకుంటున్నప్పుడు, వాళ్లే మానిటరింగ్ చేస్తున్నప్పుడు మేం అంతకంటే ఏంచేస్తామంటున్నారు’ అని ఓ మంత్రి వాపోయారు.

సాంకేతికాంశాలపై చర్చించాకే త్రైపాక్షిక భేటీ

ఆర్డీఎస్‌పై హరీష్‌కు మంత్రి ఉమా లేఖ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 17: రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్)కు సంబంధించిన సాంకేతిక అంశాలపై అధికారుల స్థాయిలో చర్చించాకే త్రైపాక్షిక సమావేశం నిర్వహిద్దామని తెలంగాణ జలవనరుల శాఖ మంత్రి హరీష్‌రావుకు ఏపీ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సూచించారు. ఈమేరకు బుధవారం ఆయన హరీష్‌రావుకు లేఖ రాశారు. కృష్ణా వాటర్ డిస్‌ప్యూట్స్ ట్రిబ్యునల్ గతంలో 39.9 టీఎంసీలను కేసీ కెనాల్‌కు విడుదల చేయాలని, అందులో 10 టీఎంసీలు తుంగభద్ర డ్యామ్ నుంచి విడుదల చేయాలని సూచించిందని తెలిపారు. కేసీ కెనాల్ పరిధిలోని పంటలను కాపాడేందుకు వీలుగా ఈ నీటిని తుంగభద్ర డ్యామ్ నుంచి విడుదల చేయాల్సి ఉందని లేఖలో తెలిపారు. ఆర్డీఎస్ ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా దాదాపు 15 సెంటిమీటర్ల మేర ఎత్తు పెరిగే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన నివేదికలో ఎత్తు పెంపు గురించి ప్రస్తావించలేదని గుర్తుచేశారు. ఈనేపథ్యంలో తెలంగాణ, ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాల మంత్రులతో త్రైపాక్షిక సమావేశానికంటే ముందు అధికారుల స్థాయిలో చర్చలు జరగాల్సి ఉందన్నారు. ఇందులో సాంకేతిక, హైడ్రోలాజికల్ అంశాలు ఇమిడి ఉన్నాయన్నారు.



రాజోలిబండ ఆనకట్ట వద్ద అడుగులోతు తవ్వకాలు జరిగిన దృశ్యం

చర్చలతో ఫలితం శూన్యం!

కర్నాటక జలచౌర్యం కట్టడే పరిష్కారం ■ తెలంగాణ మంత్రి లేఖపై స్పందించిన సీమ రైతులు

ఆదోని, జనవరి 17: చర్చలతో ఆర్డీఎస్ సమస్యకు ఎలాంటి పరిష్కారం లభించదని, కర్నాటక జలచౌర్యాన్ని కట్టడి చేయడమే ఈ సమస్యకు పరిష్కారమని సీమ రైతులు, నీటి పరిరక్షణ సంఘాల నాయకులు స్పష్టం చేస్తున్నారు. రాజోలిబండ ఆనకట్ట నిర్మాణంపై మాట్లాడుకుందాం రమ్మంటూ తెలంగాణ రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి టీ.హరీష్‌రావు ఆంధ్ర-కర్నాటక రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రులకు లేఖలు రాయడంతో ఆర్డీఎస్ సమస్య మళ్లీ తెరపైకి వచ్చింది. అయితే ఆంధ్ర రైతాంగం మాత్రం ఆనకట్టపై నిర్మాణాలు చేపట్టడం, పూడికతీత పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తోంది. 2017 జనవరి చివరి వారంలో రాజోలిబండ ఆనకట్ట వద్ద ఆంధ్ర రాష్ట్ర అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కర్నాటక, తెలంగాణ అధికారులు నిర్మాణం పనులు చేపట్టారు. దీన్ని ఆంధ్ర రాష్ట్ర అధికారులు, రైతులు తీవ్రంగా వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. దీంతో అప్పట్లో రాజోలిబండ ఆనకట్ట నిర్మాణాలు చేప్టటకుండా పోలీసు పహారా కూడా పెట్టారు. మళ్లీ ఇప్పుడు అదే అంశంపై తెలంగాణ మంత్రి హరీష్‌రావు ప్రకటన చేయడంతో ఆంధ్ర ప్రాంతం రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. రాజోలిబండ ఆనకట్ట ఎత్తు పెంచినా, పూడిక తీసినా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు అదనంగా ఒక్క నీటి చుక్క కూడా రాదని ఈప్రాంతం రైతులు, రాయలసీమ నీటి పరిరక్షణ కమిటీ నాయకులు ఆదినారాయణరెడ్డి, తుంగభద్ర దిగువ కాలువ నీటి పరిరక్షణ సంఘం అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్ అంటున్నారు. కర్నాటక రాష్ట్ర రైతాంగం జలచౌర్యాన్ని అరికడితేనే తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన నీరు సరఫరా అవుతుందని, లేదంటే ఎలాంటి ఫలితం లేదని ఆంధ్ర రాష్ట్ర అధికారులు కూడా పేర్కొంటున్నారు. రాజోలిబండ ఆనకట్ట అజమాయిషీ కర్నాటక ఆధీనంలో ఉంది. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రానికి నీటిని సరఫరా చేసే ఎడుమ కాలువ 42 కిలోమీటర్లు కర్నాటక రాష్ట్రంలోనే ఉండడం వల్ల అక్కడి రైతులు నీటిని వాడుకుంటున్నారు. ఆర్డీఎస్ నీటి పంపకంలో కర్నాటక రాష్ట్రానికి 1.25 టీఎంసీలు కేటాయించారు. 10 వేల ఎకరాలకు మాత్రమే కర్నాటకలో సాగునీరు సరఫరా చేయాలి. అయితే కర్నాటక రైతులు తమకు కేటాయించిన నీటికన్నా ఐదు నుంచి ఆరు టీఎంసీలు అక్రమంగా ఎడమ కాలువ ద్వారా వినియోగించుకుంటూ ఏకంగా 50 వేల ఎకరాల ఆయకట్టును అక్రమంగా సాగు చేస్తోంది. అందువల్ల తెలంగాణకు కేటాయించిన 15.9 టీఎంసీల నీరు అస్సలు సరఫరా కాకుండా పోతోంది. ఫలితంగా తెలంగాణ ప్రాంతంలోని గద్వాల, ఐజ, ఆర్‌ఆర్ కాలువ, పులికల్, రాజాపురం, శాంతినగర్, వడ్డేపల్లి తదితర ప్రాంతాలకు సాగు, తాగునీరు అందని పరిస్థితి. తెలంగాణ రైతుల నోట్లో కర్నాటక రైతాంగం ప్రభుత్వం కలిసి మట్టి కొడుతున్నాయి. ఇది అక్షర సత్యం. అయితే కర్నాటక జలచౌర్యంపై తెలంగాణ ప్రభుత్వం నోరు మెదపడం లేదు. మరోవైపు నీటి వివాదాలు సృష్టించటం వల్ల రెండు తెలుగు రాష్ట్రాల మధ్య విభేదాలకు ఆస్కారాన్ని తెలంగాణ నేతలు కల్పిస్తున్నారని ఆంధ్ర రైతాంగం పేర్కొంటోంది. వాస్తవంగా రాజోలిబండ ఆనకట్ట ప్రాంతంలో 100 కిలోమీటర్ల వరకు ఆంధ్ర ప్రాంతంలో ఆనకట్టలు, కాలువలు లేవు. రాజోలిబండ ఆనకట్ట గేట్లు తెరిచినప్పుడు లేదా ఆనకట్ట పైభాగం నుంచి నీరు ప్రవహించినప్పుడు మాత్రమే ఆంధ్ర రాష్ట్రం పరివాహక ప్రాంతంలో ఉన్న తుంగభద్ర నదికి నీరు వచ్చి రాంపురం కెనాల్, ఖగ్గల్ ఆనకట్టకు చేరుతుంది. అదనపు ప్రాజెక్టులు లేనందున రాజోలిబండ ఆనకట్ట నుంచి నీటిని వాడుకునే అవకాశాలు లేవు. అయితే తెలంగాణ నేతలు మాత్రం ఆంధ్ర నాయకులు జలచౌర్యం చేస్తున్నారని ప్రాంతీయ విభేదాలకు అజ్యం పోస్తున్నారు. గత సంవత్సరం కూడా రాజోలిబండ ఆనకట్ట వద్ద నిర్మాణాలకు చర్యలు తీసుకున్నారు. అయితే వీటిని సీమరైతులు అడ్డుకున్నారు. వాస్తవానికి రాజోలిబండ ఆనకట్ట ఎత్తు పెంచినా, పూడిక తీసిన కర్నాటకకే లాభం చేకూరుతుంది. ఆంధ్ర రాష్ట్రానికి కేటాయించిన 9 టీఎంసీల నీటిని సరఫరా చేసే కుడి కాలువ నిర్మాణం జరగలేదు. ఆర్డీఎస్ నుంచి ఆంధ్రకు 5 టీఎంసీల నీటిని కేటాయిస్తూ బ్రిజేష్‌కుమార్ కమిటీ తీర్పు చెప్పింది. అయితే ఆ నీటిని సరఫరా చేసేందుకు కాలువే లేదు. కాలువ నిర్మాణం పనులు సర్వేకే పరిమితమయ్యాయి. కాబట్టి తెలంగాణ మంత్రి హరీష్‌రావుచర్చలు జరిపినా ఫలితం లేదని ఈప్రాంతం రైతులు స్పష్టం చేస్తున్నారు. ముందుగా కర్నాటక జలచౌర్యానికి అడ్డుకట్ట వేసి ఆతరువాత చర్చలు జరిపితినే రాజోలిబండ నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వారంటున్నారు. ఆర్డీఎస్ వద్ద ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా అడ్డుకుంటామని వారు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి రాష్ట్రంలో రాజోలిబండ వల్ల ఎంతో నష్టపోయామని అంటున్నారు. రాజోలిబండ ఆనకట్ట స్లూయిస్‌గేట్లు మూసివేశారు. అలాగే ఇసుక వెళ్ళే షటర్స్ కూడా మూసివేశారు. అందువల్ల ఆనకట్ట వద్ద పూడిక పెరిగిపోతోంది.

కోడూరు బీచ్‌లో ముగ్గురి మృతి

ఉసురుతీసిన విహార యాత్ర

తోటపల్లిగూడూరు, జనవరి 17: విహార యాత్రకు వచ్చి కోడూరు బీచ్‌లో ముగ్గురు విద్యార్థులు మృతిచెందిన సంఘటన నెల్లూరు జిల్లా టిపిగూడూరు మండలంలోని కోడూరు తీరంలో బుధవారం చోటుచేసుకుంది. మనుబోలు మండలం కొమ్మలపూడి గ్రామానికి చెందిన 19మంది యువకులు విహార యాత్ర నిమిత్తం కోడూరు బీచ్‌కు వచ్చారు. సముద్రంలో కేరింతలు కొడుతూ మునుగుతుండగా కెరటాల ధాటికి నలుగురు యువకులు గల్లంతయ్యారు. అందులో పెనుమల్లి యశ్వంత్ (26), పెనుమల్లి దిలీప్ (24), బరిచిత్ వెంకటేష్ (23) విగతజీవులై మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. మరో విద్యార్థి విష్ణువర్ధన్‌ని కృష్ణపట్నం పోర్టుకు చెందిన హోంగార్డు ఆవుల సంజీవి రక్షించి ఒడ్డుకు చేర్చాడు. తోటపల్లి గూడూరు పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాదయాత్ర ముగిశాక బీసీ డిక్లరేషన్

బీసీల ఆత్మీయ సభలో వైఎస్ జగన్ హామీ ■ 64వ రోజుకు మహా సంకల్పయాత్ర



పాపానాయుడు పేటలో మహిళ నుంచి సమస్యల్ని వింటున్న జగన్

ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, జనవరి 17: ఎన్నికల సమయంలో బోయలను ఎస్టీల్లోనూ, రజకులను ఎస్సీల్లోనూ చేరుస్తానని ఘంటాపథంగా చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక మోసం చేశాడని, ఇదేనా వెనుకబడిన తరగతులపై ఆయనకున్న ప్రేమ అని వైకాపా అధినేత, ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. జగన్ చేపట్టిన మహాసంకల్ప పాదయాత్ర 64వ రోజు బుధవారం శ్రీకాళహస్తి, పుత్తూరులో కొనసాగించారు. ఇందులో భాగంగా పాపానాయుడు పేటలో జరిగిన బీసీల ఆత్మీయ సభలో ఆయన పాల్గొన్నారు. రాజకీయాల కోసం కులాలను వాడుకునే సంస్కృతి బాబు పాలనలోనే చూశానని విమర్శించారు. బీసీలకు న్యాయం జరిగింది వైఎస్ పాలనలోనే అని చెప్పారు. అలవికాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి రావడం, ఆపై చేతులు ఊపడంలో బాబు ఘనుడని ఎద్దేవా చేశారు. ఈక్రమంలోనే సాధ్యం కాదని తెలిసినా వెనుకబడిన సామాజిక వర్గాల్లో ఎస్సీ, ఎస్టీల్లో చేరుస్తానని హామీలు ఇచ్చారన్నారు. బోయలను ఎస్టీల్లో చేరుస్తామని అసెంబ్లీలో తీర్మానం చేసి మోసం చేశారన్నారు. ఇదే అంశంపై మూడుసార్లు తీర్మానాలు చేసి ఢిల్లీకి పంపారన్నారు. చంద్రబాబు కుల రాజకీయాలకు ఇదే నిదర్శనమన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తానని బాబు మాట ఇచ్చి నాలుగేళ్లు అవుతున్నా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. శ్రీకాళహస్తి నియోజక వర్గంలో పెరిక బలిజ కులస్థులతోపాటు అగ్నికుల క్షత్రియులకు ఇటీవల కాలంలో బీసీ సర్టిఫికేట్లు ఇవ్వడంలేదని, ఇది ఎంతవరకు ధర్మమని ప్రశ్నించారు. బీసీ సబ్‌ప్లాన్‌ను ప్రారంభించి ఏటా రూ.10 కోట్లు ఇస్తానని హామీ ఇచ్చారా, లేదా అని జగన్ సభికులను ప్రశ్నించారు. పాదయాత్ర పూర్తయిన తరువాత బీసీ గర్జన జరిపి బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తానన్నారు. కుమ్మరులకు ఎమ్మెల్యేగాగాని, ఎమ్మెల్సీగాగాని అవకాశం కల్పిస్తానన్నారు. అలా కాని పక్షంలో టీటీడీ, శ్రీకాళహస్తి పాలక మండలిలో స్థానం కల్పించి బీసీల పట్ల తనకున్న ప్రేమాభిమానాలను చాటుకుంటానన్నారు. ఒక్కసారి అధికారం ఇచ్చి చూడండని, మద్యాన్ని రూపుమాపుతానన్నారు. ఆ పనిచేసిన తరువాత రెండోసారి మీ వద్దకు ఓట్ల కోసం వస్తానని ప్రజల హర్షధ్వానాల మధ్య అన్నారు. హాస్టల్స్‌లో ఉండకుండా ఇంటి వద్ద నుంచి విద్యాభ్యాసం చేస్తున్న పిల్లల కోసం ఏడాదికి రూ.25వేలు ఇప్పిస్తానన్నారు. చదువుకునే ఆడపిల్లలకు ఏడాదికి రూ.15వేలు అందిస్తానన్నారు. 60 ఏళ్ల వృద్ధులకు రూ.2వేలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన 45 సంవత్సరాల గృహిణికి రూ.2వేలు పెన్షన్‌గా అందిస్తామన్నారు.

సామాన్యులపై కేసులు! బడా బాబులకు జేజేలు!!

కోడి పందేలపై పాలకుల ద్వంద్వ వైఖరి పట్ల సర్వత్రా నిరసన

ఆంధ్రభూమి బ్యూరో

కాకినాడ, జనవరి 17: కోడి పందేలపై పాలకుల ద్వంద్వ వైఖరికి సామాన్యులు బలవుతున్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా కోడి పందాలకు సై అన్న సగటు మనిషి ఆనక పోలీసులు అనుసరిస్తున్న వైఖరితో సరదా తీరిపోతోంది. సంక్రాంతికి పది పదిహేను రోజుల ముందుగానే కోడి పందేలపై రాష్ట్ర ఉప ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప నుండి అధికార పార్టీకి చెందిన పలువురు నేతలు కోడి పందేలకు అనుకూలంగా వ్యవహరించారు. తూర్పు గోదావరి జిల్లాలో పలువురు ప్రజాప్రతినిధులు దగ్గరుండి మరీ పందేలు నిర్వహించారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల సమక్షంలో అట్టహాసంగా కోడి పందేలు నిర్వహించారు. ముఖ్య నేతల మద్దతు పుష్కలంగా ఉండటం, గతంలో లేని విధంగా ప్రభుత్వం నుండి కోడి పందేలపై సానుకూల ప్రకటనలు రావడంతో పందాలరాయుళ్లు బరి తెగించారు. మరోవైపు సుప్రీంకోర్టు నుండి విడుదలైన ఆంక్షలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అయితే పోలీసుల దాడులు మాత్రం సామాన్యులకే పరిమితమయ్యాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దగ్గరుండి కోడి పందాలు ఆడించిన ప్రజాప్రతినిధులు, ముఖ్య రాజకీయ పార్టీల నేతల జోలికి పోలీసులు వెళ్లకుండా జాగ్రత్త పడుతున్నారు. అయితే బడాబాబుల వద్ద ప్రాపకం లేని చిన్నా చితకా గ్రామస్థాయి నాయకులు, సంక్రాంతి సంబరాలను ఉత్సాహంగా జరుపుకునేందుకు పట్టణాల నుండి పల్లెలకు వెళ్ళిన వారిపై పోలీసులు కేసులు బనాయిస్తున్నారు. అది కూడా కీలకమైన భోగి, సంక్రాంతి రోజులను మినహాయించి, మంగళ, బుధవారాల్లో తూర్పు గోదావరి జిల్లాలో కేసులు నమోదు చేసేందుకు పోలీసులు ముందుకువచ్చారు. ముఖ్యంగా భవిష్యత్తులో సుప్రీంకోర్టు నుండి ఇబ్బంది లేకుండా, రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకే చిన్నా చితకా వ్యక్తులపై కేసులు బనాయించి, ఫలానా ప్రాంతంలో ఇన్ని కేసులు నమోదు చేసి, ఇంతమందిని అరెస్టు చేశామని చూపించే పనిలో అధికారులున్నారు. మరోవైపు రాష్ట్రహోంమంత్రి సైతం అంతా అయిపోయాక కోడి పందేలు ఆడేవారిపై కేసులు నమోదు చేస్తున్నారా? అని డీజీపీని బుధవారం అడిగినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో బడా పందేల రాయుళ్లకు మినహాయింపునిస్తూ, సామాన్యులపై కేసులు నమోదు చేసే పనిలో పోలీసులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

పాణ్యం, జనవరి 17: కర్నూలు జిల్లా పాణ్యం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సును కారు ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న పద్మావతి(25) అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ రవికుమార్(22), చంద్రమౌళి, హేమచంద్ర నాయుడును కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో రవికుమార్ చనిపోయాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ హేమచంద్రగౌడు మరణించాడు. హరిప్రసాద్ (18), చంద్రమౌళి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరంతా మహానంది మండలం తిమ్మాపురం గ్రామానికి చెందినవారు. కర్నూలుకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం బారిన పడ్డారు.

శ్రీశైలంలో వేడుకగా పూర్ణాహుతి

శ్రీశైలం, జనవరి 17: శ్రీశైలంలో జరుగుతున్న సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. యాగశాలలో బుధవారం ఉదయం అర్చకులు శాస్త్రోక్తంగా హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. నందీశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. త్రిశూల స్నానం అనంతరం ధ్వజావరోహణ గావించారు. గురువారం స్వామి అమ్మవార్లకు పుష్పోత్సవం, శయనోత్సవం, అశ్వవాహన సేవ నిర్వహిస్తారు. దీంతో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

సికింద్రాబాద్- రక్సాల్ మధ్య ప్రత్యేక రైళ్లు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: సికింద్రాబాద్-రక్సాల్-సికింద్రాబాద్ మధ్య అదనపు రద్దీని నివారించేందుకు గాను 20 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ నెల 23, 30, ఫిబ్రవరి 6, 13, 20, 27, మార్చి 6, 13, 20, 27 తేదీల్లో సికింద్రాబాద్ నుంచి నెం.07091 రైలు బయలుదేరి రక్సాల్ చేరుకుంటుంది. అలాగే తిరుగు ప్రయాణంలో ఈ నెల 26, ఫిబ్రవరి 2, 9, 16, 23, మార్చి 2, 9, 16, 23, 30 తేదీల్లో రక్సాల్ నుంచి నెం.07092 రైలు బయలు దేరుతుందని రైల్వే వెల్లడించింది.

రాయలసీమ జిల్లాల్లో హైకోర్టు ఏర్పాటు చేయాలి

చింతామోహన్ డిమాండ్

తిరుపతి, జనవరి 17: రాయలసీమ జిల్లాల్లో హైకోర్టును ఏర్పాటు చేయాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతా మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద డాక్టర్ చింతా మోహన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతానుభవాలను మరచి తిరిగి అమరావతిలోనే అభివృద్ధి కేంద్రీకరణపై దృష్టిసారిస్తున్నారని ఆరోపించారు. గతంలో హైదరాబాదు కేంద్రంగా అభివృద్ధి చేసిన కారణంగానే రాష్ట్ర విభజన తరువాత నవ్యాంధ్రప్రదేశ్‌కు కనీసం రాజధాని కూడా లేకుండా పోయిందన్నారు. అలాగే ఆర్థికంగా వెనుకబాటుకు గురైందన్నారు. ఆనాడు చంద్రబాబు నాయుడు అనుసరించిన విధానం వల్లే చివరికి హైకోర్టు కూడా లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. నేడు అమరావతిలోనే అభివృద్ధిని కేంద్రీకరిస్తున్న కారణంగా రాయలసీమ జిల్లాలు వెనుకబాటుకు గురవుతున్నాయని చింతా మోహన్ ధ్వజమెత్తారు.

గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్ 2020 నాటికి పూర్తి


నంద్యాల, జనవరి 17: గుంటూరు - గుంతకల్లు మధ్య 2020 నాటికి డబ్లింగ్ పనులు పూర్తిచేస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ తెలిపారు. ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయన్నారు. అటు గుంటూరు, ఇటు గుంతకల్లు రెండు వైపుల నుంచి ఒకేసారి డబ్లింగ్ పనులు జరుగుతాయని ఆయన తెలిపారు. కర్నూలు జిల్లా నంద్యాల రైల్వేస్టేషన్‌లో బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గుంటూరు - గుంతకల్లు మధ్య నల్లమల అటవీ ప్రాంతంలో కేవలం 55 కిలోమీటర్ల మేర విద్యుదీకరణ పనులు జరుగుతున్నాయని, ఈ నెలాఖరు నాటికి వాటిని పూర్తి చేస్తామన్నారు. ఫిబ్రవరి నెలలో ఈ సెక్షన్‌లో విద్యుత్ రైళ్లు నడుపుతామన్నారు. ఈ సెక్షన్‌లో విద్యుత్ రైళ్లు నడపడంతో వాటి వేగం పెరగడమేకాక కొంత సమయం కలిసి వస్తుందన్నారు. ఆ సమయాన్ని కొత్త రైళ్లు నడిపేందుకు పరిశీలిస్తామన్నారు. ఈ ఏడాది నవంబర్ నెలలో పార్లమెంటు సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి వారి ప్రతిపాదనలు, డిమాండ్లను ఉన్నతాధికారులకు పంపే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గత ఏడాది డిసెంబర్ చివర్లో పార్లమెంటు సభ్యులతో సమావేశం నిర్వహించామని, గుంటూరు డివిజన్‌లో నంద్యాల రైల్వేస్టేషన్ ప్రాధాన్యత రీత్యా మొదటి స్థానంలో ఉందన్నారు. దీనికి తోడు పుణ్యక్షేత్రాలు ఉండడం, టూరిజం అభివృద్ధికి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. అందుకే ఈ సెక్షన్‌లో విద్యుత్ రైళ్లు ప్రారంభించిన అనంతరం వారానికి మూడుసార్లు తిరిగే విజయవాడ - ధర్మవరం, ఎక్స్‌ప్రెస్ రైలు, వారానికి మూడు సార్లు తిరిగే మచిలీపట్నం - బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రతి రోజు తిప్పేందుకు కృషి చేస్తామన్నారు. అదనపు బోగీలు ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తామన్నారు. గుంటూరు డీఆర్‌ఎం జ్యోతి భూమా, నంద్యాల ఎమ్మెల్యే భూమా బ్రహ్మనందరెడ్డి పాల్గొన్నారు.



నంద్యాల రైల్వే స్టేషన్‌లో విలేఖరులతో మాట్లాడుతున్న దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్

సబ్సిడీలు ఎత్తేసేందుకు కుట్ర

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సీపీఐ నేత ధ్వజం



విశాఖపట్నం, జనవరి 17: ఆధార్ అనుసంధానం పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్హులైన నిరుపేదలకు ఇచ్చే సబ్సిడీలను క్రమంగా ఎత్తివేసేందుకు కుట్ర చేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జేవీ సత్యనారాయణ ధ్వజమెత్తారు. ప్రస్తుతం ఆధార్ యునిక్ ఐడీ ఆధారంగానే ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీని నేరుగా వినియోగదారునికే చెల్లిస్తున్నట్టు ప్రచారం చేసుకుంటూ, లబ్ధిదారుని బ్యాంకు ఖాతాకు సబ్సిడీ మొత్తాన్ని చెల్లిస్తోందని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని కూడా లబ్ధిదారుడు ముందుగానే చెల్లించి, అనంతరం బ్యాంకు ఖాతాలకు జమయ్యే మొత్తాన్ని తీసుకుంటున్నాడని ఆయన పేర్కొన్నారు. ఎరువుల సబ్సిడీని కూడా ఇదే విధంగా చెల్లించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని ఆయన విమర్శించారు. భవిష్యత్‌లో సబ్సిడీలు ఎత్తివేసేందుకు దోహదం చేస్తుందనడంలో సందేహం లేదని ఆయన వెల్లడించారు. ఇప్పటికే ఆధార్ యూనిక్ ఐడీ భద్రత పరంగా మంచిది కాదన్నది శాస్త్రీయంగా నిర్ధారణైందని, దీనివల్ల వ్యక్తిగత వివరాలు బహిర్గతం కావడం సాధారణమేనన్నారు. ఇప్పటికే ఆధార్ ఐడీతో పాటు వేలి ముద్రలు, ఐరిష్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని సత్యనారాయణ స్పష్టం చేశారు. ఈ తరుణంలో ఆధార్‌ను అన్నింటికీ అనుసంధానం చేయడం వల్ల ఇబ్బందులు తప్పవని ఆయన హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధార్ యూనిక్ ఐడీ పేరిట తమ బాధ్యతల నుంచి తప్పుకునే ప్రయత్నం చేస్తే మాత్రం ప్రజల నుంచి పెద్దఎత్తున తిరుగుబాటు చేస్తారని ఆయన హెచ్చరించారు.

ఊపందుకున్న పునరావాస ప్రక్రియ

ఇక డిస్ట్రిబ్యూటరీలకు భూసేకరణ ■ భూమికి భూమిగా 83,258 ఎకరాలు

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 17: పోలవరం ప్రాజెక్టులో ప్రధాన అడ్డంకులు తొలగిపోవడంతో ప్రస్తుతం పునరావాస, పునర్నిర్మాణ ప్యాకేజీపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో డిస్ట్రిబ్యూటరీలకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ చేపట్టారు. ఎగువ కాఫర్ డ్యామ్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ రావడంతో నిర్దేశిత పనులన్నీ ఈ ఏడాది పూర్తయ్యే విధంగా కార్యాచరణ తీసుకున్నారు. ఈ క్రమంలో పునరావాస, పునర్నిర్మాణ ప్రక్రియ ఊపందుకుంది. నష్టపరిహారానికి సంబంధించిన పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేసే విధంగా చర్యలు చేపట్టారు. ఈ బిల్లులు అథారిటీకి సమర్పిస్తే తప్ప తదుపరి బిల్లులు వచ్చే అవకాశం లేదు. దీంతో తూర్పు గోదావరి జిల్లా పరిధిలో నష్టపరిహారానికి సంబంధించిన బిల్లులన్నీ సకాలంలో పూర్తయ్యే విధంగా దృష్టి సారించారు. మరో వైపు పెరిగిన అంచనాలకు సంబంధించి సీడబ్ల్యుసీ ఎప్పటికపుడు అడిగే వివరాలను సమర్పించడంతోపాటు, పునరావాస బిల్లులు కూడా సకాలంలో సత్వరం పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టారు. ఒక్క రంపచోడవరం కార్యాలయం పరిధిలోనే పునరావాసానికి సంబంధించి దాదాపు రూ. 2వేల కోట్ల వరకు బిల్లులు సమర్పించాల్సి వుంది.

ప్రస్తుతం పోలవరం డిస్ట్రిబ్యూటరీలకు సంబంధించి భూసేకరణపై దృష్టి పెట్టారు. ఇప్పటికే ప్రధాన కాలువలు, హెడ్ వర్క్సుకు సంబంధించి భూసేకరణ పూర్తయింది. దాదాపు 60వేల ఎకరాల వరకు డిస్ట్రిబ్యూటరీలకు సంబంధించి భూసేకరణ చేయాల్సి వుంది. ప్రస్తుతం దీనిపై దృష్టి కేంద్రీకరించి ఈ ఏడాది చివరి నాటికల్లా పూర్తిచేయాలని కార్యాచరణ తీసుకున్నారు. పోలవరం ప్రాజెక్టుకు మొత్తం 1,65,431 ఎకరాల భూమిని సేకరించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో ఇప్పటి వరకు 1,05,202 ఎకరాలు సేకరించారు. ఇప్పటి వరకు భూసేకరణ నిమిత్తం రూ.4259 కోట్లు చెల్లింపులు చేశారు. ఇంకా సుమారు రూ.6867 కోట్లు చెల్లించాల్సి ఉందని అంచనా వేశారు. అయితే 2013 భూసేకరణ చట్టం ప్రకారం చెల్లింపుల మొత్తం అధికమైంది. ప్రాజెక్టు హెడ్ వర్క్సు మాటెలా ఉన్నప్పటికీ పునరావాస, పునర్నిర్మాణ పథకానికే దాదాపు రూ.39 వేల కోట్లకు అంచనా పెరిగింది. ముంపు మండలాలైన విఆర్ పురం, కుకునూరు, చింతూరు, వేలేరుపాడు, కూనవరం, ఎటపాక మండలాల్లో కొత్త చట్టం ప్రకారం భూముల నష్టపరిహారం చెల్లిస్తున్నారు. పునరావాస ప్యాకేజీలో కూడా అంచనాలు పెరగడంతో ప్రస్తుతం చెక్కుల పంపిణీ వ్యవహారం పశ్చిమ గోదావరి జిల్లాకంటే తూర్పులో ఆలస్యానికి కారణమని తెలిసింది. ఇంకా 60228 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఇందులో ప్రధానంగా డిస్ట్రిబ్యూటరీలకు సంబంధించి ఇపుడు ప్రత్యేకంగా ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని హైరానా పడుతున్నారు. లక్ష్యం మేరకు సాగునీరు అందించాలంటే కేవలం ప్రధాన కాలువలే కాకుండా డిస్ట్రిబ్యూటరీలు కూడా పూర్తి చేయాల్సి ఉంది. ఆ దిశగా అధికారులు చర్యలను ముమ్మరం చేశారు.

మరో వైపు భూమికి భూమిగా కేటాయించేందుకు చర్యలు ఊపందుకున్నాయి. సాగుకు పనికి వచ్చే భూములను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు. తూర్పు గోదావరి జిల్లాలో ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణానికి సంబంధించి 19,426 ఎకరాలు కేటాయించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 2653 ఎకరాలు సేకరించారు. ఖమ్మం జిల్లా నుంచి తూర్పు గోదావరి జిల్లాలో కలిపిన మండలాల్లో 5801 ఎకరాలు, పశ్చిమ గోదావరి జిల్లాలో కలిసిన మండలాల్లో 25410 ఎకరాలు సేకరించారు. ఎడమ ప్రధాన కాల్వకు తూర్పు గోదావరి పరిధిలో 6238 ఎకరాలు, కుడి ప్రధాన కాలువకు 8930 ఎకరాలు, విశాఖ జిల్లా పరిధిలో ఎడమ ప్రధాన కాలువకు 4080 ఎకరాలు, కృష్ణా జిల్లా పరిధిలో కుడి ప్రధాన కాలువకు 3476 ఎకరాలు సేకరించారు. ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో భూమికి భూమిగా 83258 ఎకరాలు ఇవ్వాల్సి ఉంది. ఇందు కోసం రూ.753 కోట్లు ఖర్చు చేశారు. భూమికి భూమిగా మాత్రం పశ్చిమ గోదావరి జిల్లాలో పంపిణీ పూర్తి చేశారు. తూర్పు గోదావరి జిల్లాలో ఇంకా 41,910 ఎకరాలు సేకరించాల్సి వుంది. దీనికి రూ.371 కోట్లు కేటాయించారు. మొత్తం మీద భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయడంతో పాటు సాగుకు అనువైన భూమిని ఆదివాసీలకు భూమికి భూమి విధానంలో కేటాయించి సత్వరం ముంపు ప్రాంతాల్లో పునరావాసాన్ని పూర్తి చేయాల్సి ఉంది.

ఆంధ్రభూమి

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ

గురువారం, 18 జనవరి 2018

తుపాకుల కొరత!

భారత టిబెట్ సరిహద్దు రక్షక దళం - ఇండో టిబెటన్ బార్డర్ పోలీస్ - ఐటిబిపి - లో 'గగన నిఘా' విభాగాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం భద్రతాపటిమను పెంచగల పరిణామం! కానీ దశాబ్దుల తరబడి 'ఐటిబిపి'లో ఈ 'వైమానిక విభాగం' ఏర్పడలేదన్నది విస్మయకరమైన వాస్తవం.. ఏడు లక్షల అరవైవేల 'రైఫిళ్ల'ను 'కార్బయిన్ల'ను కొనుగోలు చేయాలని రక్షణ మంత్రిత్వ శాఖ ఇప్పుడు నిర్ణయించిందట! కానీ ఈ అత్యాధునిక తుపాకులను కొనుగోలు చేయాలని పదమూడు ఏళ్ల క్రితం సైనిక దళాల అధికారులు రక్షణ మంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి చేశారట! పదమూడేళ్ల తరువాత మాత్రమే ప్రభుత్వం నడుం బిగించడం విచిత్రమైన వ్యవహారం. మూడున్నర వేల కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వం ఇప్పుడీ 'రైఫిళ్ల' - తుపాకుల-, కార్బయిన్స్ - తేలికపాటి తుపాకుల - ను సమకూర్చుకోనుంది! కానీ మన రక్షణ దళాలకు కొత్తగా ఎనిమిది లక్షల ఇరవై వేల అత్యాధునిక తుపాకులు అవసరం ఉందట! యుద్ధప్రాతిపదికన ఇప్పుడు కొంటున్న తుపాకుల సంఖ్య కేవలం డెబ్బయి రెండు వేలు. నాలుగు లక్షల పద్దెనిమిది వేల తేలికపాటి తుపాకులు - కార్బయిన్స్ - అవసరమట, కొంటున్నది కేవలం తొంబయి నాలుగువేలు! కొనాలని నిర్ణయించినప్పుడు అవసరమైనన్ని తుపాకులను సమకూర్చుకొనడానికి అభ్యంతరం ఏమిటి?? నిధులు చాలవా?? ఈ పన్నెండు లక్షల తుపాకులు కొన్నట్టయితే దాదాపు ఇరవై ఐదువేల కోట్ల రూపాయలు ఖర్చు కావచ్చు. రెండున్నర లక్షల రూపాయలకు పైగా రక్షణ వార్షిక వ్యయం జరుగుతోంది. అలాంటప్పుడు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన మరో పాతికవేల కోట్లు రూపాయలను కేటాయించలేదా?? అందువల్ల పదమూడు ఏళ్ళ "నానబెట్టిన" తరువాత కూడా కనీసం తుపాకుల సమస్యను కూడ పరిష్కరించుకోలేకపోవడం అంతుబట్టని "రహస్యం.."! మనది ప్రపంచంలో మూడవ పెద్ద రక్షణ దళం. భూతల సైన్యం - ఆర్మీ-లోనే దాదాపు పన్నెండు లక్షల మంది 'సమరవీరులున్నారు'! వీరుకాక లక్షలాది 'సహాయ' సైనికులున్నారు. సరిహద్దు భద్రతామండలి - బిఎస్ఎఫ్ - బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ -, ఐటిబిపి, 'అస్సాం రైఫిల్స్' వంటి అనుబంధ సాయుధ బలగాలు - పారా మిలటరీ ఫోర్స్ - పనిచేస్తున్నాయి! ఇంత ప్రతిష్ఠ ఉన్న ఇంత పరిమాణం ఉన్న రక్షణ బలగాలకు తగినన్ని తుపాకులు లేవన్న ప్రచారం అంతర్జాతీయ సమాజంలో మనకు తలవంపులు తెచ్చే వ్యవహారం! ఉత్తర సరిహద్దులలో నిరంతరం పొంచి ఉన్న చైనా దురాక్రమణ ప్రమాదాన్ని ఎదుర్కొనడానికి వీలుగా మన సైనికుల చేతులలో అత్యాధునికమైన ఆయుధాలు తగినన్ని ఉండడం అనివార్యం! మన సైనికుల చేతులకు తగినన్ని తుపాకులు, వారి కాళ్లకు తగినన్ని 'బూట్లు' లేకపోవడం కారణంగానే యాబయి ఐదేళ్ల క్రితం చైనా మన దేశాన్ని దురాక్రమించగలిగింది! ఈ దురాక్రమణ తరువాత మన సమరపాటవం పదునెక్కిందన్నది ప్రజల విశ్వాసం! కానీ ఇంతవరకు 'భారత టిబెట్ రక్షణ దళం'లో వైమానిక నిఘా విభాగం ఏర్పడలేదన్న వాస్తవం ఈ విశ్వాసానికి విఘాతకరం..

యాబయి ఐదేళ్ల క్రితం మనదేశంలోకి చొరబడిన చైనా యుద్ధం విరమించిన తరువాత ఏకపక్షంగా 'వాస్తవ అధీన రేఖ'ను నిర్ధారించింది! ఈ వాస్తవ అధీన రేఖ - లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ -ను చైనా అప్పటి నుంచి ఇప్పటివరకు ఉల్లంఘిస్తూనే ఉంది. ప్రతి ఏటా వందల సార్లు లడక్‌లో చైనా 'రేఖ'ను దాటి చొరబడడం దశాబ్దులుగా కొనసాగుతున్న మన భద్రతావైఫల్యానికి నిదర్శనం! 'వాస్తవ అధీన రేఖ' - ఎల్ఏసీ - వాస్తవంగా ఎక్కడ ఉన్నదన్న విషయమై ఉభయ దేశాల మధ్యకల అవగాహనలో అంతరం ఉందని 2014వరకు పదేళ్లు కొనసాగిన ప్రచారం! అవగాహనలో 'అంతరం' ఉన్నట్టయితే మన భద్రతాదళాలు సైతం కనీసం కొన్నిసార్లయినా 'రేఖ'ను దాటి చైనా వైపునకు చొరబడి ఉండవచ్చు.. అది జరగలేదు! పైగా ఏకపక్షంగా 'ఎల్ఏసీ'ని నిర్ధారించిన చైనా దురాక్రమణ బుద్ధికి 'అవగాహన' లేకపోవడం ఏమిటి?? చైనా వాదాన్ని మన ప్రభుత్వం కూడ అంగీకరించడం 2014 వరకు జరిగిన కథ! గత మూడేళ్లుగా మన భద్రతా దళాల ప్రతిఘటన ముమ్మరం కావడంతో చైనా చొరబాట్లు కొంతమేరకు తగ్గాయి! కానీ చైనా సరిహద్దులో గస్తీ తిరుగుతున్న 'ఐటిబిపి'లో 'వైమానిక నిఘా విభాగం' దశాబ్దుల క్రితమే ఏర్పడి ఉండినట్టయితే చైనా చొరబాట్లు ఎప్పటికప్పుడు పసికట్టి ప్రతిఘటించడానికి వీలుండేది. 'ఐటిబిపి'లో ఈ గగన నిఘా విభాగం ఇప్పుడు ఏర్పడడం ఇన్ని దశాబ్దుల ప్రమత్తతకు నిదర్శనం..

ఈ 'తుపాకుల' కొనుగోలుకు అంతర్జాతీయ విపణిని ఆశ్రయించాలన్న ప్రభుత్వ నిర్ణయం 'స్వదేశీయ స్ఫూర్తి'కి మరో అపవాదం. మన దేశంలోనే మన రక్షణ బలగాలకు కావలసినన్ని తుపాకులు ఉత్పత్తి కావడం లేదన్న దానికి ఈ నిర్ణయం నిదర్శనం. డెబ్బయి ఏళ్లుగా మనం మన రక్షణకు అవసరమైన తుపాకులు, ట్రక్కులు, జీపులు, బస్సులు తయారు చేసుకొనలేకపోవడం అంతుపట్టని వ్యవహారం. అణుశక్తి చోదిత 'అరిహంత' జలాంతర్గామిని మనం స్వదేశీయ పరిజ్ఞానంతో తయారు చేసుకున్నాము. ముప్పయి రెండేళ్ల నిర్విరామ కృషి తరువాత 'హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్ - హాల్ - 'తేజస్' యుద్ధ విమానాలను స్వదేశీయ పరిజ్ఞానంతో నిర్మించగలిగింది. 2015లో ఈ తేలికపాటి విమానాలు రూపొందాయి. తగినన్ని స్వదేశీయ విమానాలు ఉత్పత్తికావడానికి మరిన్ని ఏళ్లు పట్టవచ్చుగాక. 'ఆకాశ్', 'పృథివి' 'అగ్ని' వంటి క్షిపణులను మనం నిర్మించుకోగలుగుతున్నాం. మన సమరపాటవానికి నిదర్శనం. సుదూర లక్ష్యఛేదక ఐదవ శ్రేణి అగ్ని క్షిపణిని మనం రూపొందించగలిగాము. ఇజ్రాయిల్ వంటి మిత్రదేశాలు ఈ 'క్షిపణుల' నిర్మాణ రంగంలో పరస్పర సహకారం కోరుకుంటుండడం మన స్వదేశీయ పరిజ్ఞానానికి నిదర్శనం. లక్ష కోట్ల రూపాయల వ్యయంతో ఏడు 'నిఘా' నౌకలు, ఆరు జలాంతర్గాములను స్వదేశీయ పరిజ్ఞానంతో నిర్మించడానికి 2015లో ప్రభుత్వం నిర్ణయం చేసింది. రక్షణోత్పత్తుల రంగంలో పెరిగిన జాతీయ విశ్వాసానికి నిదర్శనం! కానీ మౌలికమైన తుపాకుల వంటి ఆయుధాలను, ట్రక్కుల వంటి వాహనాలను దేశంలోనే తగినన్ని ఉత్పత్తి చేయలేకపోవడం సామాన్యులకు అర్థంకాని విచిత్రం. విదేశాల నుంచి కొనుగోలు చేస్తున్న రక్షణోత్పత్తుల మొత్తం ఏదోవిధమైన అవినీతిజాలంలో చిక్కుకొనిపోవడం మన 'రక్షణ'ను నిలదీస్తున్న దశాబ్దుల వైపరీత్యం! 1950వ దశకంలోనే 'రక్షణ'కోసం కొన్న 'జీపులు' అవినీతిగ్రస్తం కావడం మొదలు. బోఫోర్స్ హవిట్జర్ శతఘ్నులు, తాత్రా ట్రక్కులు, 'ఆగస్టా' గగన శకటాలు కొనుగోలు వరకు అవినీతి ప్రతీకలుగా మారడం నడుస్తున్న చరిత్ర. 'బోఫోర్స్' వ్యవహారం మరుగుపడిపోయి చాలా ఏళ్లయింది. హవిట్జర్ శతఘ్నులు కొనుగోలు ఆరంభమవుతోందని 2016లో ప్రచారమైంది. కానీ 'బోఫోర్స్' అవినీతిని మళ్లీ దర్యాప్తు చేయించాలని కోరుతూ ఇటీవల సర్వోన్నత న్యాయస్థానంలో మరో న్యాయయాచిక దాఖలైంది. ఫిబ్రవరిలో తదుపరి న్యాయ విచారణ జరుగుతుందట...

యూదుల స్వభావం.. హైందవ ప్రభావం!

విశ్లేషణ

'ప్రపంచంలో దమనకాండకు బలి అయిన అన్ని మతాలవారికి అన్ని జాతులవారికి ఆశ్రయం కల్పించిన హిందూ జాతికి చెందిన వాడిని కావడం నాకు గర్వకారణం.. రోము నియంతలు తమ పవిత్ర దేవాలయాన్ని పగులకొట్టి పారేసిన సమయంలో శరణార్థులై దక్షిణ భారతదేశానికి వచ్చిన శ్రేష్ఠతమ అవశేష ఇజ్రాయిలీ జాతీయులను మేము అక్కున చేర్చుకుని ఆదరించామని మీకు చెప్పడానికి నేను గర్విస్తున్నాను.. ప్రపంచానికి సహిష్ణుతను సృష్టిగత సమన్వయాన్ని నేర్పించిన ధర్మానికి చెందినవాడను కావడం నాకు గర్వకారణం.. **సహజ సహిష్ణు ప్రవృత్తి మా స్వభావం, అన్నిమతాలను సత్యానికి రూపాలని మేము సంభావిస్తున్నాము'**- అని నూట ఇరవై నాలుగేళ్ల క్రితం అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన 'ప్రపంచ సర్వమత మహాసభ'లో వివేకానంద స్వామి గుర్తుచేయడం చరిత్ర. వివేకానందుడు తన మొదటి ప్రసంగంలోనే 'ఇజ్రాయిల్'ను ప్రస్తావించాడు.. పారశీక జాతికి హైందవ జాతీయులు శతాబ్దుల తరబడి ఆశ్రయం కల్పించిన సంగతి కూడా వివేకానంద స్వామి చికాగో సభలో చేసిన ప్రథమ ప్రసంగంలో ప్రస్తావించాడు! కలియుగం 4995వ సంవత్సరంలో ఈ చికాగో సభ జరిగింది. క్రీస్తుశకం ప్రకారం అది 1893వ సంవత్సరం! అప్పటికి భారతదేశంలో విదేశీయుల దురాక్రమణ పరాకాష్ఠకు చేరుకొని ఉంది. అంధకారం అలముకొని ఉంది.. కానీ మన దేశంలో శరణార్థులుగా ఉండిన 'యూదుల'కు దేశమే లేదు. అలాంటి దాస్యాంధకారంలో సైతం 'వివేకానంద చంద్రుడు' హైందవ జాతీయ స్వభావ ప్రభా కిరణాలను ప్రపంచమంతటా ప్రసరింపజేయగలిగాడు, ఈ హైందవ జాతీయ స్వభావం సార్వజనిక సహిష్ణుత, సృష్టినిహిత సమన్వయం, వైవిధ్య పరిరక్షణ, 'నితాంత అపార భూతదయ..'! ఈ స్వభావం ఉన్నందువల్లనే భారతీయులు రెండు వేల ఏళ్లపాటు 'ఇజ్రాయిలీ'- యూదు- హిబ్రూ జాతీయులను ఆదరించారు, జిహాదీల హత్యాకాండకు గురికాకుండా పారిపోయి మన దేశానికి చేరిన అవశేష పారశీకులకు పదమూడు వందల ఏళ్లుగా భారతదేశం స్వదేశమైంది! ఈ హైందవ జాతీయ స్వభావం యూదులను ప్రభావితం చేయడం చారిత్రక పరిణామ క్రమక్రమం.. వర్తమాన వాస్తవం.. పశ్చిమ ఆసియా చివర, మధ్యధరా సముద్ర తీరంలోని ప్రాచీన యూదు సీమలో 1948లో మళ్లీ స్వతంత్ర యూదు దేశం ఏర్పడినటి నుంచి ఈ వాస్తవం ప్రస్ఫుటిస్తోంది, ఇజ్రాయిల్‌లో 'సర్వమత సమభావ రాజ్యాంగ వ్యవస్థ' ఏర్పడి ఉండడం ఈ వాస్తవం! **సర్వమత సమభావం అనాదిగా భారత జాతీయ స్వభావం, 1948 నుంచి 'ఇజ్రాయిల్ స్వభావం'! ఈ స్వభావ సమానత్వం ప్రస్తుతం మన దేశంలో పర్యటిస్తున్న ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ప్రసంగాలలో ధ్వనించింది!** అంతర్జాతీయ బీభత్సకాండకు వ్యతిరేకంగా మన దేశంతో కలిసి పోరాడడానికి ఇజ్రాయిల్ తన సంకల్పాన్ని పునరుద్ఘాటించడం ఈ ధ్వని.. సహిష్ణుత సర్వమత సమభావానికి ప్రాతిపదిక, అసహిష్ణుత ఏకమతోన్మాదానికి అన్యమత విధ్వంసానికి మూలం! భారతీయ సహిష్ణుత, ఇజ్రాయిల్ సహిష్ణుత ఏళ్ల తరబడి జిహాదీల అసహిష్ణుతతో సమరం సాగిస్తుండడం ఈ పునరుద్ఘాటనకు నేపథ్యం.. మధ్యధరా సముద్రపు తూర్పు తీరంలోని ప్రాచీన పాలస్తీనా ప్రాంతాన్ని 1947లో ఐక్యరాజ్యసమితి రెండుగా విభజించడానికి దారితీసిన పరిణామక్రమం బీభత్సకాండలో ముడివడి ఉంది.. 1947లో 'అఖండ భారత్' మరోసారి ముక్కలు కావడం కూడా బీభత్సకాండ శతాబ్దులపాటు కొనసాగిన ఫలితం! ఉభయ దేశాలను ఐరోపావారు, ఉత్తర ఆఫ్రికా, పశ్చిమ ఆసియాలోని 'జిహాదీ'లు, మతం మార్చిడి మూకలు భయంకర బీభత్సకాండకు బలి చేయగలిగారు. జిహాదీలతో సంఘర్షణ ఫలితంగా మన దేశం భూభాగాలను కోల్పోయింది, ఐరోపావారి బౌద్ధిక బీభత్సకాండ ఫలితంగా మన దేశం మరిన్ని భూభాగాలను కోల్పోయింది! కాని సనాతన హైందవ జాతి ఓడిపోలేదు, శతాబ్దులపాటు సంఘర్షణ సాగించింది. అసహిష్ణుతకు ప్రతిరూపాలైన రోము బీభత్సకారులు పాలస్తీనాలోకి చొరబడి యూదుల ప్రధాన దేవాలయాన్ని ధ్వంసం చేశారు. 'జెరూసలెం' నుంచి పాలస్తీనా- ఇజ్రాయిల్ నుంచి యూదు జాతిని నిర్మూలించారు. క్రీస్తునకు పూర్వం ఒకటవ శతాబ్దిలో 'గ్రీసు' నాగరికతను క్రీస్తుశకం ఒకటవ శతాబ్దిలో 'హీబ్రూ' - యూదు - ఇజ్రాయిల్- జాతిని 'రోము' బీభత్సకారులు ధ్వంసం చేశారు. ఓడిన 'ఇజ్రాయిల్' ప్రజలు ఇతర దేశాలకు పారిపోయారు. భారత్‌లో తప్ప మిగిలిన అన్ని దేశాలలో 'హీబ్రూలు' వివక్షకు వేధింపులకు చిత్రహింసలకు - బీభత్సకాండకు గురికావడానికి కారణం ఆయా విదేశాల ప్రజల సమష్టి మనఃప్రవృత్తి నిహితమైన 'అసహిష్ణుత'.. **తమవి కాని మతాలను భాషలను జాతులను సంస్కృతులను నామరూపాలు లేకుండా నశింపజేయడం అరబ్బుల సమష్టి ప్రవృత్తి, ఐరోపావారి చిత్తవృత్తి, తురుష్కుల వికృతి!** కానీ భారతదేశపు స్వజాతీయులైన హిందువుల సమష్టి ప్రవృత్తి సర్వమత సమభావం, సర్వవైవిధ్య సమభావం! అందువల్లనే యూదులను, పారశీకులను భారతీయులు రక్షించగలిగారు. 1948లో స్వతంత్ర దేశంగా ఏర్పడిన యూదులు తమ కొత్త ఇజ్రాయిల్‌లో సర్వమత సమభావ ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు! ఇదే భారతదేశంలో యూదులు ఆశ్రయం పొందిన ఫలితం..

ప్రాచీన పాలస్తీనా, విభజన ఫలితంగా 'యూదుల' ఇజ్రాయిల్,



'అరబ్బు' పాలస్తీనా పక్క పక్కనే రెండు స్వతంత్ర దేశాలుగా ఏర్పడినాయి. ఇజ్రాయిల్ సర్వమత సమభావ- సెక్యులర్- రాజ్యాంగంగా ఏర్పడగా, 'అరబ్ పాలస్తీనా' జిహాదీ స్వభావంకల ఇస్లాం మత రాజ్యంగా ఏర్పడడం 'సంఘర్షణ' కొనసాగడానికి దోహదం చేసింది! పాలస్తీనాకు తూర్పుగా విస్తరించి ఉండిన 'బాబిలోనియా' సామ్రాజ్య నియంతలు క్రీస్తునకు పూర్వం ఆరవ శతాబ్దిలో యూదులకు చెందిన 'జెరూసలెం' ఆలయాన్ని ధ్వంసం చేశారు. కానీ యూదులు ఆలయాన్ని పునర్ నిర్మించుకున్నారు! క్రీస్తునకు పూర్వం నాలుగవ శతాబ్దిలో 'ఇజ్రాయిల్'- ప్రాచీన పాలస్తీనా- గ్రీసువారికి, బాబిలోనియా నాగరికులకు మధ్య ఆధిపత్య యుద్ధక్షేత్రంగా మారింది! క్రీస్తునకు పూర్వం మూడవ శతాబ్దిలో 'బాబిలోనియా' నాగరికతను గ్రీసువారు ధ్వంసం చేశారు! 'యూదులను' బాబిలోనీయులను నిర్మూలించ యత్నించారు! బాబిలోనియులను గ్రీసు బీభత్సకారుడు అలెగ్జాండర్ తదితరులు మట్టుపెట్టారు! గ్రీసు వారిని 'రోము'వారు, రోము 'నాగరికము'ను క్రైస్తవులు ధ్వంసం చేశారు! 'రోము' మూకలు నశించిన తరువాత పాలస్తీనా - ఇజ్రాయిల్- ఐరోపా వారికి, అరబ్ జాతులకు మధ్య మత యుద్ధాలకు రంగభూమిగా మారింది! క్రీస్తుశకం నాలుగవ శతాబ్దినుంచి విస్తరించిన బైఝాంటైన్ సామ్రాజ్యం రోము నాగరిక అవశేషాలను సైతం తుడిపివేసింది, క్రైస్తవం వర్ధిల్లింది! ఎనిమిదవ శతాబ్ది నుంచి క్రైస్తవం, ఇస్లాం పాలస్తీనాలో పరస్పరం ఢీకొన్నాయి. పదిహేనవ శతాబ్దిలో ఈ 'బైఝాంటైన్' సామ్రాజ్యాన్ని తురుష్క 'ఒట్టమన్' సామ్రాజ్యం వారు ధ్వంసం చేశారు. రాజధాని 'కానిస్టాంట్‌నోపిల్' పేరును 'ఇస్తాన్‌బుల్'గా మార్చారు. పాలస్తీనాలోకి అరబ్బీ ఇస్లాం మతస్థులు వ్యాపించడానికి ఒట్టమన్ సామ్రాజ్యం దోహదం చేసింది! 1918 నాటి మొదటి ప్రపంచ యుద్ధం వరకు పాలస్తీనాలోకి అరబ్ ఇస్లాం మతస్థులు వెల్లువెత్తుతూనే ఉన్నారు. 1947లో విభజనకు ఇదీ నేపథ్యం. ఇలా పంతొమ్మిది వందల ఏళ్లు ప్రాచీన యూదుల సీమ విజాతీయ దురాక్రమణకు గురి అయ్యింది!

'ఒట్టమన్' సామ్రాజ్యం 1918లో పతనం కావడంతో వివిధ దేశాలలో వివక్షకు గురి అవుతూండిన యూదులు తమ ప్రాచీన ఇజ్రాయిల్‌కు తిరిగి రావడం ఆరంభమైంది. మధ్యధరా సముద్ర తీరంలోని హయిఫా నగరాన్ని తురుష్కులనుంచి బ్రిటన్ మిత్ర దేశాల కూటమి స్వాధీనం చేసుకొనడంతో ఒట్టమన్ సామ్రాజ్యం పతనం పూర్తయింది, ఒట్టమన్‌లకు బాసటగా నిలిచిన జర్మనీ పరాజయం పాలయింది! ఈ మొదటి ప్రపంచయుద్ధ సమయంలో బ్రిటన్ మన దేశాన్ని దురాక్రమించి ఉంది. యాభయి ఐదు శాతం దేశాన్ని బ్రిటన్ ప్రత్యక్షంగా పాలించింది, నలభై ఐదు శాతం దేశాన్ని బ్రిటన్ దురాక్రమణదారుల 'పరమోన్నత అధికార'- పారమౌంటసీ- పరిధికి లోబడిన సంస్థానాధీశులు పాలించారు! మొదటి ప్రపంచ యుద్ధ సమయం నాటికి మన దేశంలో బ్రిటన్ దురాక్రమణకు వ్యతిరేకంగా ఉద్యమాలు, సాయుధ ఘర్షణలు మొదలయ్యాయి. లోకమాన్య బాలగంగాధర్ తిలక్ వంటివారు జైళ్లకు వెళ్లివచ్చారు, స్వతంత్ర వీర వినాయక దామోదర్ సావర్కార్ వంటివారు జైళ్లలో మగ్గుతున్నారు. కానీ సైన్యంలో చేరి ఉండిన భారతీయులు వివిధ దేశాలలో బ్రిటన్ తరపున రెండు ప్రపంచ యుద్ధాలలోను పోరాడారు! ఇలా హయిఫా విముక్తికోసం పోరాడినవారు భారతీయ సైనికులు! మైసూరు, హైదరాబాద్, జోధ్‌పూర్ సంస్థానాలకు చెందిన వీరులు, భారతీయ సంప్రదాయ బద్ధులు కాబట్టి హయిఫాకు తరుష్కులనుంచి విముక్తి లభించింది! సమరంలో వెన్నుచూపకపోవడం ఈ సంప్రదాయం! 'విజయమా? వీర స్వర్గమా?' అన్నవి మాత్రమే ప్రత్యామ్నాయాలు! 'యోగయుక్తుడైన పరివ్రాజకుడు, యుద్ధంలో వెన్ను చూపని, అభిముఖహతుడైన వీరుడు- వీరిద్దరూ సూర్యమండలాన్ని ఛేదిస్తారు!' అన్న భారతీయ సంప్రదాయం.. పరివ్రాజకుడు సన్యాసి. రణాభిముఖహతుడు అమరవీరుడు. సూర్యమండలాన్ని ఛేదించుకొని వీరిద్దరూ మోక్షం వైపు సాగిపోతారు!

"ద్వావిమౌ పురుషోరాజన్
సూర్యమండల భేదినౌ
పరివ్రాట్ యోగయుక్తశ్చ
రణే చాభి ముఖో హతః"

అలా నలబయి నలుగురు భారతీయ సైనికులు 'హయిఫా'ను విముక్తి చేయించడం కోసం అమరులయ్యారు! 'హయిఫా' విముక్తి బ్రిటన్ వారి యుద్ధ విజయం కాదు, భారతీయుల నైతిక విజయం. ఈ నైతిక విజయం 'ఇజ్రాయిల్' అవతరణకు దారితీసింది. బెంజమిన్ నెతన్యాహు ఆదివారం ఢిల్లీలో తీన్‌మూర్తి స్మారకం వద్ద అంజలి ఘటించడానికి ఇదంతా నేపథ్యం! తీన్‌మూర్తి-హయిఫా స్మృతి కేంద్రం ఇజ్రాయిలీ ప్రజలకు ఇలా చారిత్రక స్ఫూర్తికేంద్రమైంది! 'హయిఫా' విముక్తికి వందేళ్లు, ఇజ్రాయిల్ పునరవతరణకు డెబ్బయి ఏళ్ళు.

ఇజ్రాయిల్ విస్తీర్ణం దాదాపు ఎనిమిది వేల చదరపు మైళ్లు- ఇరవై వేల చదరపు కిలోమీటర్లు! మన దేశం వైశాల్యం పన్నెండున్నర లక్షల చదరపు మైళ్లు- ముప్ఫయి రెండు లక్షల చదరపు కిలోమీటర్లు! ఇలా మన దేశం ఇజ్రాయిల్‌కంటే నూట యాభై రెట్లు పెద్దది. కానీ స్వభావ సామ్యం ఉభయ దేశాల స్నేహానికి సమాన ప్రాతిపదిక! నూట ముప్ఫయి కోట్ల భారతీయులు ఎనభయి మూడు లక్షల ఇజ్రాయిలీల 'స్వభావ సామ్యం' ప్రపంచ ప్రజాస్వామ్య వ్యవస్థ- వరల్డ్ డెమోక్రాటిక్ ఆర్డర్‌ను 1948 నుంచి పెంపొందిస్తోంది! ఇజ్రాయిల్ జనాభాలో ఐదవ వంతు అరబ్ ముస్లింలు! హీబ్రూ భాష అధికార భాష, అరబ్బీ భాష రెండో అధికార భాష! ఈ సర్వమత సమభావ వ్యవస్థను ధ్వంసం చేసి ఇస్లాం మత రాజ్యాన్ని స్థాపించడానికై ఇజ్రాయిల్‌తో అరబ్ దేశాలవారు నాలుగు సార్లు యుద్ధం చేశారు! తొలి దురాక్రమణ ఇజ్రాయిల్ ఏర్పడిన రోజే జరిగింది! కానీ 'సర్వమత సమభావం' గెలిచింది! ఇజ్రాయిల్ గెలిచింది! భారతీయ సంస్కృతి స్వభావం గెలిచింది...

-హెబ్బార్ నాగేశ్వరరావు
9951038352

రెండు తరాలకు వారధి

తరగతి గది కొన్నిసార్లు గత తరానికి అంజలి ఘటించే స్థలంగా మారిపోతుంది. సైన్స్‌లో ఎం.జి.కె. మీనన్ అపారమైన సేవచేసి ఐదు దశాబ్దాలుగా విజ్ఞాన రంగంలో ప్రముఖమైన పాత్ర వహించి 88 సంవత్సరాల వయసులో మరణించారు. ఉపాధ్యాయుడు ఆనాడు పాఠాన్ని అక్కడ పెట్టి జీవనయానంలో ప్రపంచానికి విజ్ఞాన శాస్త్రం ప్రసాదించిన మహానుభావుల యొక్క సేవలను ప్రస్తావిస్తాడు. సైంటిఫిక్ కల్చర్‌ను నేర్పిస్తాడు. కొన్నిసార్లు తరగతి గది ఒక తరం నుంచి మరొక తరానికి సంస్కృతిని తీసుకువెళ్లే వంతెనగా మారిపోతుంది. పిల్లలు ఎంజికే మీనన్‌ను చూడలేదు. ఉపాధ్యాయులు మీనన్ సేవలను ప్రస్తావిస్తున్నప్పుడు ఈ విజ్ఞాన శాస్త్రం ఎంతమంది మహనీయుల కృషి అని తలచుకోవడమేగాకుండా ఈ భవనంలో నేను కూడా ఒక ఇటుకను కావాలని అతడిని ఆరాధిస్తారు. తరగతి గది గత సంస్కృతికి నీడనిచ్చే వృక్షంగా మారుతుంది. ఆ నీడే ఆ పిల్లలకు పునాదిగా నిలుస్తుంది. గత తరం త్యాగాలు సేవలు వచ్చే తరానికి పునాదులు. తరగతి గది కొన్నిసార్లు మహనీయుల జీవనయానానికి వారికి అంజలి ఘటించడానికి క్షేత్రంగా మారిపోతుంది. ఉపాధ్యాయుడు తన పాఠాన్ని కొన్ని నిముషాలు పక్కన పెట్టి ఇలాంటి ప్రస్తావనలు చేస్తూ ఉంటాడు. తరగతి గది రెండు తరాల భావనలకు వేదికగా, వారధిగా నిలుస్తుంది.

ప్రాణమున్న ప్రతిజీవి పెరిగినట్లే తరగతి గది కూడా పెరుగుతుందని డాక్టర్ బెరోల్డ్ ఈక్ అన్నారు. స్టాన్‌ఫోర్డ్‌లో మానసిక శాస్త్ర ఆచార్యుడు ఈక్ తన పరిశోధనలో తరగతి గదికి కూడా ఎదుగుదల ఉంటుందని, ఈ ఎదుగుదల శ్రమ, పట్టుదల, పునర్వేదనలతో ఉంటుందని, దీనివల్ల విద్యార్థి బుద్ధి తెలివి కూడా పెరుగుతుందని ఆ ఆచార్యుడు ప్రయోగాత్మకంగా చూపించాడు.



విద్యార్థికి అవగాహన పెరుగుతున్న కొద్దీ మెదడులో ఉన్న నాడులు ప్రేరణ పొందుతాయని ప్రయోగాత్మకంగా చూపించాడు. దానికి ఉపాధ్యాయుడు తన ప్రేరణతో దాన్ని వేగవంతం చేయవచ్చునని కూడా చూపించాడు. అన్ని జీవరాసుల మాదిరిగానే తరగతి గది కూడా పెరుగుతుంది. యాబయి సంవత్సరాల క్రితం గురుశిష్యుల మధ్య జరిగిన సంభాషణ ఈనాడు జరుగుతున్న సంభాషణ ఒకే విధంగా ఉండదు. ఇద్దరూ కలిసి తరగతి గది ఎదుగుదలకు ప్రతిక్షణం పాటుపడవచ్చును. ఉపాధ్యాయుని దీక్ష విద్యార్థి అవగాహనకు తోడైతే తరగతి గది ఎదుగుదల వేగవంతం అవుతుంది.

ఉపాధ్యాయుడి జీవితం...

ఉపాధ్యాయుడు తన జీవితాన్ని విద్యార్థుల కళ్లల్లో చూసుకుంటాడు. అదే మాదిరిగా విద్యార్థి తన జీవితాన్ని ఉపాధ్యాయుని నడకలో చూస్తూ ఉంటాడు. వీళ్లిద్దరి మధ్య ఉన్న సంబంధం చాలా సున్నితమైంది, ఇష్టమైనది. ఉపాధ్యాయులు విద్యార్థులను స్మరించుకుంటుంటే వాళ్ల మాటల్లో ప్రేమ, అనురాగం అద్దం పడుతుంది. ఉపాధ్యాయుడు తను నిర్మించుకున్న ఆశయాలను తన విద్యార్థి ఆచరణలో చూపిస్తుంటే ఉప్పొంగిపోతాడు. దానికి ఏమాత్రం భంగమైనా చలించిపోతాడు. పిల్లలు సాధించిన విజయాలను చూసి ఉపాధ్యాయుడు అవే తమకు ఘనమైన సన్మానంగా భావిస్తారు. ఉపాధ్యాయులు తీసుకునే జీతాల కన్నా, సన్మానాల కన్నా విద్యార్థుల విజయాలే వారి కలలను నిజరూపంగా నిలుస్తాయి. ఉపాధ్యాయుల నియామకాలు చేసేటప్పుడు ఉన్నత ఆదర్శాలుకల వారిని ఎన్నుకోవాలి. అప్పుడే భవిష్యత్ సమాజం పరిపుష్టం అవుతుంది. ఉపాధ్యాయులు విద్యా కార్యక్రమంలో కీలక భాగస్వాములు.

-డా.చుక్కా రామయ్య

'దూరవిద్య'లో సెమిస్టర్ అవసరమా?

'గడప ముందుకు డిగ్రీ విద్య' అనే నినాదంతో దేశంలోనే మొట్టమొదటి విశ్వవిద్యాలయం అధికారుల నిర్ణయాల వల్ల 'దూరవిద్య' దూరం అయ్యే అవకాశాలు ఉన్నాయి. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో రెగ్యులర్ డిగ్రీ కాలేజీల్లో రెండేళ్ల క్రితం ప్రవేశపెట్టిన సెమిస్టర్ విధానం ఇంకా కష్టాలు కన్నీళ్లతోనే గడుస్తున్నది. రెగ్యులర్ డిగ్రీ కళాశాలల్లో మంచి ఫలితాలు లేక డిగ్రీ చదువు మాకొద్దు అని విద్యార్థినీవిద్యార్థులు ఓ పక్క లబోదిబోమంటూండగా 'సందట్లో సడేమియా' వలె డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2017-18 నుండి చాయిస్ బేస్డ్ క్రెడిట్ ఎడ్యుకేషన్ విధానానికి శ్రీకారం చుట్టడంలో విద్యార్థులు బెంబేలెత్తిపోతున్నారు.

1982లో హైదరాబాద్‌లో దేశంలోనే తొలి దూరవిద్య (అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ' విశ్వవిద్యాలయం మొదలైంది. లక్షలాదిమంది కాలేజీకీ, విశ్వవిద్యాలయానికి వెళ్లలేనివారికి ఉన్నత విద్య అవకాశాలు అందించి దేశంలోనే ఉత్తమ విశ్వవిద్యాలయంగా పేరుపొందింది. ప్రింట్ మెటీరియల్ ఇస్తూ, చక్కని కౌన్సిలింగ్ కాంటాక్ట్ తరగతులను అందించడమేగాక రేడియో, టెలివిజన్, ఆడియో, వీడియో కేసట్ల ద్వారా విద్యబోధన చేస్తున్నారు. ఆదివారాల్లో కౌన్సిలింగ్ తరగతులు నిర్వహించి రెగ్యులర్ డిగ్రీ, పీజీ చదువుకు సరిసమానంగా విజ్ఞానాన్ని, సర్టిఫికెట్లను ఇస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 215 అధ్యయన కేంద్రాలు, 23 ప్రాంతీయ అధ్యయన కేంద్రాలు, 23 ప్రాంతీయ అధ్యయన కేంద్రాల ద్వారా సుశిక్షితులైన కౌన్సిలర్ల ద్వారా క్లాసులు నిర్వహిస్తోంది. జాతీయ స్థాయిలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా సిబిసిఎస్ విధానం ప్రవేశపెట్టారు. ఉద్యోగ నైపుణ్యాలను కల్పించడానికి దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న సంస్కరణలు, విద్యారంగంలోని మార్పులు 'దూరవిద్య'కి అవసరమా అని విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు.

సిబిసిఎస్ లేనపుడు సంవత్సరానికి 25 కాంటాక్టు క్లాసుల ద్వారా విద్యార్థికి తగిన విద్యా పరిజ్ఞానాన్ని కౌన్సిలర్లు అందించేవారు. ఇంటరాక్షన్ విధానం ద్వారా ప్రతి కౌన్సిలర్ 25 కాంటాక్టు క్లాసులలోనే సిలబస్ పూర్తి చేసేవారు. ఉద్యోగ బాధ్యతలు ఉన్నవారు, పదోన్నతుల కోసమే డిగ్రీ, పీజీ కోర్సులు 'ఓపెన్' విశ్వవిద్యాలయాలలో చదివేవారు. క్లాసులకు 40 శాతం మంది మాత్రమే హాజరై వంద మార్కుల పేపర్‌ను రాసి పాసు అయ్యేవారు. కొన్నిసార్లు కాంటాక్టు క్లాసుకి హాజరుకాని దూరవిద్య అభ్యర్థి వార్షిక పరీక్షలు రాసి వంద మార్కుల పేపర్‌కు 60 మార్కులు తెచ్చుకొని, లబ్ధి పొందేవారు. 'ఓపెన్' విద్యలో 'హాజరు'కు ప్రాధాన్యం లేనందువల్ల 'సెల్ఫ్ స్టడీ' ద్వారా కూడా మంచి ఫలితాలు పొందేవారు. ఇప్పుడున్న సబ్జెక్టులు విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించడం లేదని ఉద్యోగం వచ్చే చదువు కావాలని, చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సిబిసిఎస్)ను ప్రవేశపెట్టారు. రెగ్యులర్ డిగ్రీ, పీజీ కాలేజీకైతే ఏమోకాని దూరవిద్యకు ఈ విధానం అవసరమా అన్నది ప్రశ్న. ఈ విధానంలో సెమిస్టర్ విధానాన్ని అమలు చేస్తున్నారు. గతంలో మూడేళ్లలో మూడు పరీక్షలు రాస్తే అభ్యర్థి డిగ్రీ పట్టభద్రుడు అయ్యేవాడు. ఇప్పుడు మూడేళ్ల చదువును 6 సెమిస్టర్ల ద్వారా పాసుకావాలి. ప్రతి ఆరునెలలకు ఒక సెమిస్టర్ ఉంటుంది. వ్యాపారం, వ్యవసాయం, ఉద్యోగం చేసేవారు దూరవిద్య పరీక్షల కోసం ఏటా 5 లేదా 8 రోజులు 'సెలవు' పెట్టి వార్షిక పరీక్షలు రాసి పట్టాలు సులభంగా పొందేవారు. దేశంలో అన్ని యూనివర్శిటీలకన్నా అంబేద్కర్ ఓపెన్ విశ్వవిద్యాలయానికి విద్యార్థులు క్యూ కట్టేవారు.

సిబిసిఎస్ విధానం అమలు చేస్తున్న విశ్వవిద్యాలయం ఆరు నెలల ముందే పాఠ్య పుస్తక రచయితలను ఎంపిక చేసి కొత్త కోర్సు పాఠ్య పుస్తకాలను ముద్రించవలసి ఉంది. డిక్రీ మొదటి సెమిస్టర్ కాంటాక్టు క్లాసులు ముగిసినప్పటికీ, ఇప్పటికీ మారిన మొదటి సెమిస్టర్ పాఠ్య పుస్తకాలు అన్నీ మార్కెట్‌కు విడుదల కాలేదు. కనీసం ఎప్పుడు ముద్రిస్తారో తెలియదు. మొదటి సెమిస్టర్ పరీక్షలు డిసెంబరు నెలలో పూర్తి కావాల్సి ఉన్నా ఇంకా పరీక్షల ప్రస్తావన రాలేదు. మొదటి సెమిస్టర్ పరీక్షలు జరుపకుండా జనవరి 6 నుండి సెకండ్ సెమిస్టర్ క్లాసులు నిర్వహించమని ఆదేశించినట్లు సమాచారం. మొదటి సంవత్సరంలో గతంలో 24 క్లాసులు ఉండగా, మొదటి, రెండవ సెమిస్టర్‌లలో కలిపితే పది క్లాసులు కావడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్లాసుల సంఖ్యను 24 నుండి పదికి తగ్గించడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిగ్రీ కోర్సు పూర్తి కావాలంటే విద్యార్థి 160 క్రెడిట్ల కోర్సులను చదువుకోవాల్సి ఉంటుంది. మొదటి నాలుగు సెమిస్టర్‌లలో ప్రతి సెమిస్టల్‌కు 25 క్రెడిట్ల చొప్పున చదవవలసి ఉంటుంది. ఐదు, ఆరు సెమిస్టర్‌లలో 30 క్రెడిట్ల చొప్పున చదవవలసి ఉంటుంది. అసలే దూరవిద్య 'ఆదివారం చదువు'. దీనికి సెమిస్టర్ అవసరమా? అని డిగ్రీ చదివే విద్యార్థుల భావన. మొదటి, నాల్గవ సెమిస్టర్‌లలో ప్రతి ఐచ్ఛిక సబ్జెక్టుకు 5 క్రెడిట్లు, ఇతర భాషా, స్కిల్ కోర్సులకు మూడు, రెండు క్రెడిట్లు ఉంటాయి. విద్యార్థి మొదటి సెమిస్టర్ నుండి నాల్గవ సెమిస్టర్ వరకు ప్రతి సెమిస్టర్‌లో మూడు ఐచ్ఛిక సబ్జెక్టులు 4 ఇతర చిన్న సబ్జెక్టులు చదవాల్సి ఉండటంతో దూరవిద్య అభ్యసించేవారు గందరగోళానికి గురవుతున్నారు. ఐదు, ఆరు సెమిస్టర్లలో పూర్తిగా 6 ఐచ్ఛిక సబ్జెక్టులనే చదువాలని విశ్వవిద్యాలయం నిర్ణయించింది. గతంలో డిగ్రీ చదివే విద్యార్థి మొదటి సంవత్సరం తెలుగు, ఆంగ్లం, సాంఘిక శాస్త్రాలను తప్పక పరీక్ష రాసే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు మొదటి సంవత్సరమే విద్యార్థి ఐచ్ఛికాలు (ఆప్షనల్స్) ఎంపిక చేసుకోమని అంటున్నారు. ఇందులో మూడు రకాలైన కోర్సులు ఉంటాయి. అవి కోర్ సబ్జెక్టులు. ఎలక్టివ్ సబ్జెక్టులు. ఎబిలిటి ఎన్‌హాన్స్‌మెంట్ కంపల్సరీ కోర్సులు. ప్రతి విద్యార్థి డిగ్రీ పూర్తి చేయడానికి 40 రకాల కోర్సులను ఎంచుకోవాలని సూచించడంతో అసలుకే మోసం వచ్చింది. చాలా పాఠ్య పుస్తకాలు ముద్రణ కాలేదు. మొదటి సెమిస్టర్ క్లాసులు పూర్తి అయిన ఎగ్జామ్ తేదీ ఇంకా ఖరారు కాలేదు.

పద్ధతి ప్రకారం ఉన్న కోర్సులను సిబిసిఎస్ కింద సెమిస్టర్లుగా మార్చడం వల్ల క్లాసులోనే 40 రకాల విద్యార్థులు ఉంటున్నారు. 20మంది కన్నా ఎక్కువ విద్యార్థులు ఉంటేనే, కౌన్సిలర్‌ను క్లాసులు చెప్పటానికి అనుమతిస్తారు. ఎక్కువ సబ్జెక్టులను ఎంపిక చేసుకొనే అవకాశం ఇవ్వడంతో ఏ సబ్జెక్టుకు పదిమంది విద్యార్థులు లేరు. దీనితో రెండు రాష్ట్రాల్లో ఉన్న కౌన్సిలర్లు బజారున పడ్డారు. కోర్సుల్లో విద్యార్థులు అడ్మిట్ అయితేనే క్లాసులు ఇస్తామని విశ్వవిద్యాలయం చెబుతోంది.

తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రెగ్యులర్ డిగ్రీ కళాశాలల్లోనే సెమిస్టర్ విధానం ఫలవంతం కాలేదు. రెగ్యులర్ డిగ్రీ అధ్యాపకులకే రెండు ఏళ్లు గడిచినా సిబిసిఎస్ విధానం అంటే తెలియడం లేదు. వారానికి ఒక క్లాసు జరిగే ఓపెన్ చదువుకు ఇది అవసరమా అని విద్యార్థులు, విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో విశ్వవిద్యాలయాలు దూరవిద్య విధానంలో ఎన్నో రకాలైన కోర్సులను నిర్వహిస్తున్నప్పటికీ అవి ఇంకా సీబీసీఎస్ పద్ధతి ప్రవేశపెట్టలేదు. పూర్తిగా సన్నద్ధంకాకముందే హడావిడిగా, సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి ఓపెన్ విశ్వవిద్యాలయం తన విద్యార్థుల సంఖ్యను తగ్గించుకున్నది. ఉద్యోగం, ఉపాధి రంగాల్లో పనిచేస్తూ చదివేవారు ప్రతి సెమిస్టర్‌కు సెలవులు పెట్టి పరీక్షలు రాయడం కష్టమని భావిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని వారు కోరుతున్నారు.

-రావుల రాజేశం

ఉత్తరాయణం

ఖాతాదారుల కష్టాలు

తెలుగు రాష్ట్రాల్లో ఏటీఎంలలో చాలాచోట్ల విత్‌డ్రా చేద్దామంటే నో క్యాష్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా స్టేట్‌బ్యాంకు ఏటిఎంలకు వెళితే కార్డు స్వైప్ చేసినవెంటనే ఆధార్ లింక్ చేస్తావా, ఇంకేం చేయాలి అన్న వివరాలు వస్తాయి, ట్రాన్‌సాక్షన్ స్లిప్ కావాలా అన్న ప్రశ్న వస్తుంది. అన్నీ అయ్యాక నో క్యాష్, చింతిస్తున్నామంటూ ఓ బొమ్మ స్క్రీన్‌పై డిస్‌ప్లే అవుతుంది. వేరే ఏటీఎంకు వెళ్లి నగదు విత్ డ్రా చేస్తే, వస్తే సంతోషమే. అయినా మొబైల్‌కు ఓ సందేశం వస్తుంది. అవకతవకలు జరగకూడదనుకుంటే స్టేట్‌బ్యాంకు ఏటీఎంలోనే నగదు విత్‌డ్రా చేయమని. ఏం చెప్పాలి? ఐదారు నెలలుగా ఇదే తంతు. బ్యాంకులు ఖాతాదారులతో ఎందుకు ఇలా ఆడుకుంటున్నాయో అర్థంగాదు.

-వి.ఆర్.ఆర్.ఎ.రాజు, హైదరాబాద్

నత్తనడకన మిషన్ భగీరథ


తెలంగాణలోని ప్రతీ ఇంటికీ 2018నాటికి మంచినీరు అందిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటన ఇంకా కార్యరూపందాల్చలేదు. ఇప్పటికి 80 శాతం పనులు మాత్రమే ఆ పథకం కింద పూర్తయ్యాయి. కనీసం వచ్చేఏడు శాసనసభ ఎన్నికల నాటికైనా ఇంటింటికీ మంచినీరు అందుతుందో లేదో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఈ పనులు పూర్తికావన్న అనుమానం లేదు. కానీ, ఇప్పటికీ పూర్తి కావలసినవి ఎందువల్ల జాప్యమవుతున్నాయన్నది సందేహం. ముఖ్యమంత్రి స్వీయ పర్యవేక్షణ జరిపితే వాస్తవాలు బయటకు వస్తాయి. నిధుల కొరత లేదా అధికారుల అలసత్వంవల్ల ఇలా జరుగుతోందన్నది తేల్చాలి. మొదట ఫ్లోరైడ్ సమస్య అధికంగా ఉన్న నల్గొండ జిల్లాలో త్వరితగతిన ఈ పథకం పనులు పూర్తి చేస్తే మేలు.

-ధూళిపాళ మోహనశర్మ, కుక్కడం

దారితప్పిన చర్చలు

ఈ రోజుల్లో పార్లమెంటు సమావేశాలు నిరాశానిస్పృహలను మిగుల్చుతున్నాయి. అర్థవంతమైన చర్చలకు అవకాశమే దొరకడం లేదు. అభిజాత్యాలు, రాజకీయాలు ఎక్కువై ప్రజాసమస్యలపై దీటైన చర్చలు సాగడం లేదు. పార్టీ విభేదాలు తప్ప జాతిశ్రేయస్సు ఎవరికీ పట్టడం లేదు. గతంలో అలాంటి పరిస్థితులు ఉండేవికావు. మన భూబాగాన్ని చైనా ఆక్రమించినప్పుడు పార్లమెంటులో అలజడి రేగింది. 'అది గడ్డికూడా మొలవని చవిటి పర్ర. దానికోసం అంత ఆందోళన ఎందుకు?' అని ప్రధాని నెహ్రూ ప్రశ్నించగా 'మీ తలమీద కూడా గడ్డి (జుట్టు) మొలవదు. అదీ చవిటి పర్రే?' అని పీలూమోదీ వ్యాఖ్యానించడం సభలో నవ్వులు విరియడం గొప్పగా చెప్పుకునేవారు. మరో సందర్భంలో పీలూమోదీని సీఐఏ ఏజెంట్ అని విమర్శించడం, ఆయన మర్నాడు 'నేను సీఐఏ ఏజెంట్'ను అన్న బ్యాడ్జ్ తగిలించుకుని సభలోకి అడుగుపెట్టడం, స్పీకరం అభ్యంతరం చెప్పడంతో 'చూశారా నేను సీఐఏ ఏజెంట్‌ను కాను'' అనడం, మళ్లీ నవ్వులు విరయడం అప్పటి పార్లమెంటు నిర్వహణ తీరుకు నిదర్శనం. ఇప్పుడు అలాంటి వాతావరణం ఉందా?

-సంపూర్ణ, సాంబమూర్తి నగర్



సుప్రీంను ఆశ్రయించిన 'పద్మావత్' నిర్మాతలు

న్యూఢిల్లీ, జనవరి 17: సెన్సార్ బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా చిత్రం విడుదలపై కొన్ని రాష్ట్రాలు నిషేధం విధించడంపై 'పద్మావత్' నిర్మాతలు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను అత్యవసరమైనదిగా పరిగణిస్తూ విచారణ జరపాలన్న అభ్యర్థనపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం సానుకూలత వ్యక్తం చేసింది. అనేక వివాదాలకు కేంద్ర బిందువైన సంజయ్‌లీలా బన్సాలీ చిత్రం పద్మావత్‌కు సెన్సార్ బోర్డు అనుమతి ఇచ్చింది. దీంతో ఈ నెల 25న పద్మావత్‌ను విడుదల చేయాలని నిర్మాత భావించారు. అయితే రాజస్థాన్, హర్యానా, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో పద్మావత్ విడుదలపై నిషేధం విధించారు.

శాంతిభద్రతల మిషతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. కొన్ని మార్పులు, చేర్పులతో సీబీఎఫ్‌సీ సర్టిఫికెట్ ఇచ్చినా నాలుగు రాష్ట్రాల్లో నిషేధం విధించడంపై నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. చివరికి పద్మావతి టైటిల్‌ను బోర్డు సూచనమేరకు పద్మావత్‌గా మార్చామని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయినా చిత్రం విడుదలపై నిషేధాన్ని కొనసాగించడం దారుణమని కోర్టుకు తెలిపారు. చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా సారథ్యంలోని జస్టిస్ ఏఎం ఖన్వీకర్, జస్టిస్ డివై చంద్రచూడ్‌తో కూడిన బెంచ్ గురువారం పిటిషన్‌ను విచారించే అవకాశం ఉంది.







ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో కలిసి అహ్మదాబాద్‌లో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోదీ గాలిపటాన్ని ఎలా ఎగురవేస్తారో వివరించి, ఎగరేసి చూపిస్తున్న మోదీ. సబర్మతి ఆశ్రమంలో నూలు వడికే యంత్రం గురించి నెతన్యాహు దంపతులకు వివరిస్తున్న ప్రధాని

ఆద్యంతం ఆసక్తికరం!

మైత్రికి అద్దం పట్టిన రోడ్ షో ■ 'ఐ-క్రియేట్' కేంద్రాన్ని ప్రారంభించిన మోదీ, నెతన్యాహు

అహ్మదాబాద్, జనవరి 17: భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇజ్రాయల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పాల్గొన్న రోడ్ షో ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ప్రజల నుంచి విశేష స్పందన కనిపించింది. ఇక్కడి సర్దార్ వల్లభ భాయి పటేల్ విమానాశ్రయం నుంచి సబర్మతి ఆశ్రమం వరకూ బుధవారం 8 కిలోమీటర్ల మేర సాగిన రోడ్ షోలో భారత్, ఇజ్రాయల్ జాతీయ పతాకాలు రెపరెపలాడాయి. రోడ్ షో నిర్వహించిన మార్గంలో 50 వేదికలను ఏర్పాటు చేశారు. ఈ వేదికల వద్ద వేలాదిమంది గుమికూడి ఇరు దేశాల ప్రధానులకు ఘన స్వాగతం పలికారు. భారత్, ఇజ్రాయల్ మైత్రీబంధం వర్ధిల్లాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో ఇజ్రాయల్ ప్రధాని పర్యటనను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. మోదీతో పాటు నెతన్యాహు దంపతులు రోడ్ షోలో పాల్గొన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ స్థాపించిన సబర్మతి ఆశ్రమాన్ని నెతన్యాహు దంపతులు సందర్శించి అక్కడి విశేషాలను తెలుసుకున్నారు. గాంధీజీ వాడిన వివిధ వస్తువులను, నూలు వడికే చరఖాను వీరు ఆసక్తికరంగా పరిశీలించారు. ఆశ్రమ ప్రాంగణంలో నెతన్యాహు దంపతులు పతంగులను ఎగురవేశారు. గుజరాత్‌లో కోలాహలంగా జరిగే పతంగుల పండుగ గురించి వీరికి మోదీ వివరించారు. గతంలో జపాన్ ప్రధాని షింజో అబే సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించినపుడు, 2014లో చైనా అధ్యక్షుడు జింగ్‌పింగ్ దంపతులు గుజరాత్‌లో పర్యటించినపుడు మోదీ వారి వెంట ఉన్నారు. అదే మాదిరి నెతన్యాహుకు సబర్మతి ఆశ్రమం గురించి, గాంధీజీ జీవిత విశేషాల గురించి తెలిపారు.

నవీన ఆవిష్కరణలకు ప్రాధాన్యం

కొత్త ఆలోచనల ద్వారా కొత్త ఆవిష్కరణలు జరుగుతాయని, వాటితోనే నూతన భారత్ అవతరిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. అహ్మదాబాద్ సమీపంలోని దేవ్ ధొలెరా గ్రామంలో 'ఐ క్రియేట్' కేంద్రాన్ని ఇజ్రాయల్ ప్రధాని నెతన్యాహుతో కలిసి మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్' (పీపీపీ) ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు నిధులు, స్థలాలు, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన వివరించారు. ఇక్కడి యువతలో శక్తి, ఉత్సాహం పుష్కలంగా ఉన్నాయని, వారికి కాస్త ప్రోత్సాహం, మద్దతు ఇవ్వాల్సి ఉందన్నారు. గత ఏడాది తాను ఇజ్రాయల్‌లో పర్యటించినపుడు 'ఐ క్రియేట్' కేంద్రం ఏర్పాటు గురించి తనకు ఆలోచన వచ్చిందని, ఇటువంటి కేంద్రాలు ఇరు దేశాల మధ్య మైత్రీబంధాన్ని మరింత పటిష్ఠవంతం చేస్తాయని మోదీ అన్నారు. ఈ కేంద్రాన్ని నెతన్యాహుతో కలిసి తాను ప్రారంభించడం ఎంతో ఆనందం కలిగిస్తోందన్నారు. నూతన ఆవిష్కరణల కోసం రెండు దేశాలూ భాగస్వామ్యం కావల్సి ఉందన్నారు. కొత్త ఆలోచనలకు, ఆవిష్కరణలకు భారత్ ఇపుడు ఓ నిదర్శనంగా మారిందన్నారు. 'ఐ క్రియేట్' ప్రారంభోత్సవంలో పాల్గొనడం తనకెంతో సంతృప్తి కలిగించిందని నెతన్యాహు అన్నారు. 'ప్రపంచానికి ఇప్పటివరకూ ఐపాడ్స్, ఐపోడ్స్ గురించే తెలుసునని, అయితే ఇపుడు 'ఐ-క్రియేట్' గురించి తెలుసుకోవాల్సిన అవసరం అందరికీ ఉందని ఆయన పేర్కొన్నారు. ఆయన మోదీని 'మై డియర్ ఫ్రెండ్' అని సంబోధిస్తూ తన ప్రసంగం ప్రారంభించారు. 'జై హింద్, జై భారత్, జై ఇజ్రాయల్, థాంక్యూ ప్రైమ్‌మినిస్టర్ మోదీ' అని ముగించారు.

కాళ్ల బేరానికి పాక్?

డీజీఎంఓల భేటీకి ప్రతిపాదనలు ■ అలాంటిదేమీ లేదన్న భారత అధికారులు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 17: భారత సైన్యం జరుపుతున్న ఎదురు దాడులకు బెంబేలెత్తుతున్న పాకిస్తాన్ ఉద్రిక్తతను తగ్గించేందుకు డీజీఎంఓ (డైరక్టర్ జనరల్ మిలిటరీ ఆపరేషన్స్) సమావేశం జరపాలనే ప్రతిపాదన చేయనున్నట్లు తెలిసింది. ఈ ప్రతిపాదన పరిశీలనలో ఉన్నదని పాకిస్తాన్ రక్షణ శాఖ సీనియర్ అధికారి ఒకరు చెప్పినట్లు పాకిస్తాన్‌కు చెందిన ప్రముఖ ఆంగ్ల పత్రిక డాన్ తెలిపింది. అయితే పాకిస్తాన్ నుండి ఎలాంటి ప్రతిపాదన రాలేదు, వచ్చినప్పుడు ఏం చేయాలనేది ఆలోచిస్తామని భారత విదేశీ వ్యవహారాలు, రక్షణ శాఖ అధికారులు తెలిపారు. ఇటీవల రెండు దేశాల సరిహద్దుల్లో కాల్పుల సంఘటనలు బాగా పెరిగిపోవటం తెలిసిందే. పాకిస్తాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన ప్రతిసారి భారత రక్షణ దళాలు పెద్దఎత్తున ఎదురు కాల్పులు, ప్రతిదాడులకు దిగుతున్నాయి. పలు సందర్భాల్లో భారత సైన్యం పాకిస్తాన్‌లోకి చొచ్చుకుపోయి పాక్ రేంజర్లపై దాడులు జరిపి వస్తోంది. ఇస్లామిక్ ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడేందు పాకిస్తాన్ రేంజర్లు పెద్దఎత్తున సహకరించటం తెలిసిందే. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి భారత సైన్యం, సరిహద్దు భద్రతా దళాల ప్రతిస్పందన పూర్తిగా మారిపోయింది. పాకిస్తాన్‌ను శిక్షించే విధంగా భారత సైన్యం, సరిహద్దు దళాల ప్రతిస్పందన ఉంటోంది. కొన్ని సందర్భాల్లో పాకిస్తాన్ భూభాగంలోకి చొచ్చుకుపోయి మెరుపుదాడులు చేస్తోంది. దీని మూలంగా వాస్తవాధీన రేఖ వద్ద ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడుతున్నాయి. భారత సైన్యం, సరిహద్దు భద్రతా దళాలు జరుపుతున్న దాడుల మూలంగా పాకిస్తాన్ సైన్యం, రేంజర్ల మరణాలు బాగా పెరిగిపోయాయి. ఇది పాకిస్తాన్ సైనికాధికారులను ఆలోచనలో పడవేసిందనే మాట వినిపిస్తోంది. పాకిస్తాన్ సైన్యం కాల్పుల విరమణను ఉల్లంఘించినా, ఇస్లామిక్ ఉగ్రవాదులను భారత దేశంలోకి పంపించేందుకు ప్రయత్నించినా పరిస్థితులు తీవ్రంగా ఉంటాయి. అవసరమైతే సైన్యం అత్యంత తీవ్రంగా స్పందిస్తుందంటూ భారత ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ గత వారం చేసిన హెచ్చరిక కూడా పాకిస్తాన్ సైనికాధికారులను ఆలోచనలో పడవేసి ఉండవచ్చునని అంటున్నారు. ఈ నేపథ్యంలో రెండు దేశాల డీజీఎంఓల సమావేశం జరపాలని పాకిస్తాన్ ఆలోచించటం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఉద్రిక్తతలు పెరిగిన ప్రతిసారీ పాకిస్తాన్ ఇలాంటి ఆలోచనలు చేస్తుంది, సమావేశాలు కూడా జరుగుతాయి. కొంతకాలం తరువాత మళ్లీ పాత విధానాలనే పాక్ అమలుచేస్తుందని భారత అధికారులు అంటున్నారు. పాకిస్తాన్ ఆలోచనా విధానంలో సమూలమైన మార్పు రానంతవరకు సరిహద్దుల్లో ఉద్రిక్తతలు తప్పవని వారు చెబుతున్నారు.



'ఒకే పోలింగ్' ఎంతో మేలు

జాతీయ సదస్సుకు బీజేపీ సన్నాహాలు

న్యూఢిల్లీ, జనవరి 17: లోక్‌సభకు, అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు జరపడం 'సంస్కరణలకు తల్లిలాంటిది' అని అభివర్ణిస్తున్న ఓ బీజేపీ భాగస్వామ్య సంస్థ ఎన్నికల సంస్కరణలపై దేశంలోనే తొలిసారిగా జాతీయ స్థాయి సదస్సును నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. చట్టసభలకు ఒకేసారి ఎన్నికలు జరపాలన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనలకు అనుగుణంగా ఈ సదస్సును ఏర్పాటు చేస్తున్నట్టు బీజేపీ ఉపాధ్యక్షుడు, ఎంపీ వినయ్ సహస్రబుద్ధి తెలిపారు. 'రంబాయు మళ్లీ ప్రబోధిని' (ఆర్‌ఎంపీ) సంస్థ ఆధ్వర్యంలో ముంబయిలో ఈ నెల 20, 21తేదీల్లో జాతీయ సదస్సు జరుగుతుందని ఆయన తెలిపారు. దేశం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను అధిగమించాలంటే ఒకేసారి ఎన్నికలు జరపడం ఉత్తమమని ఆర్‌ఎంపీ సంస్థకు ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న సహస్రబుద్ధి వివరించారు. నీతీ ఆయోగ్‌తో పాటు ఓ పార్లమెంటరీ కమిటీ కూడా ఒకేసారి ఎన్నికలు జరపాలన్న యోచనకు సుముఖత తెలిపినందున ఈ విషయమై జనసామాన్యంలో అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. అనేక రాజకీయ పార్టీలు కూడా ఈ ఆలోచనను స్వాగతించినా, ఆచరణలో పలు ఆటంకాలు ఎదురవుతాయన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నాయని అన్నారు. ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల కలిగే ప్రయోజనాలను, ఎదురయ్యే సమస్యల గురించి సదస్సులో విస్తృతంగా చర్చిస్తామన్నారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థ కాలగతిలో ఇప్పటికే ఎన్నో మార్పులను చవిచూసిందని, ఏకకాలంలో ఎన్నికలు జరపాలన్న ఆలోచన కూడా దశాబ్దాలుగా చర్చల స్థాయిలో ఉందన్నారు. ఈ సంస్కరణ కోసం జాతి యావత్తూ చాలాకాలంగా ఎదురుచూస్తోందన్నారు. ఈ ఆలోచనపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన తరుణం ఆసన్నమైందని, అదేపనిగా ఎన్నికలు జరగడం వల్ల అభివృద్ధిపై నేతలకు, అధికారులకు ఆసక్తి సన్నగిల్లుతోందన్నారు. ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఆదా చేసే అవకాశం ఉంటుందన్నారు. ముంబయిలో జరిగే సదస్సును కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం లేదని, ఈ సదస్సుకు కాంగ్రెస్ సహా అన్ని రాజకీయ పార్టీలనూ ఆహ్వానించామని తెలిపారు. జెడి(యు) నేత కెసీ త్యాగి, బిజేడీ ఎంపీ బైజయంత్ పండా, హర్యానా సీఎం మనోహర్ లాల్ ఖత్తార్, నీతీ ఆయోగ్ ఉపాధ్యక్షుడు రవికుమార్‌తో పాటు పలువురు న్యాయ కోవిదులు, రాజ్యాంగ నిపుణులు సదస్సుకు హాజరయ్యేందుకు సుముఖత తెలిపారని వివరించారు. సుపరిపాలనకు, అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలంటే దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు జరపడం శ్రేయస్కరమని అన్నారు.

కొత్త పార్టీ ఏర్పాటు ఇప్పుడే కాదు: దినకరన్

ఉదకమండలం, జనవరి 17: కొత్తగా రాజకీయ పార్టీని ఏర్పాటు చేయాల్సిన తక్షణ అవసరం తనకు లేదని అన్నాడిఎంకే బహిష్కృత నేత, ఎమ్మెల్యే టీటీవీ దినకరన్ బుధవారం ఇక్కడ మీడియాకు తెలిపారు. అయితే, అన్నాడిఎంకెను 'అన్నాడిఎంకె (అమ్మ) పార్టీ'గా గుర్తించాలని తాను ఇప్పటికే కోర్టును ఆశ్రయించానని వివరించారు. వీకే శశికళను పార్టీ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తొలగిస్తూ అన్నాడీఎంకే సర్వసభ్య సమావేశం తీసుకున్న నిర్ణయాన్ని తాను మద్రాస్ హైకోర్టులో సవాల్ చేశానని, కేసు ఇంకా విచారణలో ఉందని దినకరన్ గుర్తుచేశారు. పార్టీని అన్నాడీఎంకే (అమ్మ)గా నడిపేందుకు కోర్టు నుంచి అనుమతి రావాల్సి ఉందన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి, ఉప ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వమ్ వర్గాలు కలిసిపోవడంతో అన్నాడిఎంకెలో శశికళ అనుచరులు ప్రస్తుతం దినకరన్ వెంట ఉన్నారు. పళని, పన్నీర్‌ల సారథ్యంలో ఉన్న అన్నాడిఎంకెకు రెండాకుల గుర్తును ఎన్నికల సంఘం కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్వతంత్ర అభ్యర్థిగా ఆర్‌కె నగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దినకరన్ తన వర్గాన్ని కాపాడుకునేందుకు పావులు కదుపుతున్నారు. తమ వర్గాన్ని 'అన్నాడిఎంకె (అమ్మ)' పార్టీగా గుర్తించాలని కోర్టును ఆశ్రయించినందున కొత్తగా పార్టీని ఏర్పాటు చేయాల్సిన తక్షణ అవసరం లేదని దినకరన్ చెబుతున్నారు. అన్నాడిఎంకె పేరును, రెండాకుల గుర్తును సాధించడమే తన ప్రస్తుత ధ్యేయమన్నారు. అసెంబ్లీలో బలనిరూపణ జరిగినపుడు అన్నాడిఎంకెలోని తన అనుచరులంతా బయటకు వస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బల నిరూపణకు అవకాశం వస్తే ఎంతోమంది ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు తనకు మద్దతు పలుకుతారని ఆయన అన్నారు.

భారీగా పెరగనున్న ఎన్నికల కమిషనర్ల జీతాలు

న్యూఢిల్లీ, జనవరి 17: కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కమిషనర్లు ముగ్గురి జీతాలు రెండింతలు పెరగనున్నాయి. కొద్ది వారాల్లోనే వారీ పెరిగిన వేతనాలు అందుకుంటారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌తోపాటు ఇద్దరు కమిషనర్ల జీతాలు సుప్రీం కోర్టు జడ్జీల జీతాలతో సమానంగా ఇవ్వాలని నిర్ణయించినట్టు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల జీతాల పెంపునకు సంబంధించిన బిల్లు ఇటీవల లోక్‌సభ శీతాకాల సమావేశాల్లో ఆమోదం పొందింది. ఈ నెల 29 నుంచి ప్రారంభమయ్యే రాజ్యసభ బడ్జెట్ సమావేశాల్లో బిల్లును ఆమోదం తెలపాల్సి ఉంది. పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం తరువాత రాష్ట్రపతికి పంపుతారు. రాష్ట్రపతి ఆమోద ముద్ర పడిన వెంటనే పెరిగిన జీతాలు అమల్లోకి వస్తాయి. ప్రస్తుతం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నెల జీతం లక్ష రూపాయలు. కొత్తగా పెరిగిన జీతాలు అమల్లోకి వస్తే సీజేఐకు నెలకు 2 లక్షల 80 వేల రూపాయల వేతనం అందుతుంది. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు నెలకు 2.50 లక్షల రూపాయలు అందుతాయి. ప్రస్తుతం వారికి 90వేల జీతం వస్తోంది. ఇప్పుడు నెలకు 80వేల రూపాయల వేతనం తీసుకుంటున్న హైకోర్టు జడ్జీలకు 2.25 లక్షల రూపాయలు అందుతాయి. జడ్జీలకు కొత్త వేతనాలు అమల్లోకి వచ్చిన మరుక్షణమే ఎన్నికల కమిషన్ల జీతాలు పెరుగుతాయని న్యాయశాఖ వర్గాలు వెల్లడించాయి. అంటే సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులతోపాటు ముగ్గురు కమిషనర్లకు సమాన వేతనం అంటే నెలకు రెండున్నర లక్షల రూపాయలు చెల్లిస్తారు.

సెలవులో జస్టిస్ చలమేశ్వర్

న్యూఢిల్లీ, జనవరి 17: సుప్రీం కోర్టులో తలెత్తిన సంక్షోభాన్ని పరిష్కరించి, ఓ సామరస్య వాతావరణం నెలకొల్పాలన్న ఉద్దేశంతో జస్టిస్ ఎన్‌వి రమణ బుధవారం ఇచ్చిన విందుకు జస్టిస్ జాస్తి చలమేశ్వర్ హాజరుకాలేదని తెలిసింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రాపై తిరుగుబాటు చేసిన నలుగురు జడ్జీల్లో చలమేశ్వర్ ఒకరు. ఆయన నేతృత్వంలోనే సుప్రీం కోర్టులో పాలన గాడితప్పిందని మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ సంచలనం రేపారు. జస్టిస్ చలమేశ్వర్ నలతగా ఉన్నందున బుధవారం కోర్టుకు హాజరుకాలేదు. ఆయన ఒక రోజు సెలవుపెట్టినట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆరోపణలు చేసిన నలుగురు న్యాయమూర్తులు చలమేశ్వర్, రంజన్ గొగోయ్, మదన్ బీ లోకూర్, కురియన్ జోసెఫ్ మంగళవారం సాయంత్రం సీజేఐ దీపక్ మిశ్రా నివాసానికి వెళ్లి కలిశారు. మరో ఇద్దరు న్యాయమూర్తులు యుయు లలిత్, డివై చంద్రచూడ్ బాగాపొద్దుపోయాక జస్టిస్ చలమేశ్వర్ ఇంటికెళ్లి కలిశారని ఆ వర్గాలు తెలిపాయి.

గణతంత్ర వేడుకల్లో 'ఆసియాన్' నృత్యాలు

న్యూఢిల్లీ, జనవరి 17: దేశ రాజధానిలో జరిగే గణతంత్ర దినోత్సవాల్లో తొలిసారిగా 'ఆసియాన్' దేశాల జానపద నృత్యాలు ఆహూతులను అలరించనున్నాయి. 'ఆసియాన్' సభ్య దేశాలతో భారత్ సాంస్కృతిక బంధాలను బలోపేతం చేసేందుకు ఈ నృత్య ప్రదర్శనలను తొలిసారిగా ఏర్పాటు చేస్తున్నారు. ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో జరిగే గణతంత్ర దినోత్సవంలో 770 మంది విద్యార్థులు కథక్‌తో పాటు కంబోడియా, మలేషియా, థాయ్‌లాండ్, వియత్నాం, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, మయన్మార్, లావోస్, బ్రూనై దేశాలకు చెందిన జానపద నృత్యరీతులను ప్రదర్శించేందుకు ఘనంగా సన్నాహాలు చేస్తున్నారు. భారత గణతంత్ర వేడుకలకు ఈసారి ముఖ్య అతిథులుగా 'ఆసియాన్' దేశాల అధినేతలు పాల్గొంటున్నారు. ఢిల్లీలోని మౌంట్ అబూ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 150 మంది విద్యార్థులు పది దేశాలకు చెందిన సంప్రదాయ దుస్తులను ధరించి కళా ప్రదర్శనల్లో పాల్గొంటారు. మరికొందరు విద్యార్థులు భారతీయ సంప్రదాయ దుస్తులను ధరించి ఉత్సవాల్లో పాల్గొంటారు. ఆసియాన్ దేశాలతో భారత్‌కు ఉన్న పాతికేళ్ల బంధాన్ని గుర్తుకు తెచ్చేలా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. ఫిలిప్పీన్స్, మలేషియా తదితర దేశాల జానపద కళారూపాలను వివిధ దేశాధినేతల సమక్షంలో తాము ప్రదర్శించనుండడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని మౌంట్ అబూ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు చెబుతున్నారు.

బిజినెస్


సెన్సెక్స్..35వేలు

★ 310 పాయింట్లు పెరిగిన సూచీ
★ 88 పాయింట్లు పుంజుకున్న నిఫ్టీ
★ సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయికి చేరిక



ముంబయి, జనవరి 17: స్టాకెద్దు పరుగుతీసింది. దేశ ద్రవ్య లోటు పెరుగుతోందనే మదుపరుల భయాలను పోగొట్టే రీతిలో ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం చేయాల్సిన అవసరం ఉన్న అదనపు అప్పుల పరిమాణాన్ని తగ్గించడంతో దేశీయ స్టాక్ మార్కెట్ కీలక సూచీలు బుధవారం ఉవ్వెత్తున ఎగిశాయి. బుల్ రన్‌తో బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సెన్సెక్స్ 310 పాయింట్లు పెరిగి, మొట్టమొదటి సారి 35,000 పాయింట్ల స్థాయిపైన ముగిసింది. మదుపరులు జోరుగా కొనుగోళ్లకు పూనుకోవడంతో విశాలమయిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) నిఫ్టీ కూడా నిరాఘాటంగా సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయికి దూసుకుపోయింది. కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో అదనంగా తేవలసిన రుణాల మొత్తాన్ని గతంలో వేసిన రూ. 50వేల కోట్ల అంచనాను బుధవారం రూ. 20వేల కోట్లకు తగ్గించింది. కేంద్రం తీసుకున్న ఈ చర్య బుధవారం మదుపరులలో ఉత్సాహాన్ని నెలకొల్పి, మార్కెట్లకు సానుకూలంగా పరిణామంగా నిలిచింది. 30 షేర్లతో కూడిన సెన్సెక్స్ 310.77 పాయింట్లు (0.89 శాతం) పుంజుకొని, సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి 35,081.82 పాయింట్ల వద్ద ముగిసింది. జనవరి 15న సృష్టించిన 34,843.51 పాయింట్ల గరిష్ఠ రికార్డు ముగింపును ఛేదించింది. 2017 డిసెంబర్ 26న 34,000 స్థాయికి చేరుకున్న సెన్సెక్స్ అప్పటి నుంచి కేవలం 17 సెషన్లలోనే 35,000 మార్కును చేరింది. విశాలమయిన నిఫ్టీ బుధవారం 88.10 పాయింట్లు (0.82 శాతం) పుంజుకొని, 10,788.55 పాయింట్ల సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి వద్ద ముగిసింది. జనవరి 15న సృష్టించిన 10,741.55 పాయింట్ల గరిష్ఠ రికార్డు ముగింపును ఛేదించింది. 'ప్రభుత్వం ఈ సంవత్సర అదనపు అప్పుల లక్ష్యాన్ని తగ్గించడం వల్ల ద్రవ్యలోటు పెరుగుదలపై ఉన్న భయాలు కొంత వరకు వీడాయి. దీంతో మదుపరులు జోరుగా కొనుగోళ్లకు పూనుకోవడం వల్ల సెన్సెక్స్ మరో మైలురాయిని అధిగమించింది. కార్పొరేట్ కంపెనీల మూడో త్రైమాసిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటం, యాజమాన్యాల నుంచి సానుకూల వ్యాఖ్యలు వెలువడటం, ఐటీలో కేటాయింపులు మెరుగుపడటం, కృత్రిమ మేథస్సు, ఆటోమేషన్ వంటి వాటికి సంబంధించిన చర్యలను బడ్జెట్‌లో తీసుకోనుండటం వంటి వాటివల్ల ఐటీ రంగ షేర్లు 52 వారాల గరిష్ఠ స్థాయిలో ట్రేడ్ అవుతున్నాయి' అని రిలయన్స్ సెక్యూరిటీస్ రీసెర్చ్ విభాగం అధిపతి రాకేశ్ తార్వే పేర్కొన్నారు. రూపాయి బలపడటం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేసింది.


BSE Sensex JAN 2018 17 — 35,081.82



TOP GAINERS	%	TOP LOSERS	%
Axis Bank	4.65	Wipro	-1.85
SBI	3.44	Kotak Mahi	-1.03
ICICI Bank	2.68	HDFC Bank	-0.88
Infosys	2.61	Hero Motor	-0.80
Yes Bank	2.58	ONGC	-0.74

PTI GRAPHICS

NSE Nifty JAN 2018 17 — 10788.55



TOP GAINERS	%	TOP LOSERS	%
Axis Bank	3.91	Zee Ent.	-3.31
SBI	3.70	Wipro	-1.88
ICICI Bank	2.74	HUL	-0.78
Infosys	2.60	ONGC	-0.76
Aurobindo	2.52	Kotak Mahi	-0.60

ఇదిలా ఉండగా, ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) మంగళవారం నికరంగా రూ. 693.17 కోట్ల విలువయిన షేర్లను కొనుగోలు చేయగా, దేశీయ సంస్థాగత మదుపరులు (డీఐఐలు) రూ. 246.38 కోట్ల విలువయిన షేర్లను విక్రయించారు. మార్కెట్ బుల్లిష్ ధోరణిని ప్రతిబింబిస్తూ, క్యాపిటల్ గూడ్స్, బ్యాంకింగ్ రంగాల నేతృత్వంలో అన్ని రంగాల సూచీలు బుధవారం పుంజుకున్నాయి. ఈ సూచీలన్నీ 0.11-1.59 శాతం మధ్య పెరిగాయి.

సెన్సెక్స్ ప్యాక్‌లోని సంస్థలలో యాక్సిస్ బ్యాంక్ అత్యధికంగా 4.65 శాతం లాభపడింది. తరువాత స్థానంలో నిలిచిన ఎస్‌బీఐ 3.44 శాతం లబ్ధి పొందింది. లాభపడిన ఇతర సంస్థల్లో ఐసీఐసీఐ బ్యాంక్, యెస్ బ్యాంక్, అదాని పోర్ట్స్, ఎల్అండ్‌టీ, ఐటీసీ, డాక్టర్ రెడ్డీస్, టాటా స్టీల్, సన్ ఫార్మా, పవర్ గ్రిడ్, బజాజ్ ఆటో, భారతి ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎన్‌టీపీసీ ఉన్నాయి. వీటి షేర్ల ధరలు 2.68 శాతం వరకు పెరిగాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి ఐటీ కంపెనీల షేర్ల ధరలు బుధవారం కూడా మదుపరులను ఆకట్టుకొని, 2.61 శాతం వరకు లాభపడ్డాయి. బ్రాడర్ మార్కెట్లు కూడా బుధవారం లాభాల్లో ముగిశాయి. మిడ్-క్యాప్ ఇండెక్స్ 0.66 శాతం, స్మాల్-క్యాప్ సూచీ 0.43 శాతం చొప్పున లాభపడ్డాయి. ఆసియన్ రీజియన్‌లో షాంఘై కాంపోజిట్ ఇండెక్స్ 0.24 శాతం పెరగ్గా, హాంకాంగ్‌కు చెందిన హాంగ్ సెంగ్ 0.25 శాతం పుంజుకుంది. జపాన్‌కు చెందిన నిక్కియి 0.35 శాతం తగ్గింది.

పన్ను రిటర్న్‌లు ఇక సులభతరం!

★ కేంద్రీకృతం కానున్న పెద్ద సంస్థల రిజిస్ట్రేషన్!
★ కొన్ని వస్తు, సేవలపై తగ్గనున్న జీఎస్‌టీ రేట్లు!
★ జైట్లీ అధ్యక్షతన నేడు జీఎస్‌టీ మండలి సమావేశం

న్యూఢిల్లీ, జనవరి 17: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) మండలి గురువారం జరుగనున్న సమావేశంలో పన్ను రిటర్న్‌ల దాఖలు, పెద్ద సంస్థల రిజిస్ట్రేషన్ విధానాలను సులభతరం చేసే అంశాలను పరిశీలించడంతో పాటు ఈ-వే బిల్ విధానాన్ని ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ప్రారంభించడానికి జీఎస్‌టీఎన్ సంసిద్ధతను సమీక్షించనుంది. 2018-19 కేంద్ర బడ్జెట్‌కు ముందు జరుగుతున్న ఈ సమావేశంలో వివిధ వర్గాల నుంచి అందిన పలు విజ్ఞప్తుల మేరకు కొన్ని వస్తువులు, సేవల జీఎస్‌టీ రేట్లను తగ్గించే అంశాన్ని కూడా పరిశీలిస్తుంది. జీఎస్‌టీ మండలి ఏర్పడినప్పటి నుంచి సమావేశం కావడం ఇది 25వసారి. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో జీఎస్‌టీ చట్టానికి చేయవలసి ఉన్న సవరణలను మండలి ఆమోదిస్తుంది. ఈ చట్ట సవరణలను ఈ నెల 29నుంచి జరుగనున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాలలో పరిశీలించి, ఆమోదిస్తారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వార్షిక టర్నోవర్ రూ. 500 కోట్లు కలిగి ఉండి, పది లేదా అంతకన్నా ఎక్కువ రాష్ట్రాలలో తన కార్యకలాపాలు నిర్వహించే పెద్ద సంస్థల రిజిస్ట్రేషన్‌ను కేంద్రీకృతం చేయాలని ప్రభుత్వం ఏర్పాటు చేసిన చట్ట సమీక్ష కమిటీ ఈపాటికే సిఫారసు చేసింది. వాణిజ్య, పరిశ్రమ వర్గాలతో కూడిన సలహా సంఘం చేసిన సూచనల మేరకు చట్ట సమీక్ష కమిటీ 16 సిఫారసులు చేసింది. ఇతర అంశాలతో పాటు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఈ-వే బిల్ విధానాన్ని ప్రారంభించడానికి, రిటర్న్ దాఖలు ప్రక్రియను నిర్వహించడానికి జీఎస్‌టీ నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్) సంసిద్ధతను కూడా మండలి గురువారం నాటి సమావేశంలో సమీక్షించనుంది.



ఈ-వే బిల్ ప్రక్రియలో 14రాష్ట్రాల చేరిక

జీఎస్‌టీ అమలులో భాగంగా ప్రవేశపెట్టిన ఈ-వే బిల్ ప్రక్రియ ట్రయల్ రన్‌లో 14 రాష్ట్రాలు చేరాయి. వినియోగదారులంతా ట్రయల్ కోసం ఉపయోగించుకునేందుకు వేదిక (ప్లాట్‌ఫామ్)ను ఏర్పాటు చేసినట్టు జీఎస్‌టీ నెట్‌వర్క్ బుధవారం తెలిపింది. నేషనల్ ఇన్‌ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) ఈ-వే బిల్ పోర్టల్‌ను అభివృద్ధి చేసింది. రోజుకు 40 లక్షల ఈ-వే బిల్లులను సృష్టించే సామర్థ్యం ఈ పోర్టల్‌కు ఉందని జీఎస్‌టీఎన్ ఒక ప్రకటనలో వివరించింది. నాలుగు రాష్ట్రాలు- కర్ణాటక, కేరళ, రాజస్థాన్, ఉత్తరాఖండ్ కలిసి రోజుకు 1.4 లక్షల ఈ-వే బిల్లులను సృష్టిస్తున్నాయి.

అవివాతో బీఓఎం ఒప్పందం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: జీవిత బీమా ఉత్పాదనల పంపిణీకి సంబంధించి అవివా బీమా సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) పేర్కొంది. దేశంలోని 1863 బ్యాంకు బ్రాంచీల ద్వారా అవివా జీవితబీమా ఉత్పాదనలను పంపిణీ చేస్తామని ఆ బ్యాంకు ఎండి ఆర్‌పి మరాఠే తెలిపారు. ఓపెన్ ఆర్కిటెక్చర్ సిస్టమ్ కింద ఒకే విభాగంలో పలు బీమా సంస్థల బీమా ఉత్పాదనలను ఒక బ్యాంకు విక్రయిస్తుందన్నారు. వినియోగదారులకు బహుళ ఎంపిక అవకాశాలు అందించేందుకు అవసరాలకు అత్యుత్తమంగా సరిపోయే ఉత్పాదనలను ఎంచుకునేందుకు వీలు కల్పిస్తామన్నారు. భారతదేశంలో బీమా 3.42 శాతం మాత్రమే ఉందని, ప్రపంచ సగటు మాత్రం 6.2 శాతం ఉందన్నారు. దేశంలో టూ, త్రై టైర్ నగరాల్లో బీమా అవసరాలున్న ప్రజలకు ఈ ఒప్పందం ద్వారా చేరువై బీమా ఉత్పత్తులను అందిస్తామన్నారు. అవివా బీమా సంస్థ ఎండి ట్రెవోర్ బుల్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులకు విస్తృత స్థాయి ఆర్థిక భద్రత కల్పించేందుకు ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు.



ఇసుజు నూతన వాహనం ఆవిష్కరణ

మార్కెట్లోకి డీ-మాక్స్ వీ-క్రాస్ 2018

ఆంధ్రభూమి బ్యూరో



ఇసుజు కొత్త వాహనం

తిరుపతి, జనవరి 17: భారతదేశపు మొట్టమొదటి అడ్వెంచర్ యుటిలిటీ వాహనం ఇసుజు డీ మ్యాక్స్ వీ-క్రాస్ వాహనాలు తిరుపతిలోని తమ ఎక్స్‌షోరూమ్‌లో లభిస్తున్నాయని ఎండి బాలాజీ చౌదరి బుధవారం తెలిపారు. వీక్రాస్‌ను మే, 2016లో తొలిసారిగా భారతదేశపు తొలి అడ్వెంచర్ యుటిలిటీ వాహనంగా ఆవిష్కరించారని తెలిపారు. దీనిని మరింత ఆకర్షణీయంగా మలచడంతోపాటుగా మార్కెట్ అంచనాలకు తగ్గట్లుగా ఇసుజు నూతన ఫీచర్లతో 2018 ఎడిషన్‌కు జోడించిందని చెప్పారు. డే టైమ్ రన్నింగ్ లైట్స్, ఎల్ఈడీ టైల్ ల్యాంప్స్‌ను వీ క్రాస్‌కు జోడించడం వల్ల మరింత డైనమిక్‌గా కనిపిస్తుందని తెలిపారు. రియర్ వ్యూ కెమెరా నగర రద్దీ రోడ్లలో సైతం పార్కింగ్‌ను సులభతరం చేస్తుందని పేర్కొన్నారు. నూతన వీక్రాస్ వాహనం డ్యూయల్ టోన్ ఇంటీరియర్స్, స్పోర్టీ బ్లాక్‌లెదర్ సీట్స్‌తో వస్తోందన్నారు. నూతనంగా పరిచయం చేసిన బోల్డ్ రూబీ రెడ్ కలర్‌తో వీక్రాస్ వాహనం లభిస్తుందన్నారు. వీటితోపాటుగా గతంలోలా ఆర్చిడ్‌బ్రౌన్, కాస్మికర్‌బ్లాక్, టైటానియం సిల్వర్, ఆబ్సిడియన్ గ్రే, స్ప్లాష్‌వైట్‌లో కూడా లభిస్తాయన్నారు.

ఫిబ్రవరిలో పెట్టుబడుల సదస్సు

★ పారిశ్రామికవేత్తలు తరలిరావాలని బాబు ఆహ్వానం
★ గతంలో చేసుకున్న ఒప్పందాలు ఫలిస్తున్నాయి
★ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆశాభావం
★ విభజన హామీలపై ఇంకా స్పష్టత రావాలని వ్యాఖ్య

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 17: ఆంధ్రప్రదేశ్ ఇప్పుడిప్పుడే ఆర్థికంగా నిలదొక్కుకుంటోంది, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కూడా ఒక కొలిక్కి వస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. చంద్రబాబు బుధవారం ఢిల్లీలో సీఐఐ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సుకు హాజరైన అనంతరం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీని కలిసి విభజన సమస్యలు, ఆర్థికాంశాల గురించి చర్చించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ, ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో విశాఖపట్నంలో పెట్టుబడుల సదస్సు జరుగుతోందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సీఐఐ, డీఐపీపీ కలిసి ఈ సదస్సును నిర్వహిస్తున్నాయని అన్నారు. గతంలో జరిగిన పెట్టుబడుల సదస్సులో చేసుకున్న ఒప్పందాలు ఫలిస్తున్నాయి, పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చాయని చంద్రబాబు వివరించారు. దీనివలన రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు బాగా పెరిగాయని ఆయన చెప్పారు. ఈ పెట్టుబడులు మరికొంతకాలం వస్తేనే రాష్ట్రం ముందుకు పోతుందన్నారు. పెట్టుబడిదారులను రాష్ట్రానికి ఆకర్షించేందుకు ఎన్నో చర్యలు తీసుకున్నామని అన్నారు. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేష్ ప్రభు కూడా పెట్టుబడిదారుల సదస్సును విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రత్యేక హోదా స్థానంలో ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ కింద 16000 కోట్లు రావాలి, వీటిని వాణిజ్య బ్యాంకులు, నాబార్డ్ ద్వారా ఇప్పించాలని కోరినట్లు చంద్రబాబు చెప్పారు. బడ్జెట్ లోటును పూర్తి చేయవలసి ఉన్నదన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులను ప్రస్తుత కాంట్రాక్టరు చేయలేని పరిస్థితిలో ఇదే రేటుకు కొత్త కాంట్రాక్టరును ఎంపిక చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చంద్రబాబు వెల్లడించారు. ఈ అంశంపై గత రెండు రోజులుగా సమావేశాలు జరిగాయి, త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. మూడు నెలల కాలయాపన జరగటం వలన పోలవరానికి నష్టం జరిగిందన్నారు. రైల్వే జోన్, అసెంబ్లీ నియోజకవర్గాల పెంపు తదితర అంశాలపై స్పష్టత రావలసి ఉన్నదన్నారు. బీజేపీ లోక్‌సభ సభ్యుడు కంభంపాటి హరిబాబు రాష్ట్ర గవర్నర్‌ను మార్చాలంటూ కేంద్రానికి లేఖ రాయటం గురించి స్పందించేందుకు చంద్రబాబు నిరాకరించారు. అది ఆయన వ్యక్తిగత అభిప్రాయం, దానిపై తాను స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. రాష్ట్రం, కేంద్రం కలిసి ఆంధ్ర ప్రజలను పైకి తీసుకురావాలన్నారు.



ఢిల్లీలో బుధవారం జరిగిన సీఐఐ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సులో పాల్గొన్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి సురేష్ ప్రభు తదితరులు

విద్యుత్ రేట్లు తగ్గుతాయి

భాగస్వామ్య సదస్సులో ప్రసంగించిన చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వివిధ చర్యల మూలంగా రాష్ట్రంలో మున్ముందు విద్యుత్ చార్జీలు తగ్గుతాయని ప్రకటించారు. విశాఖపట్నంలో ఫిబ్రవరిలో జరిగే మూడురోజుల పెట్టుబడిదారుల సదస్సుకు హాజరుకావలని ఆయన పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం టెక్నాలజీని విజయవంతంగా ఉపయోగించుకోగలుగుతోందన్నారు. అమరావతిలో పెట్టుబడులు పెడితే లాభాలు తప్ప నష్టాలుండవని తెలిపారు. కాలుష్య రహిత గ్రీన్‌సిటీని నిర్మిస్తున్నామని అన్నారు.

పోలవరంపై సీబీఐ విచారణ జరపాలి

వైకాపా అధికార ప్రతినిధి పార్థసారథి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కుగా విభజన చట్టంలో పొందుపరిచిన జాతీయ స్థాయి ప్రాజెక్టు పోలవరంను జాతీయ స్థాయి స్కాంగా టీడీపీ ప్రభుత్వం మార్చిందని వైకాపా ధ్వజమెత్తింది.

బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో వైకాపా అధికార ప్రతినిధి పార్థసారథి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు అక్రమాలపై సీబీఐ విచారణ జరిపితే ఒక నెల రోజుల్లోనే చంద్రబాబు పదవీచ్యుతుడై జైలుకెళ్లాల్సి ఉంటుందన్నారు. పోలవరం ప్రాజెక్టు టెండర్లు, ఇష్టారాజ్యంగా పెరిగిన ఎస్కలేటర్లు, కాంట్రాక్టు అక్రమాలపై వస్తున్న విమర్శలను పరిగణనలోకి తీసుకుని సిబిఐ విచారణ జరిపించాలన్నారు. పోలవరం అథారిటీ కూడా ప్రాజెక్టు అవతవకలను పరిగణనలోకి తీసుకుందన్నారు. ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలనే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదని, బంగారు బాతుగా ఉపయోగించుకోవాలని చూస్తోందన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ హయాంలో పునరావాసం, నష్టపరిహారాలతో కలిపి పోలవరం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.10వేల కోట్లు కాగా, ఈ అంచనాలను రూ.58 వేల కోట్లకు చంద్రబాబు ఒకేసారి పెంచారని నిప్పులు చెరిగారు. పోలవరం కుడి, ఎడమ కాల్వల పనులు వైఎస్ హయాంలో 80 శాతం పూర్తయ్యాయన్నారు. పట్టిసీమ, పురుషోత్తమ పట్నం ఎత్తిపోతల పథకాలను చేపట్టి పోలవరంను ఆలస్యం చేస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్టుకు పెంచిన అంచనాలను చూసి కేంద్రమే నిర్ఘాంతపోతోందన్నారు. గతంలో పరిటాల రవి హత్య, ఔటర్ రింగ్ రోడ్డు, వోక్స్‌వ్యాగన్ అంశాలపై అవకతవకలపై చోటు చేసుకున్నాయన్న ఆరోపణలు రాగానే, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ సిబిఐ విచారణకు ఆదేశించి తన నిజాయితీని నిరూపించారన్నారు. ఇదే తరహాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోలవరం ప్రాజెక్టు అక్రమాలపై సిబి విచారణకు సిద్ధపడాలన్నారు.

కాలానికి అనుగుణంగా మహిళల్లో పెరిగిన అవగాహన

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 17: మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళల్లో అవగాహన పెరిగిందని మాల్దీవ్స్ ఉమెన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షురాలు షీజా అభిప్రాయపడ్డారు. విశాఖలో బుధవారం ప్రారంభమైన మూడు రోజుల అంతర్జాతీయ మహిళా పారిశ్రామిక వేత్తల సదస్సులో భాగంగా ఆమె మాట్లాడుతూ ఒకప్పటితో పోలిస్తే ప్రస్తుతం మహిళలకు విద్య పట్ల అవగాహన పెరిగిందని, చదువు వల్ల ప్రయోజనాలు తెలుసుకుని ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. చదువుకున్న మహిళలు కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా, పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య వేత్తలుగా ఎదగాలన్న సంకల్పం క్రమేపీ పెరుగతోందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇదే సందర్భంలో ప్రభుత్వాలు కూడా అందుకు అనువైన వాతావరణం కల్పించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. ముఖ్యంగా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు అనువైన వాతావరణం కల్పించాల్సి ఉందన్నారు. దీనికోసం నిపుణత, సమాచారం, సాంకేతిక సహకారం అందించాల్సి ఉందన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తలు ఉత్పత్తి రంగంలో రాణించేందుకు ప్రభుత్వమే రుణ సదుపాయం కల్పించాల్సి ఉంది. ఇక మహిళా పారిశ్రామిక వేత్తల ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సదుపాయం కల్పించడం ద్వారా వారికి తమ శక్తిసామర్థ్యాలపై నమ్మకం కలిగించాలన్నారు. అప్పుడే ప్రపంచం ఎదురు చూస్తున్న మహిళా సాధికారిత సాధ్యమవుతుందన్నారు.

పండ్ల పక్వానికి రసాయనాలు వాడితే క్రిమినల్ చర్యలు: సీఎస్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 17: వివిధ రకాల పండ్లను త్వరగా పక్వానికి తెచ్చేందుకు రసాయనాలు వినియోగించే వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం వెలగపూడి సచివాలయంలోని తన కార్యాలయంలో ఆహార కల్తీ నిరోధంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పండ్లను త్వరగా మగ్గబెట్టి మార్కెట్‌లో అమ్మేందుకు రైతులు, వ్యాపారులు కాల్షియం కార్బైడ్‌ను వినియోగిస్తూ ప్రజల ఆరోగ్యానికి తీరని నష్టం కలిగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలా చేసేవారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్బైడ్ వినియోగించిన పండ్లు తినడం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. పక్వానికి రాకముందే కృత్రిమ పద్ధతుల్లో కాల్షియం కార్బైడ్ వినియోగించిన పండ్లను విక్రయించే వారికి చట్టం గురించి వివరించాలన్నారు. వివిధ ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆహార కల్తీ నియంత్రణకు, కృత్రిమ విధానాల్లో పండ్లను మగ్గించి విక్రయించడాన్ని నిరోధించేందుకు మార్కెట్ యార్డులు, ఇతర అవసరమైన ప్రాంతాల్లో టెస్టింగ్ లేబొరేటరీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రస్తుతం ఉన్న టెస్టింగ్ ల్యాబ్‌లను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. తనిఖీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

రూ.6300 కోట్లతో వాటర్ గ్రిడ్ తొలిదశ పనులు

గ్రామీణాభివృద్ధి శాఖపై సమీక్షలో మంత్రి లోకేష్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 17: రాష్ట్రంలో గ్రామాల్లో నీటి సమస్యకు తెరదించేందుకు ఉద్దేశించిన వాటర్ గ్రిడ్ పథకం తొలిదశ పనులను 6300 కోట్ల రూపాయలతో చేపట్టనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో వెలగపూడి సచివాలయంలో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా మంచినీరు అందించే ఈ పథకాన్ని వీలైనంత త్వరగా ప్రారంభించాలన్నారు. ఎన్టీఆర్ సుజల కార్యక్రమం ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను డ్యాష్‌బోర్డుకు అనుసంధానం చేయాలని, నీటి నాణ్యత, పనితీరు, వాడకం తెలిసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. 17వేల ఓవర్ హెడ్ ట్యాంకుల్లో సెన్సర్లు ఏర్పాటు చేసి నాణ్యతను పర్యవేక్షించాలన్నారు. పైలట్ ప్రాజెక్టు త్వరగా పూర్తిచేసి మన పరిస్థితులకు అనుగుణంగా టెక్నాలజీ ఉందా? అనే అంశాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్లను యుద్ధప్రాతిపదికను పూర్తి చేయాలన్నారు. లింక్ రోడ్లు లేని గ్రామాలకు రోడ్లు నిర్మించాలని, 157 గ్రామాల్లో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించేందుకు వీలుగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జనవరి చివరి వారానికి 3.5 లక్షల ఎల్ఈడీ వీధిదీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డంప్ యార్డుల నిర్మాణం పూర్తి అయిన 355 గ్రామాల్లో ఇంటింటికీ ఆర్ఎఫ్ఐడీ కార్డులను అందచేయాలన్నారు. మిగిలిన గ్రామాల్లో డంప్ యార్డుల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. నేషనర్ రూరల్, అర్బన్ మిషన్‌లో భాగంగా మొదటి దశలో వెంకటాచలం, కంబాదూర్, సింగరాయకొండ, అరకు, కుప్పంలో పనులు ప్రారంభించాలని కూడా మంత్రి లోకేష్ అధికారులను ఆదేశించారు.



అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

సడలని ఉక్కు సంకల్పం

తూతూ మంత్రంగా మెకాన్ బృందం పర్యటన...సందేహాల నివృత్తికి సీమ డిమాండ్



బ్రహ్మణి ఉక్కు కర్మాగారం కోసం వేసిన శిలా ఫలకం

ఆంధ్రభూమి బ్యూరో

కడప,జనవరి 17: విభజన బిల్లులో పొందుపరిచిన 'కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ' అంశం అధ్యయనాలు, కమిటీల పర్యటనల నడుమ నానుతోంది. మొన్నటి వరకు జిల్లాలో ఉక్కు పరిశ్రమకు ప్రతికూల అంశాలు ఉన్నాయని చెబుతూవచ్చిన అధికార పార్టీ ప్రతినిధులు ఇటీవల మాట మార్చి ఉక్కు పరిశ్రమను ఖచ్చితంగా జిల్లాకు తీసుకువస్తామని చెబుతున్న మాటలపై ప్రజలకు విశ్వాసం కలగడం లేదు. ఇటీవల జిల్లాలో క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన మెకాన్ బృందం వ్యవహారం కూడా సందేహాలకే తావిస్తోంది. ఉక్కు పరిశ్రమ కోసం రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ బాటపట్టింది. ఇంకోవైపు సీపీఎం, సీపీఐ ఉక్కు పరిశ్రమ సాధన కోసం డిమాండ్ చేస్తున్న ఉన్నాయి. ఇంతకాలం కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై పెదవి విరుస్తూ వచ్చిన అధికార పార్టీ ప్రతినిధులు, ఇప్పుడు సానుకూలంగా మాట్లాడుతున్నారు. కడపకు ఉక్కు పరిశ్రమ తప్పకుండా తీసుకొస్తామని ఇటీవల మంత్రులు పదే పదే చెబుతున్నారు. ఓబులాపురం గనుల్లో ఇనుప ఖనిజాన్ని వైఎస్ హయాంలోనే గాలిజనార్దన్‌రెడ్డి ఇష్టారీతి ముబ్బడిగా తవ్వుకుపోయాడని, కాబట్టి అక్కడ ఇనుప ఖనిజం లేదని, నీళ్లు లేవని, బ్రహ్మణీ స్టీల్స్‌కు ఇచ్చిన భూమి వివాదంలో ఉందని, ఇలాంటి కారణాలు చెబుతూ పెదవి విరచిన అధికార పార్టీ ఇప్పుడు మార్చి తప్పక పరిశ్రమను తెస్తామంటోంది. డిసెంబర్ 27న ఢిల్లీలో కేంద్ర గనులశాఖ కార్యదర్శి నేతృత్వంలో రాష్ట్ర అధికారుల బృందం సమావేశమైంది. ఆ తర్వాత ఈనెల 5న మెకాన్ సంస్థ ప్రతినిధుల బృందం జిల్లాలో పర్యటించి పోయింది. మెకాన్ ప్రతినిధుల బృందం మైలవరం మండలం ఎం.కంబాలదిన్నె గ్రామ పరిధిలోని వ్యవసాయయోగ్యం కాని భూములు ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం పరిశీలించింది. అయితే ఈ భూములను ప్రభుత్వం భూ సేకరణ చట్టం కింద సేకరించాల్సి ఉంది. కడప నగరానికి 10 కిమీ దూరంలో, ఇప్పటికే ఏపీఐఐసీ సేకరించి ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉన్న కొప్పర్తి పారిశ్రామికవాడ భూములను మాత్రం చీకట్లో ఒక చూపు చూసి వెళ్లిపోవడం సందేహాలకు తావిస్తోంది. ఇక్కడ గత ప్రభుత్వ హయాంలోనే దాదాపు 8 వేల ఎకరాలను పరిశ్రమల స్థాపన కోసం ఏపీఐఐసీ కొనుగోలు చేసింది. ఇక్కడ తిరిగి భూసేకరణ చేయాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం చేతిలో సిద్ధంగా ఉన్న ఈ భూములను మెకాన్ ప్రతినిధుల బృందం పగటి పూట పరిశీలించక, చీకటి పడ్డాక ఇక్కడ దిగి 10 నిమిషాల్లో అక్కడి నుంచి నిష్క్రమించడంపై విమర్శలున్నాయి. దీన్ని బట్టి ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో కాలయాపనకే ప్రభుత్వాలు ప్రాధాన్యతనిస్తున్నాయనే అనుమానాలు జిల్లావాసుల్లో కలుగుతున్నాయి. మొన్నటి వరకు ఖనిజం లేదని, ఇనుప ఖనిజం తవ్వుకు పోయారని, నీళ్లులేవని అధికారపార్టీ ప్రతినిధులు చెప్పిన అంశాలు ఇప్పుడు విన్పించడంలేదు. వాస్తవానికి అనంతపురం, కడప జిల్లాల్లో 200 సంవత్సరాల వరకు ఉక్కు పరిశ్రమలు నడిచేందుకు అవసరమైన ఇనుప ఖనిజం ఉందని నివేదిక కేంద్ర ప్రభుత్వం వద్ద ఉంది. కేంద్ర గనులశాఖ మంత్రిగా పనిచేసిన జిల్లావాసి సాయిప్రతాప్‌కు సైతం ఈ విషయం తెలుసునని జిల్లా రాజకీయవర్గాలకు స్పష్టంగా తెలుసు. నీళ్ల విషయానికొస్తే, సోమశిల బ్యాక్ వాటర్ నుంచి ఎక్కడో అనంతపురం జిల్లాలోని కదిరి వద్ద సెజ్‌కోసం సేకరించిన భూముల వరకు నీళ్లు తీసుకుపోయేందుకు గత ప్రభుత్వంలోనే టెండర్లు పిలిచారు. నీటి వసతి ఉందనేది దీంతో స్పష్టమౌతోంది. గండికోట రిజర్వాయర్, సర్వారాయసాగర్ రిజర్వాయర్ నుండి కూడా కొప్పర్తి పారిశ్రామిక వాడకు గానీ, ఎం.కంబాలదిన్నెలోని భూముల వరకు గానీ నీటిని తరలించవచ్చు. ఇక కరెంట్ కొరత లేనే లేదు. రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో ఉత్పత్తి అధికమై అప్పుడప్పుడు నిలిపివేస్తున్నారు. భూ, రైల్వే రవాణా మార్గాలు చేరువలోవున్నాయి. 150 కిమీ దూరంలో కృష్ణపట్నం ఓడరేవు వుంది. ఇన్ని సానుకూలతలు ఉన్నప్పటికీ, అంకితభావం లేని అధికార పార్టీ మొన్నటి వరకు, జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ప్రతి కూలాలే ఎక్కువగా ఉన్నాయని చెబుతూ వచ్చింది. క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చిన మెకాన్ ప్రతినిధుల బృందం, సిద్ధంగా ఉన్న భూములను పగటి వేళ కాకుండా చీకటి సమయంలో ఒకసారి చూసిపోవడం కూడా అనుమానాలకే తావిస్తోంది. ఈ బృందం ఎం.కంబాలదిన్నె భూముల పరిశీలన సమయంలో, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడితో 'వెనుకబడిన ప్రాంతమనే సెంటిమెంట్‌'తో పరిశ్రమలు స్థాపించలేమని వ్యాఖ్యానించినట్లు ఆయన చెబుతున్నారు. వెనుకబడిన ప్రాంతంలో ఎటువంటి ముడి సరుకు లేకపోయినా ప్రజల జీవన శైలిని మెరుగుపరిచేందుకు పరిశ్రమలను ఏర్పాటుచేయాలన్నది రాజ్యాంగ నియమం. ఈ నియమాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవాలని జిల్లా వాసులు మొరపెట్టుకుంటున్నారు.

సాగరమాల పనులు వేగవంతం చేయాలి

అధికారులకు సీఎస్ ఆదేశం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 17: సాగరమాల పథకంలో భాగంగా రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలోని సీఎస్ సమావేశ మందిరంలో కోస్టల్ ఎకనమిక్ యూనిట్ (సీఈయు), కోస్టల్ ఎంప్లాయిమెంట్ జోన్, సాగరమాల ప్రాజెక్ట్ పనుల ప్రగతిని ఆయన సమీక్షించారు. కృష్ణపట్నం ఇన్‌ఫ్రాటెక్, కృష్ణపట్నం పవర్ కార్పొరేషన్, కెనేట పవర్ లిమిటెడ్, కోస్టల్ ఆంధ్రా పవర్ లిమిటెడ్, ఏపీ పోర్ట్ డెవలప్‌మెంట్ సంస్థకు కేటాయించిన భూముల అంశాన్ని చర్చించారు. పోర్టుల ఆధునికీకరణ, పోర్టులు - రోడ్డు అనుసంధాన ప్రాజెక్టులు, పోర్టు ఆధారిత పారిశ్రామిక ప్రాజెక్టులు, తీరప్రాంత అభివృద్ధి, కాకినాడ పోర్ట్ మౌలిక సదుపాయాలు, గాజువాక - గంగవరం 4 లేన్ల రోడ్‌ను 6 లేన్లకు అభివృద్ధి చేయడం, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) చేపట్టిన పనులు, గంగవరం పోర్ట్‌కు అనుసంధానంగా ఉన్న బైపాస్ రోడ్ అభివృద్ధి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టు నుంచి నెల్లూరు నగరానికి ఉన్న 24 కిలోమీటర్ల రోడ్ అభివృద్ధి, కృష్ణపట్నం పోర్టు సమీపంలో పారిశ్రామిక క్లస్టర్‌కు 5 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం, ఉద్యోగ అవకాశాలు, జట్టీల నిర్మాణం, తీరంలో పర్యాటక అభివృద్ధి, తదితర పనుల పురోభివృద్ధిని క్షుణ్ణంగా సమీక్షించారు. అధికారులు చెప్పిన కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కార మార్గాలను చూపించారు. నెల్లూరు - కృష్ణపట్నం రోడ్డుకు సంబంధించిన సమస్యను ఎన్‌హెచ్ఏఐ, ఆర్ అండ్ బీ, కన్సల్టెన్సీ వారు కూర్చుని ఈ నెలాఖరులోగా ఆ సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. కొందరు అధికారులకు కొన్ని పనులను ఈ నెలాఖరు లోపల, మరికొన్ని పనులను ఫిబ్రవరి నెలాఖరు లోపల పూర్తిచేయాలని ఆదేశించారు. కోస్టల్ ఎకనామిక్ జోన్ (సీఈజెడ్) మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించారు. టింబర్ ప్రాసెసింగ్ జోన్ అంశాన్ని అటవీ శాఖ అధికారులతో మాట్లాడి పరిశీలించమని ఆదేశించారు. విశాఖ, కృష్ణపట్నంలలో పర్యాటక అభివృద్ధి తీసుకోవలసిన చర్యల గురించి చర్చించారు. ప్రతినెలా సాగరమాల ప్రాజెక్ట్ పనులను సమీక్షిస్తామని, సమావేశానికి సంబంధిత ప్రాజెక్టుల పూర్తి అవగాహన ఉన్న అధికారులు మాత్రమే రావాలని దినేష్‌కుమార్ చెప్పారు.

రాష్ట్రంలో గ్లైసెల్‌పై నిషేధం

వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి వెల్లడి



ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 17: రాష్ట్రంలో గ్లైసెల్ వాడకంపై జూన్ నుంచి నవంబర్ వరకు నిషేధం ఉంటుందని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి తెలిపారు. బుధవారం సచివాలయంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో గ్లైసెల్ వాడకం తగ్గించినపుడు పత్తిచెట్టు చనిపోకుండా కలుపు నివారణకు వాడతారన్నారు. పంట సమయంలో ఈ మందును నిషేధిస్తున్నామన్నారు. మెగా సీడ్‌పార్క్‌లో భాగంగా అయోవా యూనివర్సిటీ ఆధ్వర్యంలో దేశంలోనే మంచి పరిశోధనా కేంద్రం, పరిపాలన భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు. అయోవా సహకారంతో నంద్యాలలోని మహానంది కాలేజీలో ఫిబ్రవరిలో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. మినుములు 13వేల మెట్రిక్ టన్నులు నాఫెడ్ ద్వారా కొనుగోలు చేసి, అంతకుమించి అనుమతి లేనందున కనీస మద్దతు ధర ఇచ్చి రైతు వద్ద నుంచి కొనుగోలు చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ అనుబంధ రంగాల్లో 25.6 శాతం వృద్ధిరేటు నమోదైందన్నారు. రాష్ట్రం మామిడి, బొప్పాయి, నిమ్మ, టమోటా, మిరప, పసుపు పంటల దిగుబడిలో దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. వరి, వేరుశనగ, మొక్కజొన్న ఉత్పత్తుల్లో రెండో స్థానంలో ఉందన్నారు. సాయిల్ హెల్త్‌కార్డుల పంపిణీలో వరుసగా రెండుసార్లు దేశంలో ప్రథమ స్థానంలో ఉన్నామన్నారు. రూ. 171కోట్లు వడ్డీలేని రుణాలను, 8లక్షల 30వేల మందికి విడుదల చేశామన్నారు. సుబాబుల్ ధరపై గురువారం జీవో విడుదల చేయనున్నట్లు చెప్పారు. 4,200 రూపాయలుగా రాష్ట్రమంతటా ఒక్కటే ధరకు కొనుగోలు చేస్తారని మంత్రి సోమిరెడ్డి వివరించారు.

నేడు ఎన్‌టీఆర్ వర్ధంతి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 17: తెలుగు వారి కీర్తిని దశదిశలా వ్యాపింపజేసిన నందమూరి తారక రామారావు 22వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 18న ఉదయం 10 గంటల నుండి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు, ఎన్టీఆర్ ఫొటో ప్రదర్శన నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి ఏవీ రమణ తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున డా. రమేష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రక్తదానం, ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగువారి నిజాయితీకి, నిబద్ధతకు నిలువెత్తు సాక్ష్యం ఎన్టీఆర్ అని, ప్రజల హృదయాల్లో నిత్యం వెలుగొందుతున్న ప్రజల మనిషి అని పేర్కొన్నారు. విశ్వసనీయతకు మారుపేరుగా ఎదిగి కీర్తిప్రతిష్ఠలను తన సొంతం చేసుకున్న నేత ఎన్టీఆర్ అన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో చంద్రబాబు నాయుడు సాగిస్తున్న అభివృద్ధి, సేవా కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఏవీ రమణ కోరారు.

అఫ్గాన్‌లో మహిళా శకం

ఉమన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షురాలు మనీఫా వఫెల్



ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 17: తాలిబన్ల ప్రాబల్యం తగ్గడంతో ఆఫ్ఘనిస్తాన్‌లో మహిళా శకం ప్రారంభమైందనే చెప్పాలి. ఒకప్పుడు విపరీతమైన కట్టుబాట్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ఆఫ్ఘాన్ మహిళలు ఇప్పుడు పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అనుభవిస్తున్నారని ఆఫ్ఘనిస్తాన్ ఉమన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షురాలు మనీఫా వఫెల్ అన్నారు. అలిప్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ మహిళా పారిశ్రామిక వేత్తల సదస్సు విశాఖలో బుధవారం ప్రారంభమైంది. సదస్సులో పాల్గొన్న ఆఫ్ఘాన్ ఉమన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షురాలు తమ అనుభవాలను మీడియాతో పంచుకున్నారు. ఇప్పుడు ఆఫ్ఘాన్‌లో మహిళలు ధైర్యంగా తమ జీవితాలను మలచుకునేందుకు బయటకు వస్తున్నారన్నారు. అక్కడి ప్రభుత్వం కూడా మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆఫ్ఘాన్ ప్రభుత్వంలో ఇద్దరు కేబినెట్ మంత్రులతో పాటు తొమ్మిది మంది డిప్యూటీ మంత్రులుగా మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపారు. కీలకమైన విద్య, వైద్యం, గనులు, పెట్రోలియం వంటి శాఖల్లో మహిళా మంత్రులు బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. ఒకప్పుడు ఆఫ్ఘాన్‌లో ఉన్నత విద్యనభ్యసించే బాలికల సంఖ్య 2003కి పూర్వం కేవలం 17 శాతం ఉండగా, ప్రస్తుతం వీరి సంఖ్య 23 శాతానికి పెరిగిందన్నారు. అలాగే ప్రాథమిక విద్యలో ఒకప్పుడు 27 శాతం ఉండగా, ప్రస్తుతం 30 శాతానికి పైగా ఉంది. విద్యారంగంలో మహిళా ఉపాధ్యాయుల సంఖ్య గతంలో 24 శాతం ఉండగా ఇప్పుడు 35 శాతానికి పెరిగింది. బాలికల్లో విద్యను ప్రోత్సహించేందుకు ఆఫ్ఘాన్ ప్రభుత్వం గట్టి చర్యలే తీసుకుంటోందన్నారు. ఉచిత విద్యతో పాటు ఉపకార వేతనాలు ఇస్తూ బాలికా విద్యను ఆఫ్ఘాన్ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. బాలికలను పాఠశాలకు రప్పించేందుకు ఇప్పటికీ అంగీకరించని కుటుంబాలకు ప్రత్యేక రాయితీలు సమకూరుస్తోందన్నారు. గతంలో ఆఫ్ఘాన్ ప్రాంతం అంతా మాదక ద్రవ్యాల సాగుకు ఎంతో ప్రాధాన్యతనిచ్చే వారు. ఇప్పుడు పరిస్థితులు అందుకు పూర్తి భిన్నమనే చెప్పాలి. మాదకద్రవ్యాల స్థానే అత్యంత ఖరీదైన కుంకుమపువ్వు వంటి పంటలను సాగుచేసేందుకు ఆఫ్ఘాన్ యువత ముందుకు వస్తోంది. మహిళా సాధికారత దిశగా సాగుతున్న ఆఫ్ఘాన్‌లో గతేడాది మార్చిలో ఆఫ్ఘనిస్తాన్ ఉమన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ను ఏర్పాటు చేయడం మంచి పరిణామంగా పేర్కొన్నారు. అక్కడి ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు స్పష్టమైన ప్రణాళికలను రూపొందించి ప్రోత్సహిస్తోందని మనీఫా వఫెల్ పేర్కొన్నారు.

1వ పేజీ తరువాయి

ఉపాధి వెల్లువ

సాధించాలన్న కసితో పనిచేస్తున్నామని లోకేష్ చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో 13 ఐటీ కంపెనీలను ఎన్ఆర్టీ టెక్ పార్కులో, మూడు ఐటీ కంపెనీలను పైకార్ ఐటీ పార్క్‌లో లోకేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, ఎంతో కష్టపడి నిర్మించిన సైబరాబాద్ నగరం రాష్ట్ర విభజనతో తెలంగాణ ప్రాంతంలో భాగమైందన్నారు. ఒక్క సైబరాబాద్ టవర్ వల్ల హైదరాబాద్‌లో ఐటీలో ఎకో సిస్టమ్ ఏర్పడి 6 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించేలా అభివృద్ధి జరిగిందన్నారు. 2019 నాటికి రాష్ట్రంలో లక్ష మందికి ఐటీ ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఒకపక్క బాధ ఉన్నా ఇంకోపక్క రాష్ట్ర అభివృద్ధి కోసం కసిగా పనిచేస్తున్నామన్నారు. ఏ రాజధానికైనా సామాజికపరమైన భద్రత అవసరమన్నారు. హైదరాబాద్, సైబరాబాద్ కన్నా అత్యుత్తమమైన రాజధానిని అమరావతిలో నిర్మించుకోబోతున్నామని లోకేష్ అన్నారు. మంగళగిరిలో మొదట్లో ఒకే ఒక ఐటీ కంపెనీ ఉంటే ఇప్పటికి 25 ప్రముఖ ఐటీ కంపెనీలు ఈ మూడున్నరేళ్లలో వచ్చాయన్నారు.

విశాఖ నుంచి అనంతపురం వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 'ఆంధ్రా వ్యాలీ'ని ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు. రాబోయే కాలంలో అమరావతి డేటా సెంటర్ హబ్‌కు ప్రధాన కేంద్రం కానుందన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో విశాఖపట్నం, అనంతపురం, అమరావతి, తిరుపతిలలో ప్రముఖ ఐటీ కంపెనీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఐటీకి సంబంధించి ఒక అద్భుతమైన ఎకో సిస్టం అవసరమని, అప్పుడే ప్రముఖ కంపెనీలు వచ్చే అవకాశం ఉందన్నారు. తెలుగు యువత ఎంతో అద్భుతమైన ప్రతిభ కలిగినవారని, వారి ప్రతిభను ఉపయోగించుకునేలా రాష్ట్రంలో ఐటీ కంపెనీలను ప్రారంభించమని నిర్వాహకులను కోరానన్నారు. రాష్ట్రంలో యువత ఐటీ డిగ్రీలతో ఎక్కడికో వెళ్లవలసిన అవసరం లేదని, అవి రాజధాని అమరావతికే వస్తున్నాయన్నారు. ఐటీ కంపెనీల ద్వారా వచ్చిన అవకాశాలను రాష్ట్ర యువత అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్రానికి 54 ఐటీ కంపెనీలు వచ్చాయని, వీటిద్వారా 10వేల ఉద్యోగాలు కల్పించామని మంత్రి లోకేష్ తెలిపారు.

క్రీడలు, న్యాయ వ్యవహారాలు, ఎన్ఆర్ఐ సాధికారత శాఖల మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ చొరవతో రాష్ట్రానికి పెద్ద సంఖ్యలో ప్రముఖ ఐటీ కంపెనీలు వస్తున్నాయన్నారు. తెలుగు యువతలో అపారమైన తెలివితేటలు ఉన్నాయని, వారికి సరైన శిక్షణ ఇస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఐటీ రంగం ప్రగతి సాధిస్తోందన్నారు. ఒకేసారి 16 ఐటీ కంపెనీలను ప్రారంభించే కార్యక్రమం ఏర్పాటు చేయడం చెప్పుకోదగ్గ విషయమన్నారు. ఏపీఎన్ఆర్టీ అధ్యక్షుడు రవి వేమూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో ఐటీ పరిశ్రమ వేళ్లూనుకునేలా చర్యలు తీసుకున్నారన్నారు. మంత్రి నారా లోకేష్ ఏ చిన్న కంపెనీ అయినా ఇక్కడ స్థాపించేందుకు ముందుకొచ్చే వారితో భేటీ అవుతున్నారన్నారు. రాష్ట్రంలో ఐటీ కంపెనీలు ప్రారంభించేవారికి ప్రభుత్వం 50 శాతం రెంటల్ ఖర్చు భరిస్తోందని తెలిపారు.

డీజీపీ మాలకొండయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలకు సహకారం అందించేలా ప్రభుత్వ ప్రధాన నిర్ణయాలు ఉంటున్నాయన్నారు. సంపద సృష్టించే వారికి సహకరించాల్సిన అవసరం ఉందని, శాంతిభద్రతల విషయమై తప్పక తమవంతు సహకరిస్తామన్నారు. ఏపీఎన్ఆర్టీ సీఈవో సాంబశివరావు స్వాగతోపన్యాసమిస్తూ విశాఖపట్నం నుంచి అనంతపురం వరకు ఐటీ వ్యాలీని రూపొందించేలా ఒక మిషన్‌తో ముందుకు వెళుతున్నామన్నారు. రెండు విధాన లక్ష్యాలతో పనిచేస్తున్నామని, అందులో ఒకటి డీటీపీ (డిజిగ్నేటెడ్ టెక్నాలజీ పార్కు) అని, దీని ప్రకారం ఐటీ కంపెనీలకు అవసరమైన స్పేస్, తదితర సదుపాయాలు కల్పించటం కాగా, రెండోది ఐటీ కంపెనీలకు అవసరమైన శిక్షణ కలిగిన మానవ వనరులను అందించటమని తెలిపారు. రాజధాని అమరావతిలో సెమీ కండక్టర్ పార్కు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

రెండు అవగాహన ఒప్పందాలు

అనంతరం మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఐటీ కంపెనీలతో రెండు ఎంవోయూలు కుదుర్చుకున్నారు. ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలను మంత్రి చేతులమీదుగా అందించారు. 16 ఐటీ కంపెనీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ రాజేంద్రప్రసాద్, జెఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ఏఎస్ఎస్ కుమార్, వివిధ ఐటీ కంపెనీల యజమానులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో భాగస్వామ్యం

సాధిస్తున్నారని నెతన్యాహు పేర్కొన్నారు. 2011లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నరేంద్ర మోదీ ఐ-క్రియేట్‌ను ప్రారంభించారు. ఇప్పుడు దాన్ని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో జాతికి అంకితం చేయించారు. ఈ సంస్థ స్టార్టప్‌లను ప్రారంభించడానికి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అన్నివిధాలుగా సహకరిస్తుంది. ఈ సంస్థ ద్వారా ఒనగూడే విజ్ఞానాన్ని భారత్‌తో కలిసి పనిచేసి సమకూర్చుకోవాలని నెతన్యాహు అన్నారు. నరేంద్ర మోదీ భవిష్యత్ దృక్పథం, ఆయన స్నేహం ఇరు దేశాల మధ్య పరస్పర భాగస్వామ్యానికి అనంతమైన అవకాశాలను ఇస్తోందని తెలిపారు.

ఐ-క్రియేట్ సంస్థలో పొందుపరిచిన ఆవిష్కరణలు తనను మంత్రముగ్ధుల్ని చేశాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఐ-పోడ్స్, ఐ-పాడ్స్ గురించే ప్రపంచానికి తెలుసునని, ఇప్పుడు కొత్తగా ఐ-క్రియేట్ అన్న వ్యవస్థ ఆవిష్కృతమైందని అన్నారు. 'నేను, భారత ప్రధాని మోదీ ఆలోచనల్లో యువకులం. మాకు భవిష్యత్తు పట్ల నమ్మకం, విశ్వాసం ఉన్నాయి' అని నెతన్యాహు పేర్కొన్నప్పుడు మోదీ నవ్వడం కనిపించింది. సాంకేతిక విజ్ఞానం, జలవనరులు, వ్యవసాయం, సైబర్, ఆరోగ్య రంగం, జీవశాస్త్రాలు ఇలా ఒకటేమిటి అన్ని రంగాల్లోనూ భారత్‌తో భాగస్వామ్యాన్ని పెంచుకోవాలన్నది తమ లక్ష్యమని తెలిపారు.

నెతన్యాహు సమక్షంలో ఐ-క్రియేట్ సంస్థ జాతికి అంకితం కావడం తనకెంతో ఆనందాన్ని కలిగిస్తోందని మోదీ అన్నారు. ఇరు దేశాల మధ్య ఈ ఫౌండేషన్ బలమైన మైత్రీ బంధానికి పునాది కావాలని గత ఏడాది ఇజ్రాయెల్ పర్యటన సందర్భంగా తాను నిర్ణయించుకున్నానన్నారు. అప్పటినుంచీ నెతన్యాహు భారత రాక కోసం ఎదురుచూశానని తెలిపారు. తమతమ దేశాల్లోని అన్ని వ్యవస్థలు సరికొత్త సృజనకు దోహదం చేసేవిగా ఉండాలన్నదే ఆశయమన్నారు. ఈ రకమైన ఆవిష్కరణల వల్ల నవభారత నిర్మాణానికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. ఒక దేశం ముందుకు వెళ్లాలంటే ఎంత పెద్దదన్నది ప్రామాణికం కాదని, ఆయా దేశాల్లో నివసిస్తున్న ప్రజలు ఎంత సృజనాత్మకతతో ఆలోచిస్తున్నారన్నదే కీలకమని తెలిపారు. భారత్-ఇజ్రాయెల్ ప్రజలు సృజన, సృజనాత్మకత విషయంలో కలిసికట్టుగా పనిచేస్తున్నారని, అంకితభావంతో ముందుకు సాగుతున్నారని మోదీ తెలిపారు. ఐ-క్రియేట్ ఫౌండేషన్ ద్వారా భారత్‌లో సరికొత్త ఆవిష్కరణలకు మరింత ఊతం లభిస్తుందని, అదే విధంగా కొత్త పరిశ్రమల ఆవిర్భావానికి ఇది దోహదం చేయగలదని ఆశిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల ప్రధానులు 38 పారిశ్రామిక ప్రాజెక్టులకు అవార్డులను అందించారు. వీటిలో 18 భారత్‌వి కాగా, 20 ఇజ్రాయెల్‌కు చెందినవి.

నిర్మలా సీతారామన్ సరికొత్త రికార్డు

'సుఖోయ్'లో ప్రయాణించిన తొలి మహిళా రక్షణమంత్రి

జోధ్‌పూర్, జనవరి 17: పూర్తిస్థాయిలో రక్షణశాఖను నిర్వహిస్తున్న తొలి మహిళగా రికార్డు సృష్టించిన నిర్మలా సీతారామన్ మరో ఘనతను సాధించారు. 'సుఖోయ్' యుద్ధ విమానంలో ప్రయాణించిన తొలి మహిళా రక్షణమంత్రిగా ఆమె చరిత్ర సృష్టించారు. జీ- సూట్‌ను, తలపై హెల్మెట్‌ను ధరించి ఆమె బుధవారం నాడు 'సుఖోయ్- 30ఎంకేఐ' యుద్ధ విమానంలో 45 నిమిషాల సేపు ప్రయాణించి, భారత వైమానిక దళం పోరాట పటిమను సమీక్షించారు. యుద్ధ విమానంలో గగన విహారం పూర్తయిన అనంతరం ఆమె మాట్లాడుతూ, ఇలా ప్రయాణించడం వల్ల తనకు ఎన్నో విషయాలు తెలిశాయని సంతృప్తి వ్యక్తం చేశారు. రక్షణ సిబ్బంది ఎంత కఠోర శిక్షణ, అభ్యాసం చేస్తారో తనకు తెలిసిందని, పరిస్థితుల పట్ల వారు ఏ స్థాయిలో సన్నద్ధంగా ఉంటారో, ఎంత వేగంగా స్పందిస్తారో తెలిసిందని అన్నారు.రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ సైనిక స్థావరం నుంచి బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు బయలుదేరిన సుఖోయ్ యుద్ధవిమానంలో నిర్మలా సీతారామన్ పర్యటించేందుకు రక్షణ శాఖ అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. అణ్వాయుధ సామర్థ్యం, శత్రు దేశ భూభాగంలోకి సులువుగా చొచ్చుకుపోయే పటిమ ఉన్న ఈ యుద్ధ విమానాన్ని మన దేశంలోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ వైమానిక దళం కోసం తయారుచేసింది. గతంలో అప్పటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ సుఖోయ్-30 యుద్ధ విమానంలో ప్రయాణించారు. సుఖోయ్ యుద్ధవిమానంలోని కాక్‌పిట్‌లో పైలట్ వెనుక ఉన్న సీటులో కూర్చుని నిర్మల ప్రయాణించారు. ఈ విమానం టేకాఫ్ అయ్యే క్షణంలో ఆమె 'విక్టరీ' గుర్తు చూపిస్తూ సిబ్బందిని అభినందించారు. ప్రయాణం ముగిశాక తిరిగి వైమానిక స్థావరానికి చేరుకున్నాక- 'ఈ ప్రయాణం ఒక అద్భుతం.. మరపురాని అనుభవం' అని ఆమె పైలట్‌ను ప్రశంసించారు. ఎవరెస్ట్ పర్వతం కన్నా ఎత్తులో సుఖోయ్ ఎగిరిందని, పైలట్ల సమర్థతకు ఈ ప్రయాణం నిదర్శనమని ఆమె అన్నారు. రక్షణమంత్రిగా బాధ్యతలు చేపట్టాక నిర్మలా ఇటీవల భారత నౌకాదళ సామర్థ్యాన్ని స్వయంగా పరిశీలించారు. ఐఎన్ఎస్ కోల్‌కత, ఐఎన్ఎస్ విక్రమాదిత్యలో ప్రయాణించి నావికాదళం పనితీరును ఆమె ఆరా తీశారు. రక్షణ దళాల అధికారులు, సిబ్బందితో మంచి సంబంధాలు నెలకొల్పే విధంగా నిర్మల సమర్థవంతంగా పనిచేస్తున్నారని విశ్లేషకులు చెబుతున్నారు.

మనకు సాటి లేదు

మహిళా పారిశ్రామికవేత్తలకు ఎంతగానో ఉపకరిస్తాయని అన్నారు. లాజిస్టిక్స్‌లో ఏపీ పటిష్ఠంగా ఉందని సీఎం చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో కూడా మెరుగ్గా ఉన్నామని అన్నారు. పరిశ్రమలకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేస్తున్నామని ఆయన వివరించారు. ఇటీవల కాలంలో 19 శాఖలకు సంబంధించి 13,47,801 కోట్ల రూపాయల మేర 1900 ఎంఓయూలు కుదుర్చుకున్నామని, 30 లక్షల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ఆయన పేర్కొన్నారు. వచ్చే నెలలో విశాఖలో సిఐఐ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సారథ్యంలో భారీ పారిశ్రామిక సదస్సు జరుగుతుందని, ఇందులో 50 దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొననున్నారని చంద్రబాబు తెలియచేశారు. ఆనందపురం మండలం గిడిజాలలో మహిళా పారిశ్రామికవాడ ఏర్పాటుకు కావల్సిన 50 ఎకరాల భూమిని అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంట్రప్రినర్స్ ఆఫ్ ఇండియాకు కేటాయిస్తూ ఎంవోయూ కుదుర్చుకున్నారు. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి బినయ్ కుమార్ మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం అధిక ప్రాధాన్యతను ఇస్తోందని అన్నారు. లాజిస్టిక్ సెక్టర్‌ను మౌలిక సదుపాయల సెక్టర్‌గా కేంద్ర ప్రభుత్వం డిక్లర్ చేసిందని అన్నారు. తద్వారానే లాజిస్టిక్ పార్క్, మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ అందుబాటులోకి వచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఏషియన్ ఉమెన్ డవలప్‌మెంట్ ఫోరం (నేపాల్) అధ్యక్షురాలు ప్రమీల ఆచార్య రిజాల్, సార్క్ సెక్రటరీ జనరల్ అంజాద్ హుస్సేన్, మంత్రులు గంటా శ్రీనివాసరావు, అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీలు మురళీమోహన్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న తటస్థ ఓటర్లు!

ఆయా రాజకీయ పార్టీలతో అంటీముట్టనట్లుగా ఉంటున్నారన్న అభిప్రాయం వెల్లడవుతోంది. ఈ విషయాన్ని గత కొంత కాలంగా ఓటరు నాడి తెలుసుకోవడానికి వెళ్లిన సర్వే సంస్థల ప్రతినిధులు గుర్తించిన విషయాన్ని ప్రస్తావించవచ్చు. ఎన్నికలకు సమయం ఉందని, అప్పుడు తాము నిర్ణయం తీసుకుంటామని ఓటర్లు ఘంటాపథంగా చెప్పడం గమనార్హం. రాష్ట్రంలో పెరుగుతున్న తటస్థ ఓటర్ల సంఖ్యను పరిగణలోకి తీసుకుంటున్న ప్రధాన రాజకీయ పార్టీలు తదనుగుణంగా అడుగులు వేస్తున్నాయి. ఓటరును తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. తటస్థ ఓటర్లలో ఎక్కువ శాతం భవిష్యత్తు ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతిస్తే ఆ పార్టీ విజయం సాధించే అవకాశాలు ఉంటాయని విశ్లేషకులు తేల్చి చెబుతున్నారు.

నేడు రక్తదాన శిబిరాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 17: తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా 18న (గురువారం) దేశవ్యాప్తంగా లెజండరీ రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ ట్రస్టు ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఇవో) టి. విష్ణువర్ధన్ తెలిపారు. లెజండరీ రక్తదాన శిబిరానికి 'ఫేస్ బుక్' సహకరిస్తున్నట్లు ఆయన బుధవారం విలేఖరుల సమావేశంలో చెప్పారు. ఎన్టీఆర్ ట్రస్టు బ్లడ్ బ్యాంక్ నిపుణుడు డాక్టర్ హితేష్ మాట్లాడుతూ లెజండరీ రక్తదాన శిబిరాలను ఈ ఏడాది ఆంధ్ర ప్రదేశ్‌లో 103 కేంద్రాల్లో, తెలంగాణలో 30 కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇంకా 18 రాష్ట్రాల్లో 140 కేంద్రాల్లో శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

క్రీడ

కోహ్లీ వికెట్ నాకో ప్రత్యేకం: లుంగీ ఎంగ్డి

సెంచూరియన్, జనవరి 17: ప్రపంచంలోని ఉత్తమ బ్యాట్స్‌మన్‌లలో ఒకడైన భారత జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీ వికెట్‌ను పడగొట్టడం తనకో ప్రత్యేక అనుభూతి ఇచ్చిందని, అది మరపురానిదని దక్షిణాఫ్రికా పేసర్ లంగీ ఎంగ్డి పేర్కొన్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టెస్టు రెండో ఇన్నింగ్స్ ఐదోరోజు ఆట సందర్భంగా విరాట్‌కోహ్లీని ఎల్‌బీడబ్ల్యు చేయడం తనకు ప్రత్యేక అనుభూతిని మిగుల్చుతుందని అన్నాడు. ఈ మ్యాచ్‌లోని రెండు ఇన్నింగ్స్‌లలో మొత్తం ఏడు వికెట్లను సాధించిన తాను కోహ్లీ వికెట్ తీయడానికి ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లి అనుకున్నది సాధించినట్టు తెలిపాడు. ఈ మ్యాచ్‌లో నింగ్డి 90 పరుగులిచ్చి ఏడు వికెట్లు పడగొట్టి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. టెస్టుమ్యాచ్‌లో ఆరంగేట్రం చేసిన తనకు ఇది కొత్త అనుభూతి ఇచ్చిందని, ఒక క్రికెటర్‌గా సక్రమమైన పద్ధతిలో వ్యవహరించడం ద్వారా కెరీర్‌లో ఉన్నతస్థాయికి చేరుకోవడానికి ఈ టోర్నీ తనకు దోహదపడుతుందని ఆశిస్తున్నట్టు ఆయన పేర్కొన్నాడు.



భారత్ ఘోర పరాజయం

- 2-0 తేడాతో సిరీస్ దక్షిణాఫ్రికా కైవసం
- రెండో టెస్టులో 135 పరుగులతో ఇండియా ఓటమి
- బ్యాటింగ్‌లో వైఫల్యమే కారణం: కోహ్లీ
- ప్రిపరేషన్ జీరో: మాజీ కెప్టెన్ బిషన్‌సింగ్ బేడీ

సెంచూరియన్, జనవరి 17: సొంతగడ్డపై అప్రతిహత విజయాలతో దూసుకువెళ్తున్న భారత క్రికెట్ జట్టు సెంచూరియన్‌లో జరిగిన రెండో టెస్టుమ్యాచ్‌లో ఆతిథ్య జట్టు దక్షిణాఫ్రికా చేతిలో ఘోర పరాజయం పాలైంది. ప్రారంభ టెస్టులో 72 పరుగుల తేడాతో వెనుకబడిన భారత్ రెండో టెస్టులో 135 పరుగుల తేడాతో అపజయాన్ని మూటకట్టుకుంది. ఆతిథ్య జట్టు నిర్దేశించిన 287 లక్ష్యాన్ని ఛేదించడంలో పూర్తిగా చతికిలపడింది. ఇందుకు భారత్ జట్టులోని సభ్యులంతా తలా పాపం తిలా పిడికెడు అన్న చందంగా బ్యాటింగ్, అనవసర రనౌట్లు, చెత్తషాట్లతో ఆడడం వల్ల కేవలం 151 పరుగులకే ఆలౌటైంది. దీంతో దక్షిణాఫ్రికాతో జరిగిన మూడు మ్యాచ్‌ల ఫ్రీడం సిరీస్‌ను 0-2 తేడాతో చేజేతులా చేజార్చుకుంది.

భారత్ జట్టు క్రికెటర్ రోహిత్‌శర్మ తమ జట్టు వికెట్లు పటపటా పడిపోతుండడంతో తనదైన శైలిలో ఆడుతూ చురుకుగా అర్థవంతంగా ఆడుతూ పదునైన షాట్లతో అలరించాడు. రోహిత్‌శర్మ 74 బంతులు ఎదుర్కొని 47 పరుగులు చేసినా అర్ధసెంచరీని సాధించలేకపోయాడు. ఆరు ఫోర్లు, ఒక సిక్సర్‌తో ప్రేక్షకులను కొంతవరకైనా అలరించాడు. భారత్ జట్టులో రోహిత్‌శర్మ ఒక్కడే కాస్త మెరుగైన ఆటతీరు ప్రదర్శించి సిరీస్ కోల్పోయినా పరువు దక్కించాడు.

రెండో ఇన్నింగ్స్ ఐదోరోజున ఒక దశలో భారత్ ఏడు వికెట్లు కోల్పోయి కేవలం 87 మాత్రమే చేయడంతో ఘోరాతి ఘోరంగా భారత్ జట్టు విఫలమై అవమానాన్ని మూటకట్టుకుంటుందనుకునే తరుణంలో మిగిలిన ఆటగాళ్ల సహకారంతో 151 పరుగైనా చేయగలగడం చావు తప్పి కన్ను లొట్టపోయినట్టయింది. 27వ ఓవర్‌లో డివిలియర్ వేసిన బంతిని ఆడబోయిన చటేశ్వర్ పుజారా అనవసర పరుగుకోసం యత్నించడంతో క్వింటన్ డికాక్ చేతిలో స్టంప్ అవుటై కేవలం 19 పరుగులు చేసి జట్టును నిరాశలో పడేశాడు. కగిసొ రబడ వేసిన బంతిని లెగ్ బౌండరీగా మలచబోయిన పార్థివ్ పటేల్ కేవలం 19 పరుగులు మాత్రమే చేసి మోర్నె మోర్కెల్ అద్భుత క్యాచ్‌తో వెనుతిరిగాడు. హర్థిక్ పాండ్య 18 బంతులు ఎదుర్కొని కేవలం ఆరు పరుగులు చేయగా, కెప్టెన్ విరాట్ కోహ్లీ 74 బంతులు ఎదుర్కొని ఆరు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 47 పరుగులు చేశాడు. ఆ తర్వాత రవీంద్ర అశ్విన్ మూడు పరుగులు చేసి నింగ్డికి దొరికిపోగా, మహ్మద్ షమీ 24 బంతులు ఎదుర్కొని ఐదు ఫోర్లతో 28 పరుగులు చేయగలిగాడు. 48వ ఓవర్‌లో రోహితశర్మ వికెట్‌ను రబడ చేజిక్కించుకోగా, ఆ తర్వాత వచ్చిన బౌలర్ నింగ్డి తన ఐదవ వికెట్‌గా మహ్మద్ షమీని మిడ్ ఆన్‌లో ఔట్ చేశాడు. ఆ తర్వాత వచ్చిన మిగిలిన బ్యాట్స్‌మన్లు జస్ప్రీత్ బుమ్రా రెండు పరుగులు, ఇశాంత్ శర్మ నాలుగు పరుగులు మాత్రమే చేసి భారత్‌ను నిరాశకు గురిచేశారు. ఇదిలావుండగా, రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ 158 పరుగులు చేయగా, తొలి ఇన్నింగ్స్‌లో అద్భుత ఆటతీరును ప్రదర్శించి 153 పరుగులు చేయడం గమనార్హం.

భారత ఆటగాళ్లకు పిచ్ సరిగా అనుకూలించకపోవడంతో ఆట చివరిరోజున కేవలం 50.2 ఓవర్లకే చాప చుట్టేశారు. రెండో ఇన్నింగ్స్ నాలుగో రోజున మూడు ప్రధాన వికెట్లు పటపటా పడిపోయినా, కనీసం ఐదోరోజైనా పరువు నిలబెడతారనుకున్న భారత జట్టు ఆటగాళ్లు తమకు ఇంతటి ఘోర పరాజయం ఎదురవుతుందని బహుశా కలలో కూడా ఊహించి ఉండరేమో. దక్షిణాఫ్రికా 2015లో భారత్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో 3-0 తేడాతో ఓడిపోయిన నేపథ్యంలో అందుకు ప్రతీకారంగా ఆ జట్టు కెప్టెన్ ఫఫ్ డుప్లెసిస్ తన టీమ్ సమష్టి సహకారంతో, పటిష్టమైన జట్టు ఎంపికతో భారత్‌పై ప్రతీకారం తీర్చుకున్నట్లయింది. దక్షిణాఫ్రికా తన తొలి ఇన్నింగ్స్‌లో 335 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 258 పరుగులు చేయగా, భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 307 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 151 పరుగులు (50.2 ఓవర్లలో) చేసింది.

ఆరంగేట్రంలోనే అదుర్స్

దక్షిణాఫ్రికాకు చెందిన పేసర్ లుంగీ ఎంగ్డి భారత్‌తో జరిగిన టెస్టుమ్యాచ్‌లో తొలిసారిగా ఆరంగేట్రం చేసి, ఆరంభంలోనే అందరి నోటా అదుర్స్ అనిపించేలా తన ప్రతిభను ప్రదర్శించాడు. ఎంగ్డి సొంత గడ్డ అయిన దక్షిణాఫ్రికాలోని సెంచూరియన్ మైదానంలో జరిగిన టెస్టుమ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి మొత్తం ఏడు వికెట్లు పడగొట్టి ఔరా..ఏమి ఈ పేసర్ ప్రతిభ అనేలా ఘనతను దక్కించుకున్నాడు. భారత్‌తో ఆడిన తొలి ఇన్నింగ్స్‌లో పార్థివ్ పటేల్‌ను ఔట్ చేయడం ద్వారా వెలుగులోకి వచ్చిన ఈ పేసర్ రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు సాధించడం గొప్ప విషయం. కెప్టెన్ విరాట్ కోహ్లీ, కే.ఎల్.రాహుల్, హర్థిక్ పాండ్య, రవిచంద్రన్ అశ్విన్, షమీ, బుమ్రా వికెట్లను పడగొట్టింది ఈ పేసరే. రెండో ఇన్నింగ్‌లో 12.2 ఓవర్లు వేసిన ఎంగ్డి కేవలం 39 పరుగులు మాత్రమే ఇచ్చి ఆరు వికెట్లను పడగొట్టి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా అవార్డును సాధించాడు. దక్షిణాఫ్రికా జట్టులో టెస్టు మ్యాచ్‌లలో ఐదు వికెట్లకు పైగా తీసిన పేసర్లలో ఆరో వ్యక్తిగా లుంగీ ఎంగ్డి రికార్డును సాధించాడు. టెస్టు మ్యాచ్‌లలో ఆరంగేట్రం చేసిన ప్రథమార్ధంలోనే ఐదు వికెట్లు తీసిన వారిలో దక్షిణాఫ్రికా పేసర్లలో లాన్స్ క్లూస్‌నెర్ (8/62, భారత్‌తో 1996లో జరిగిన మ్యాచ్), చార్లెస్ లాంగెవెల్డ్ (5/46 2005లో ఇంగ్లాండ్‌లో జరిగిన మ్యాచ్), వెర్నన్ ఫిలాండర్ (5/15 ఆస్ట్రేలియాతో 2011లో జరిగిన మ్యాచ్), మర్చంట్ డీ లాంగె (7/81 శ్రీలంకతో 2011లో జరిగిన మ్యాచ్), కైల్ అబొట్టి (7/29 పాకిస్తాన్‌తో 2013లో జరిగిన మ్యాచ్) ఉన్నారు.

★ ★ ★

రెండో ఇన్నింగ్స్‌లోనూ అదేతీరు

చటేశ్వర్ పుజారా తన తొలి ఇన్నింగ్స్‌లో చేసిన తప్పిదమే మళ్లీ రెండో ఇన్నింగ్స్‌లోనూ చేశాడు. పుజారా 47 బంతులు ఎదుర్కొని రెండు ఫోర్లతో కేవలం 19 పరుగులు మాత్రమే చేసి జట్టును మళ్లీ నిరాశపరిచాడు. ఆట ప్రారంభమైన 19వ బంతికే రన్ అవుటై రెండు ఇన్నింగ్స్‌లోనూ రెండుసార్లు రన్‌ఔటైన భారత ఆటగాడిగా చెత్తరికార్డును మూటకట్టుకున్నాడు. పుజారా మాదిరిగానే రెండు ఇన్నింగ్స్‌లలో రనౌటైన వారి జాబితాలో మరి కొందరు క్రికెటర్లు కూడా ఉన్నారు. వెల్లింగ్టన్‌లో జింబాబ్వేతో 2000 సంవత్సరంలో జరిగిన రెండు ఇన్నింగ్స్‌లలో న్యూజిలాండ్ బ్యాట్స్‌మన్ స్టీఫెన్ ఫ్లెమింగ్ కూడా రనౌటైన చరిత్ర ఉంది. అదేవిధంగా ఆస్ట్రేలియా స్కిప్పర్ మార్క్ టేలర్, ఆస్ట్రేలియా మాజీ వికెట్ కీపర్ ఇయాన్ హీలే కూడా రెండు ఇన్నింగ్స్‌లలో రనౌటైనవారి జాబితాలో ఉన్నారు.



స్కోర్ బోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ :335 **భారత్ తొలి ఇన్నింగ్స్ : 307**

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ :258 **భారత్ రెండో ఇన్నింగ్స్: 151 (50.2 ఓవర్లు)**

భారత్ రెండో ఇన్నింగ్స్: మురళీ విజయ్ బి రబడ 9, ఎల్.కే.రాహుల్ సి మహరాజ్ బి లుంగీ ఎంగ్డి 4, చటేశ్వర్ పుజారా రనౌట్ (డివిలియర్స్/డికాక్) 19, విరాట్ కోహ్లీ ఎల్‌బిడబ్ల్యు బి లుంగీ ఎంగ్డి 5, పార్థివ్ పటేల్ సి మోర్నె మోర్కెల్ బి రగడ 19, రోహిత్ శర్మ సి డివిలియర్స్ బి రబడ 47, హర్థిక్ పాండ్య సి డికాక్ బి లుంగీ ఎంగ్డి 3, మహ్మద్ షమీ సి మోర్నె మోర్కెల్ బి లుంగీ ఎంగ్డి 28, ఇషాంత్ శర్మ నాలుగు (నాటౌట్), జస్ప్రీత్ బుమ్రా సి ఫిలాండర్ బి లుంగీ ఎంగ్డి 2.

ఎక్స్‌ట్రాలు: బి 4, డబ్ల్యు 1) 5. మొత్తం 50.3 ఓవర్లలో 151 పరుగులు.

వికెట్ల పతనం: 11-1, 16-2, 26-3, 49-4, 65-5, 83-6, 87-7, 141-8, 145-9, 151-10.


బౌలింగ్: వెర్నాన్ ఫిలాండర్ 10-3-25-0, కగిసో రబడ 14-3-47-3, లుంగీ ఎంగ్డి 12.2-3-39-6, మోర్నె మోర్కెల్ 8-3-10-0, కేశవ్ మహారాజ్ 6-1-26-0.



భారత్‌తో జరిగిన టెస్ట్‌మ్యాచ్‌లో ఆరు వికెట్లు సాధించిన ఆనందంలో దక్షిణాఫ్రికా పేసర్ లుంగీ ఎంగ్డి

బ్యాట్స్‌మన్లే ముంచారు: కోహ్లీ

సెంచూరియన్, జనవరి 17: సఫారీ గడ్డపై ఓటమికి బ్యాట్స్‌మెన్‌ల వైఫల్యమే కారణమని టీమ్ ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ వెల్లడించాడు. బౌలర్లు రాణించినా ఫలితం దక్కలేదని అతడు పేర్కొన్నాడు. అన్ని విభాగాల్లోనూ పట్టుసాధించి దక్షిణాఫ్రికా జట్టు సిరీస్‌ను కైవసం చేసుకుందని విరాట్ చెప్పాడు. బుధవారం నాటి రెండో టెస్ట్‌లో 135 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో కోహ్లీ టీమ్ ఓటమి పాలైంది. సిరీస్‌ను 2-0తో సఫారీ జట్టు గెలుచుకుందన్నాడు.'దక్షిణాఫ్రికాకు గట్టిపోటీ ఇవ్వలేకపోయాం. ఎలాగైనా గెలవాలని అనుకున్నాం. అయితే వరుస వైఫల్యాలతో ఓటమి తప్పలేదు'అని మ్యాచ్ అనంతరం కోహ్లీ వెల్లడించాడు. ఫీల్డింగ్ విభాగంలోనూ భారత్ పేలవమైన ప్రదర్శన చూపించింది. బంగారంలాటి క్యాచ్‌లు జారవిడిచారు. అన్నింటికన్నా పేలవమైన బ్యాటింగ్‌తో పరాజయం తప్పలేదని కోహ్లీ చెప్పుకొచ్చాడు.



అన్ని విభాగాల్లోనూ పైచేయిగా నిలిచిన దక్షిణాఫ్రికానే విజయం వరించిందని విరాట్ అన్నాడు. సమష్టిగా రాణించిన సఫారీలు సిరీస్‌ను దక్కించుకున్నారని తెలిపాడు. ఈ టెస్ట్ ఎంతో కష్టమైందని భావించినా జట్టుమొత్తం సమన్వయంతో ఆడడంతో విజయం దక్కిందని దక్షిణాఫ్రికా కెప్టెన్ డుప్లెస్సిస్ అన్నాడు. సిరీస్‌ను కైవసం చేసుకునేందుకు గత ఐదు రోజులూ ఎంతో సాధన చేశామని అతడు స్పష్టం చేశాడు. ఈ సందర్భంగా గెలుపులో కీలక పాత్ర పోషించిన ఫాస్ట్ బౌలర్ లుంగీ ఎంగిడిపై అతడు ప్రశంసలు కురిపించాడు. 39 పరుగులు ఇచ్చి ఆరు వికెట్లు తీసి భారత్‌ను కోలుకోలేని దెబ్బతీశాడని కెప్టెన్ పేర్కొన్నారు. సెకండ్ ఇన్నింగ్స్‌లో చెలరేగి ఆడిన ఎంగిడికి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

సన్నద్ధత లేకే దారుణ ఓటమి




కోహ్లీ సేనపై బేడీ విసుర్లు

న్యూఢిల్లీ, జనవరి 17: దక్షిణాఫ్రికాపై భారత క్రికెట్ జట్టు ఓటమి తనను ఏ మాత్రం ఆశ్చర్యానికి గురి చేయలేదని మాజీ కెప్టెన్ బిషన్‌సింగ్ బేడీ వ్యాఖ్యానించాడు. శ్రీలంక వంటి చిన్న జట్టుపై గెలిచేందుకు కాలాన్ని వృథా చేయడమే గాక, దక్షిణాఫ్రికాతో తలపడేందుకు కోహ్లీ సేన ఏ విధంగానూ సన్నద్ధం కాలేకపోయిందని అన్నాడు. సెంచూరియన్‌లో బుధవారం నాడు 135 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై దారుణ వైఫల్యం చెందిన భారత జట్టు 2-0 తేడాతో సిరీస్‌ను చేజార్చుకుందని బేడీ పేర్కొన్నాడు. దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లే ముందు శ్రీలంకతో మ్యాచ్‌లు ఆడి కాలాన్ని వృథాచేసినందునే భారత జట్టు ఘోర పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చిందని ఆయన విశ్లేషించాడు. 'మనవాళ్లకు ఎలాంటి సన్నద్ధత లేదు.. శ్రీలంక జట్టుతో ఆడి కాలహరణం చేశారు.. దక్షిణాఫ్రికా జట్టుతో తలపడడానికి ముందు- అత్యంత బలహీనమైన శ్రీలంక జట్టుతో నెలన్నర రోజులపాటు మ్యాచ్‌లు ఆడడం సరికాదు..' అని బేడీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. 'శ్రీలంక వెళ్లి అక్కడి జట్టుపై మనం గెలవవచ్చు.. వారిని భారత్‌కు ఆహ్వానించవచ్చు.. అయితే, దక్షిణాఫ్రికా వంటి పెద్ద టీమ్‌లతో ఆడాలంటే తగినవిధంగా సన్నద్ధం కావాల్సిందే.. దక్షాణాఫ్రికాపై భారత్ ఓటమి గురించి గోరంతలు కొండంతలు చేయనక్కర్లేదు.. అయినా మనం వాస్తవాలను గుర్తించాలి.. మన బౌలర్లు బాగా రాణించారు.. బ్యాటింగ్ మాత్రం నిరాశ పరచింది.. భారత టీమ్‌ను తీర్చిదిద్దాల్సిన తరుణం ఇదే..' అని ఆయన చెప్పాడు.

ఈ ఏడాది చివర్లో ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాల్లో భారత్ జట్టు పర్యటించాల్సి ఉందని, దక్షిణాఫ్రికాలో వలే కాకుండా 'అభిమానులను పెంచుకునేలా' మన జట్టు ఆడాలని బేడీ ఆకాంక్షించాడు. అయిదు రోజుల మ్యాచ్‌ల కన్నా వన్‌డే మ్యాచ్‌లకు ఆటగాళ్ల ఎంపికపై ఎక్కువ దృష్టి పెడుతున్నారని ఆయన వ్యాఖ్యానించాడు. దక్షిణాఫ్రికాపై జరిగిన మొదటి రెండు టెస్టులకు వైస్ కెప్టెన్ రెహానే బదులు రోహిత్ శర్మను ఎంపిక చేయడాన్ని ఆయన తప్పుపట్టాడు. వైస్ కెప్టెన్ ఆడకపోవడాన్ని తాను వ్యతిరేకిస్తున్నానని బేడీ తెలిపాడు. రెహానేను ఆడించకపోతే అతనిని వైస్ కెప్టెన్‌గా ఎందుకు ఎంపిక చేశారని ప్రశ్నించాడు. టెస్టు మ్యాచ్‌లకు ఆటగాళ్ల ఎంపిక సరిగా లేనందునే దక్షిణాఫ్రికాతో సిరీస్‌ను కోల్పోవలసి వచ్చిందన్నాడు. ఫస్ట్ టెస్ట్‌లో రాణించిన పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను ఆ తర్వాత తప్పించడం కూడా సరికాదన్నాడు.

స్లో ఓవర్ రేట్.. దక్షిణాఫ్రికాకు ఫైన్



సెంచూరియన్, జనవరి 17: భారత్‌తో సెంచూరియన్ మైదానంలో జరిగిన రెండో టెస్టు మ్యాచ్ సందర్భంగా దక్షిణాఫ్రికా జట్టు స్లో ఓవర్ రేటు కారణంగా ఆ జట్టుకు అపరాధ రుసుం విధించారు. ఐసీసీ మ్యాచ్‌కు సంబంధించిన క్రిస్ బోర్డు ఆఫ్ ది ఎమిరేట్స్ ఎలైట్ ప్యానల్ దక్షిణాఫ్రికా జట్టు కెప్టెన్ డిప్లిసెస్ మ్యాచ్ చివరిలో నిర్ణీత సమయంలో రెండు ఓవర్లు తక్కువగా వేయడంతో ఫైన్ విధించినట్టు పేర్కొంది. ఇది ఐసీసీ నిబంధనలు ప్రకారం నిర్ణీత సమయంలో ఎన్ని ఓవర్లు తక్కువ వేస్తే అంత శాతం మ్యాచ్‌లో కోత విధిస్తారు. నిబంధనల ప్రకారం ఒక బౌలర్‌కు కేటాయించిన ఓవర్లను నిర్ణీత సమయంలో పూర్తి చేయాల్సి ఉంటుందని, అలా కాకుంటే అతని మ్యాచ్ ఫీజు నుంచి 10 శాతం వరకు కోత విధించవచ్చునని పేర్కొంది. ఈ ఫైన్ విషయంలో సదరు జట్టు కెప్టెన్‌కు రెండింతలు విధించే వీలుంటుందని పేర్కొంటూ దక్షిణాఫ్రికా జట్టు కెప్టెన్ డుప్లెసిస్ ఇచ్చే మ్యాచ్ ఫీజులో 40 శాతం కోత విధించినట్టు పేర్కొంది.

పాండ్య తప్పులను నాతో పోల్చకండి: కపిల్

న్యూఢిల్లీ, జనవరి 17: భారత క్రికెట్ జట్టు ఆటగాడు హార్థిక్ పాండ్య ఆటలో ఎలాంటి తప్పులు చేసినా అతనిని తనతో పోల్చవద్దని మాజీ కెప్టెన్, ఆల్‌రౌండర్ కపిల్‌దేవ్ అన్నాడు. దక్షిణాఫ్రికాతో సెంచూరియన్ మైదానంలో జరిగిన టెస్ట్‌మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో హార్థిక్ పాండ్య ఆట తీరుపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశాడు. ఇటీవల పాండ్య భారత్‌కు మరో ఆల్‌రౌండర్ దొరికాడని కపిల్ ప్రశంసలు గుప్పించిన విషయం తెలిసిందే. అయితే, దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్‌మ్యాచ్‌లో నిర్ణీత లక్ష్యం 287 ఛేదనలో చేతులెత్తేసిన సమయంలో కనీసం పాండ్య అయినా భారత్‌ను ఆదుకుంటాడని నమ్మినవారి ఆశలను వమ్ముచేశాడు. ఈ మ్యాచ్‌లో ఐదు వికెట్లు కోల్పోయి 65 పరుగులు చేసిన సమయంలో క్రీజులోకి వచ్చిన పాండ్య తనకిష్టమైన షాట్‌ను కొట్టబోయి దక్షిణాఫ్రికా పేసర్ లుంగీ ఎంగ్డికి దొరికిపోయి ఉసూరుమనిపించాడు.

మళ్లీ ఇంగ్లాండ్ జట్టులోకి బెన్‌స్టోక్స్

లండన్, జనవరి 17: వివాదాస్పద ఇంగ్లాండ్ క్రికెట్ జట్టు ఆలౌరౌండర్ బెన్‌స్టోక్స్‌ను మళ్లీ ఆ దేశ జట్టులోకి తీసుకోకున్నారు. ఈ విషయాన్ని ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) బుధవారం వెల్లడించింది. గత ఏడాది సెప్టెంబర్‌లో ఒక నైట్‌క్లబ్‌లో జరిగిన ఒక వివాదాస్పద సంఘటనలో ప్రమేయం ఉందన్న కారణంతో స్టోక్స్‌పై ఈసీబీ నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియాతో ఇటీవల జరిగిన యాషెష్ సిరీస్‌లో స్టోక్స్ ఆడలేదు. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో బెన్‌స్టోక్స్ ఇచ్చిన వివరణకు పరిగణనలోకి తీసుకుని అతనిని ఇంగ్లండ్ జట్టులోకి తీసుకునే అంశం పరిశీలించి ఒక నిర్ణయానికి వచ్చినట్టు పేర్కొంది.

20 నుండి ఆంధ్రా బ్యాడ్మింటన్ లీగ్

విశాఖపట్నం (స్పోర్ట్స్), జనవరి 17 : రెండవ ఆంధ్రా బ్యాడ్మింటన్ లీగ్ (ఎబిఎల్) పోటీలు ఈనెల 20 నుండి ప్రారంభం కానున్నాయి. ఈ లీగ్ ప్రారంభ పోటీలకు విశాఖ నగరం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం వేదిక కానుంది. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ లీగ్ పోటీలు ఆంధ్రప్రదేశ్‌లోని 8 ప్రధాన పట్టణాలలో నిర్వహిస్తున్నారు. ఈ లీగ్‌లో అమరావతి ఏసర్స్, సినర్జీస్ వైజాగ్ స్మాషర్స్, ప్రకాశంబుల్స్, విజయనగరం స్టీల్ జెయింట్స్, గుంటూరు క్లబ్ పయనీర్స్, గోదావరి గన్స్ జట్లకు చెందిన 40 మంది జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాకారులు పోటీ పడనున్నారు. ఈ పోటీల విజేతలకు రూ. 10 లక్షల నగదు బహుమతి లభిస్తుంది. పోటీల షెడ్యూల్ ప్రకారం 20న విశాఖ, 21 విజయనగరం, 22న కొత్తపేట, 23న విజయవాడ, 24న గుంటూరు, 25న ఒంగోలు, 26న నెల్లూరు, 28న ఫైనల్ పోటీలు కర్నూలులో జరుగుతాయి. క్రీడాకారుల వేలంలో కె. నందగోపాల్ అత్యధిక బిడ్డింగ్ లక్షా 5 వేల రూపాయలతో డిఫెండింగ్ ఛాంపియన్స్ గోదావరి గన్స్ జట్టులో స్థానం దక్కించుకున్నాడు.

Printed and Published from Vijayawada by **K.Sudhakar** on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor **T.V.Ravi Reddy**, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90



భూమిక

ఆంధ్రభూమి

గురువారం 18, జనవరి 2018

చిగురంత ఆశ

మలి వయసులో మానసిక సాంత్వన అవసరం

చాలా మంది వృద్ధాప్యాన్ని శాపంగా పరిగణిస్తారు. ఆ వయసులో ఎలా గడపాలా అని మధ్య వయసు నుంచే ఆలోచిస్తారు. పిల్లలు తమను కళ్లల్లో పెట్టుకుని చూసుకోవాలని ఆశపడతారు. ఏమీ చెయ్యలేని, చేసుకోలేని నిస్సహాయత, ఒంటరితనం, నిరాదరణ వంటి రుగ్మతులతో మానసిక కుంగుబాటుకు లోనవుతుంటారు. మలివయసులో పలకరించే సమస్యలే అధికం. అవి భిన్నంగా కూడా ఉంటాయి. పిల్లలంతా బయటకు వెళ్లిపోతుంటే రోజంతా ఒంటరిగా గడపాల్సి రావటం.. ఇవన్నీ వృద్ధుల్లో కుంగుబాటుకు దారితీసేవే. కాని మన దేశంలో వృద్ధాప్యం వేధనాభరితంగా తయారైంది. వృద్ధులు అధికంగా ఉన్న దేశాలలో ప్రపంచంలోనే రెండవ అతి పెద్ద దేశంగా మన దేశం ఉంది. వృద్ధులు ఉన్న 96 దేశాలలో మనది 71వ దేశంగా పరిగణించబడుతోంది. మనదేశంలో 80శాతం వృద్ధులు గ్రామీణ ప్రాంతాలలోనే ఉంటున్నారు.

40శాతం మంది అతి తక్కువ సంపాదనతో బతుకీడుస్తున్నారు. ఇందులో 73శాతం చదువురానివారే అధికంగా ఉన్నారు. ఇదిలావుండగా వృద్ధాప్యంలో 73శాతం మంది గుండె సంబంధిత వ్యాధులతో చనిపోతుండగా..20శాతం మంది క్యాన్సర్ సంబంధిత జబ్బులతో మరణిస్తున్నారు. జబ్బు పడిన 50శాతం మందిలో 30శాతం మంది ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు.

మనలో చాలామంది కుక్కపిల్లను పెంచడంలో చూపించే శ్రద్ధ, వాటిమీద కురిపించే ప్రేమ వయసుడిగిన తల్లిదండ్రులమీద, అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యలమీద చూపించలేకపోతున్నాం అన్నది వాస్తవం. చాదస్తం, సర్దుకుపోవడంలేదు, కొత్త వాతావరణానికి అలవాటు పడటంలేదు, వెనుకటి అలవాట్లు మానుకోవడం లేదు, కొత్త కుటుంబ సభ్యులను గుర్తించడం లేదు, మంకుపట్టు పడతారు.. కారణాలేవైనా మనలో చాలామంది తల్లిదండ్రులను ముఖ్యంగా వయోవృద్ధులను దూరంగా ఉంచడానికే మొగ్గుచూపుతున్నారన్నది వాస్తవం. వయసు తెచ్చిన చిత్త వైకల్యమో, లేక పిల్లలు పెద్దవారయ్యారు, నిర్ణయాలు తీసుకోగల సమర్థులు అన్న విషయాన్ని గ్రహించలేని బలహీనతవల్లనో ముసలి తల్లిదండ్రులు, అమ్మమ్మ / నాన్నమ్మ, తాతయ్యలు బెట్టు చేస్తే భరించలేకపోతున్నాం. మూగ జీవాలమీద చూపుతున్నది మానవత్వమైతే, మనసుపెట్టి మాటలాడే తల్లిదండ్రులపట్ల, ముసలి అవ్వలపట్ల మన దాష్టీకాన్ని ఏమని పిలవాలి? మన చిన్నతనంలో అన్నివేళలా మనం అమ్మానాన్నల మనసెరిగి అనుకూలంగా మసలుకున్నామా? మారాం చేయలేదా? ధిక్కరించలేదా? ప్రశ్నించలేదా? పారిపోతానని బెదిరించలేదా? హక్కుల కోసం పోరాటం చేయలేదా నాడు మనలను ఆవహించిన పసితనమే నేడు వయసుడిగిన మన అమ్మా నాన్నలను, తాతయ్యలను అమ్మమ్మ, నాన్నమ్మలను ఆవహించింది. ఇది ప్రకృతి సహజం. నాడు పసితనంలో మన ప్రశ్నలకు ఓపికగా విని, తిరుగుబటును ప్రేమతో సహించి, బెదిరింపులకు భయపడి, హక్కులను గుర్తిస్తూ మనమీద మన అమ్మా నాన్నలు చూపిన ఔదార్యం, కురిపించిన ప్రేమామృతం, మన కోరికలు నెరవేర్చడానికి చేసిన త్యాగాలు, వదులుకున్న సొంత సుఖాల్లో కొంతయినా నేడు మనం వారిపట్ల చూపలేమా?

పాలు, బిస్కట్లు, కోడిగుడ్లు, బొక్కలు, సబ్బులు, వాక్సిన్‌లు అంటూ నెల 2 వేలు కుక్కకు ఖర్చుచేస్తాం. కాని చిన్నతనంలో తమ అవసరాలను, కోరికలను చంపుకొని మన కోరికల కోసం ఖర్చుచేసిన తల్లిదండ్రుల కొరకు 500 ఖర్చు చేయడానికి వెనుకా ముందుచేస్తాం, అసలు వారికి అవసరాలు ఉంటాయనే గుర్తిచడంలేదు! కుక్కల మేటింగులమీద చూపే శ్రద్ధలో పదోవంతు కూడా తల్లిదండ్రుల హెల్త్ చెకప్‌మీద చూపడంలేదు. మన కడుపున పుట్టిన పిల్లల కోరిక మేరకు పెంచుకుంటున్నామని సరిపెట్టుకుందామా, మరి మనలను కని పెంచిన వారిపట్ల మనకు బాధ్యత లేదా? రెండు రోజులు ఊరుకెళితేనే పెంచుకున్న కుక్కను డాగ్ కేర్ సెంటర్‌లో, లేదంటే నమ్మకమైన పక్కింటివారికో, బంధువులకో అప్పగించి పూట పూటకి దాని ఆలనా పాలనా తెలిసికొనే ప్రేమ మూర్తులైన మనం చిన్న విశ్వాసానికే పొంగిపోయి కుక్కపిల్లకు ఎంతో చాకిరీ చేస్తున్నాం. చిన్నతనంలో అమ్మ వెళ్ళమంటే ఇంటి పక్కనే ఉన్న కిరాణా దుకాణానికి వెళ్లటానికి కూడా బద్ధకించిన మనం, పెంచుకున్న కుక్కకు చికెన్ బొక్కలకోసం మార్కెట్ మొత్తం వెతుకుదాం. మసకబారిన నాన్న చూపుమీద శ్రద్ధచూపని మనం, కుక్క బిస్కెట్ల కొరకు ఎంతైనా ఖర్చుచేస్తాం. కుక్కను కొనడానికి, వాక్సిన్‌ల కొరకు, సబ్బులని, షాంపులని ఎంతైనా ఖర్చు చేసే మనం, ఇంట్లో వున్న ముసలివాండ్ల కనీస ఖర్చుల విషయంలో మాత్రం లెక్కలు వేసుకుంటాం. అన్నదమ్ములు, అక్కచెలెళ్ళ మధ్య వాటాలు వేసుకుంటాం! వంతులు పెట్టుకుంటాం? నాడు నేను అమ్మ కొడుకును, నేను నాన్న బిడ్డను అని పోటీపడి మన అవ్యాజ్యమైన ప్రేమతో నాడు వాళ్ళను ఉక్కిరిబిక్కిరి చేసిన మనం, నేడు మలి వయసులో అమ్మ బాధ్యత నీదే, నాన్నను నేను భరించలేను నీతో ఉంచుకో అంటూ విదిలించుకుంటున్నాం, అదనపు బరువంటూ నిట్టూర్చుతున్నాం! మనమే లోకమనుకుని మనకోసం ఎన్నో వదులుకున్న వారి విలువ కుక్క విశ్వాసం పాటిది కాదా? ఇంతకూ మన విశ్వాసం ఏపాటిది? తిరిగిరాని లోకాలకు తరలివెళ్ళిన తరువాత ఘనంగా జరిపే కర్మకాండలమీద చేసే శ్రద్ధలో పావలా వంతు కండ్లముందు కదలాడుతున్న రోజుల్లో మనింట్లోని ముసలివాండ్లమీద చూపగలిగితే, ఆప్యాయతతో కూడిన స్పర్శను, మాటను వారికదించగలిగితే వారు జీవన్ముక్తులు కారా? ఎవరూ చూడని వైరతరణిని దాటించాలనుకోవడం కన్నా బ్రతికుండగా ఆదరించడం గొప్ప కర్మ కాదంటారా? అంతిమ ఘడియల్లో ఆప్యాయతకు, ఆసరాగా అంగలార్చిన తల్లిదండ్రులు, తాతయ్యలు, అమ్మమ్మలు, నాన్నమ్మలు తనువు చాలించిన తరువాత పిండాల రూపంలో మనం పెట్టే మృష్టాన్న భోజనం కోసం ఆత్మలుగా ఎగిరివస్తారంటారా? మూగ జీవాలమీద కురిపిస్తున్న వల్లమాలిన ప్రేమలో కొంతైనా మలి సంధ్యలోని కన్నవారిమీద చూపించగలిగితే అంతకుమించిన మహాయజ్ఞం, కర్మయోగం మరోటి ఉండదు కదా.

-చందుపట్ల రమణ కుమార్‌రెడ్డి



పసితనంలో తెలిసీ తెలియక తప్పటడుగులు వేసినపుడు మనకు ఆసరాగా నిలిచిన, గోరుముద్దలు తినిపించిన చేతులవి, మనకు నడకలు నేర్పిన పాదాలని, కళ్ళలో వత్తులు వేసుకొని మన కండ్లలో నిద్ర కొరకు ఎదురుచూసిన నేత్రాలవి, నేడు వయసుడిగి, కండరాలలో పట్టు సడలి ఆసరా కొరకు ఎదురుచూస్తున్నాయి. ఊతంగా నిలబడలేదా? సుదీర్ఘ తీరాలకు అడుగులువేస్తున్న వారి ఈ చివరి మజిలీలో పసితనపు చిరునవ్వులను వారికి పరిచయం చేయలేమా? వయసు ఉడిగిన తల్లిదండ్రులను, బామ్మలను, జేజమ్మలను, తాతయ్యలను వాళ్ళ మానాన వదిలేసి రోజుల తరబడి తిరుగుతున్నాం, వేరు కాపురాలు పెడుతున్నాం. వారి ఆలనా పాలనా గుర్తురాదెందుకో? పొద్దున్నే ఇంత వండేసి దాన్నే సాయంత్రం కూడా తినేయమని చెప్పి మరునాడు ఉదయమే వస్తామంటూ ముసలివాళ్లను ఇండ్లలో ఒంటరిగా వదిలేసి వెళ్ళే వాళ్లెందరో ఉన్నారు మనలో. ఆ ఒంటరి పక్షులకు ఏదైనా జరగరానిది జరిగితే, ఆత్మీయ పలుకు లేని ఆ ముసలి గుండె ఆగిపోతే ఎలా అనే ఆలోచనే మనకు రాదెందుకు? వయసుడిన మన తల్లిదండ్రులకు, నానమ్మ, తాతయ్యలకు చోటులేని మన ఏసీ కారులో ఆశ్చర్యంగా పెంపుడు కుక్కలకు మాత్రం ప్రత్యేక ప్రవేశం ఉంటుంది! మనసులో విప్పలేని మూగ జీవానికి, నోరున్నా బలవంతంగా మనసు కట్టేసుకుంటున్న ముసలివాళ్ళకు తేడా లేదంటారా?



వార్త-వ్యాఖ్య

-వీరాజీ

ఏటిఎంలో ఎలుకలు!



సామెత మార్చేయ్యాలి- ఇల్లు కొత్త అయితే ఎలుకలు కొత్తా అని కాదు- ఎటిఎం కొత్తదైతేనేమ్? ఎలుకలకీ కొత్త కాదు. ఖజకిస్తాన్ రాజధాని ఆస్తానాలో ఒక ఎటిఎం కౌంటర్‌లో కరెన్సీ నింపడానికి వెళ్లిన సిబ్బంది- పరీక్ష చేద్దామని కార్డు పెట్టి చూశారు. షాక్ తిన్నారు. కరెన్సీ నోట్ల బదులు నోట్ల ముక్కలు వచ్చాయి. తెరచి చూశారు. ఒక మూషిక రాజము తాపీగా కరెన్సీ నోట్లను ఆరగిస్తూ కనపడ్డది. గుండె ఝుల్లుమంది.. ఈలోగా చిన్న చిన్న ముక్కల తుక్కు క్రింద కొరికిపోస్తున్న మరో ఎలుక కూడా దర్శనమిచ్చింది. సాధారణంగా చిట్టెలుకలు పాత న్యూస్‌పేపర్లని ప్రాక్టీసు కోసం కొరికి కొరికి తుక్కు క్రింద పోసేస్తాయి.. కానీ ఇక్కడ ఒక ఎలుకల జంట- హాయిగా వెచ్చగా ఎటిఎం పెట్టెలో చాలాసేపటినుంచి శృంగార కాలక్షేపం చేస్తూన్నట్లు- కరెన్సీకి నోట్ల తుక్కు ఒక్కటే కాదు- ఎలుక గొద్దెలు కూడా సాక్ష్యం చెబుతున్నాయి- మనం 'స్వాహా చేసేశామ్' అంటారు అనుకుంటూ సదరు సిబ్బంది జంట దీన్ని వీడియో తీసుకున్నారు.. మొత్తం ఇరవై వేల డాలర్ల విలువ చేసే కరెన్సీని అవి చెల్లకుండా కొరికేశాయి. ఎలుకలు స్మార్ట్ అంటారు కానీ వాటిని ఆరగించే పాములు ఇంకా గడుసు.. ఎలుకల కోసం ఎటిఎంలు దూరరాని చోటులు ఏమాత్రం కావు కనుక అక్కడ దొరికితే ఓ ఎలుకని 'బ్రేక్‌ఫాస్ట్'గా ఆరగించాలని- ప్రొద్దుటే ఎటిఎం విజిట్స్ చెయ్యొచ్చు.

'మార్నింగ్ వాకింగ్ స్నేక్స్'- ఇంగ్లాండ్ నైరుతి ప్రాంత కౌంటీ 'డోర్సెట్'లో ఒక ఏటిఎం కౌంటర్‌లో కాష్ కోసం వచ్చిన ఒక బామ్మగారు కౌంటరుమీద ప్రాకుతూ చెకింగులో నిమగ్నమై వున్న నాలుగడుగుల నల్ల నాగును చూసి పరుగో.. సరే, నిపుణులు వేంచేశారు.. ఇది మన పాము కాదు- కాలిఫోర్నియా నుంచి ఎవరో తెచ్చుకున్న పెంపుడు పాము అని అమెరికన్ స్నేక్ అంటూ ముక్కున వ్రేలేసుకున్నారు! దొంగలే కాదు ఎలుకలు, పాములు కూడా వుంటాయ్- మన దేశంలో ఏటిఎంలలోనైతే ఈమధ్య 'నో క్యాష్' బోర్డులే ఎక్కువగా కనబడుతున్నాయని నిత్య నూతన వార్త!

దుబాయ్ వెళ్లిన చాయ్ కొట్టు జంట!



విజయన్ (67), మోహనా (65) ఆ ఇద్దరు 'ఆరోహా' అనే ట్రావెల్స్ కంపెనీ ఆహ్వానంమీద దుబాయ్ వెళ్లి విఐపి లెవెల్ పర్యటన ముగించుకు వచ్చేశారు ఈమధ్య. ఆ ఇద్దరు ఈపాటికే పద్దెనిమిది దేశాలు అప్పుడూ అప్పుడూ చుట్టివచ్చేశారు. 1998 నుంచి ఈ దంపతులు కేరళలో కోచి నగరంలో బాలాజీ కఫే అనే టీ దుకాణం నడుపుకుంటున్నారు. ఓ చాయ్‌వాలా దేశ ప్రధాని అయిన వార్తలే కాదు- వేరే ఆస్తి పాస్తీ లేని పేద జంట కూడా ఇండియన్ టీని బడుగు వర్గాలకి 'చాయ' (కేరళలో అలాగే అంటారు) గా అమ్ముతూ ఇప్పటికి పద్ధెనిమిది- బ్రిటన్, ఫ్రాన్సు, ఆస్ట్రియా, ఈజిప్టు, యుఎఇ, సిట్జర్లండ్ వగైరా చుట్టి వచ్చారు. కమ్మని తేనీరు కలిపి ఆప్యాయంగా అందించడం తప్ప వేరే విద్యలు రాని విజయన్‌కి వాళ్ల నాన్నగారు దేశంలోని దేవాలయాలన్నీ తన చాయ్ కొట్టుతో తీసుకుపోయి చాయ్ అమ్ముకుంటూ దర్శించాడు. అతనుకూడా ఆయన కొడుకుని తీసుకుపోయేవాడు- కాని విజయన్ ఓ అడుగు ముందుకు వేసి దూర దూర దేశాలన్నీ చూడాలని కలలుగన్నాడు. ఎవరి సాయం, స్పాన్సర్‌షిప్ లేకుండా మొన్నటికి ఒక్క అమెరికా తప్ప అన్ని దేశాలు చుట్టివచ్చాడు. అతని భార్య మోహనా చేదోడు వాదోడు- గజాల లెక్కన టీ- కాఫీ అమ్మగలరు వీళ్ళు- 'చేయి ఇలా సాగదీసి' టీ గ్లాసులోకి దింపితే అదో స్వర్గతుల్య దృశ్యం- అదో అమృత వర్షం పేదలకి. అట్లా చాయ్ అమ్మి రోజుకి ఐదు వందలు ప్రక్కన బెడతారు. నెలకింత అని చీటీ వేస్తారు. పొదుపుగా విదేశీ యాత్రల కోసం పైకం దాచి - ప్లస్ ఓ బ్యాంకు లోను కూడా పెడతారు. దేశాలు తిరిగివచ్చి చేసిన అప్పును కేవలం సమోసాలు, చాయ్, కాఫీలు అమ్మి తమ చిన్ని బాలాజీ కాఫీమీది ఆర్జనమీద తీర్చేసి మళ్లీ 'చలో' అంటారు ఈ జంట- అయితే వాళ్లకి సంసారాలు లేవు అనుకోవద్దు- గల్ఫ్ న్యూస్‌కి ఇంటర్వ్యూలో చెప్పాడు విజయన్- మా ఇద్దరు ఆడపిల్లలకి పెళ్లిళ్లుచేశాం- శశికళ, ఉషారాణి - వాళ్ళ పిల్లలు హ్యాపీగా వున్నారు. ఈసారి, దుబాయ్ లాంటి అద్భుత నగరానికి మా టీ కష్టం ఆర్జనతోనే మనుమల్ని, కూతుళ్ళని తీసుకుపోయి చూపించాలి అన్నాడు విజయన్. మోహన కేరళ శైలీలో చీర ధరిస్తుంది. అతను కేరళ స్టైలులో ధోతీ ధరిస్తాడు. పల్లెటూరు దంపతులులాగే గత ఇరవై ఏండ్లుగా పాలస్తీనా సహా ఎన్నో దేశాలు పర్యటించారు. ఏడు వింతలూ చూసి వచ్చారు. ఎలాగైనా అంటార్టికాకి వెళ్లాలి అన్నది బామ్మగారు మోహనా.. దక్షిణ ధృవ నుంచి మన ఉత్తర దిక్కు ఎలా వుంటుందో చూస్తుందిట. జై బోలో చాయ్‌కీ-

veeraji.pkm@gmail.com



ఆవు నెయ్యితో ఆరు లాభాలు

శరీరంలో పేరుకుపోతున్న చెడు కొవ్వును నివారించుకోవాలంటే ఆవు నెయ్యి వాడటం ఉత్తమమైన మార్గం అని ఆహార నిపుణులు సూచిస్తున్నారు. ఆవు నెయ్యి కేవలం మన పూజకు, దీపాలకు మాత్రమే ఉపయోగిస్తుంటాం. కాని గేదె నెయ్యి కన్నా పిల్లలకు చిన్నప్పటి నుంచి ఆవు నెయ్యి అలవాటు చేయమని సలహా ఇస్తున్నారు. జలుబు, దగ్గు దరిచేరనీయకుండా కాపాడుతుంది. అంతేకాదు శరీరం మృదువుగా ఉండాలంటే కూడా ఆవు నెయ్యి తినమని చెబుతున్నారు. ఆవు నెయ్యి వల్ల కలిగే లాభాలు గురించి తెలుసుకుందాం.

1. వంటలో ఆవు నెయ్యిని వాడటం వల్ల శరీరంలో పేరుకుపోయిన కొవ్వు కరిగిపోతుంది. ఆవు నెయ్యి శరీరంలోని వేడి తగ్గిస్తుందని నిపుణులు చెబుతున్నారు. రోజూ ఓ టీ స్పూన్ నెయ్యి పెసరుపప్పు కిచిడీలో వేసుకుని తింటే చాలు శరీరంలోని విష పదార్థాలన్నీ బయటకు వెళతాయి. మలబద్ధకం నివారించబడాలంటే అన్ని వయసుల వారూ ఆవు నెయ్యి తించే చాలు జీర్ణ క్రియ సాఫీగా జరిగిపోతుంది.
2. ఆవు నెయ్యి తినటం వల్ల కొవ్వును కరిగించే ఆమ్లం తయారవుతుంది. దీనివల్ల కొవ్వు కరిగి బరువు సులువుగా తగ్గిపోతారు.
3. శరీరంలో ఉండే వేడి వల్ల కణాలు దెబ్బతింటాయి. ఫలితంగా కొన్ని రకాల జబ్బుల బారిన పడవచ్చు. కాబట్టి శరీరంరోని వేడి తగ్గాలంటే ఆవు నెయ్యి ఎంతో మంచిది.
4. హార్మోన్లు సమతుల్యంగా ఉండేటట్లు తోడ్పడుతుంది. ముఖ్యంగా విటమిన్ కె2,ఎ,డి,ఇలు పెరగటానికి ఆవు నెయ్యి ఉపకరిస్తుంది.
5. వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. అలాగే ఎముక పుష్టి కూడా కలుగుతుంది. శరరంలో క్యాన్సర్ కణాలు వృద్ధిచెందకుండా కాపాడుతుంది.
6. ఆవు నెయ్యి తినటం వల్ల విటమిన్ కె2 వృద్ధిచెంది రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది. అంతేకాదు కొలెస్ట్రాల్‌ను బ్యాలెన్స్ చేస్తుంది.



భూమికకు రచనలు పంపండి

రచనలను ఈ మెయిల్‌లో స్కాన్ లేదా పిడిఎఫ్ ఫార్మాట్‌లో bhoomika@andhrabhoomi.netకు మెయిల్ చేయవచ్చు.

లేదా ఈకింది చిరునామాకు పంపగలరు.

మా చిరునామా :

ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక
36, సరోజినీదేవి రోడ్, సికిందరాబాద్- 03

వ్యూహం



22 అలపర్తి రామకృష్ణ

ఆసక్తిగా అతని వైపు చూసింది చెప్పమన్నట్లుగా.

ఐదేళ్ళ క్రిందట జరిగిన సంఘటన చెప్పుకుపోయాడు కాశి.

''ఐదేళ్ళ క్రిందట ఓ రోజు అరవింద్‌గారి ఛాంబర్‌లోకి వెళ్ళాను. అక్కడ స్మగుల్డ్ గూడ్స్ అమ్మే జాన్ కన్పించేడు. అతన్ని అంతకుముందు చాలాసార్లు అరవింద్‌గారితోపాటు చూశాను.

అరవింద్‌గారు, ఓ పిస్టల్ నా చేతిలో వుంచి ''కాల్చు.. జాన్‌కు గురిపెట్టి కాల్చు.. పిస్టల్‌లో డమ్మీ బుల్లెట్స్ వున్నాయిలే!

సైలెన్సర్ కూడా వుంది. నువ్వు పేల్చినా శబ్దం రాదు'' అన్నాడు.

పిస్టల్ పట్టుకోవడం అదే మొదటిసారి. ట్రిగర్ నొక్కాను. 'సర్'మన్న శబ్దం వచ్చింది పిస్టల్ నుంచి.. ఎదురుగా వున్న జాన్ ఓ ప్రక్కకు ఒరిగిపోయాడు.

''అదేమిటి? తమాషాకు అంటే నిజంగానే కాల్చేశావ్.. అన్యాయంగా మనిషిని చంపేశావ్'' అన్నాడు అరవింద్ లేచి నిలబడి.

నాకు చెమటలు పట్టాయి.. గుండె దడదడ కొట్టుకుంది.. భయపడిపోయి అరవింద్‌వైపు చూశాను, ఎలాగైనా ఆ గండం నుంచి గట్టెక్కించమని.

''వారం రోజులు నీ రూములోనే వుండు.. బయటకు రాకు.. జాన్ శవాన్ని మాయం చేస్తాను. జాన్ హత్య చేయబడ్డాడన్న విషయం ఎవరికీ తెలియనివ్వను.

వెంటనే ఇక్కడనుంచి వెళ్లి నీ రూములో వుండిపో'' అన్నాడు అరవింద్.

ఆయన చెప్పినట్లే చేశాను.. అప్పటినుంచి అరవింద్‌గారు నాకు దేవుడయ్యాడు.

ఈరోజు అరవింద్‌గారి ఛాంబర్‌లో మళ్లీ జాన్‌ను చూశాను.. నేను ఎవరిని హత్య చేయలేదన్న ఆనందం ఓవైపు, నన్ను మోసం చేసి భయపెట్టారన్న కోపం మరోవైపు.. ఐదు సంవత్సరాలపాటు నన్ను బ్లాక్‌మెయిల్ చేసి నన్ను తన చెప్పు చేతల్లో పెట్టుకున్నాడు అరవింద్.

లోహిత నవ్వింది.

''నాక్కూడా ఓ అవకాశం తప్పకుండా వస్తుంది.. డాక్టర్ అరవింద్‌ను కోలుకోని దెబ్బ కొడతాను. నన్ను తక్కువ అంచనా వేస్తున్నాడు. నేనేమిటో వాళ్ళకు తెలిసేటట్లు చేస్తాను.. నా తడాఖా చూపిస్తాను'' అన్నాడు కోపంతో పళ్ళు పటపట కొరుకుతూ.

''నాకో చిన్న హెల్ప్ చెయ్యాలి! నార్త్ బ్లాక్‌లో వున్న శేషగిరి అనే పేషెంట్‌కు ఏం ఆపరేషన్ జరిగిందో రికార్డులు చూసి చెబుతారా?'' అడిగింది లోహిత.

కంప్యూటర్‌లో పేషెంటు వివరాలు, జరిగిన ఆపరేషన్స్ వున్న ఫైల్ చూశాడు కాశి.

''కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేష్ జరిగింది.. అతని కిడ్నీని



హైదరాబాద్‌కు చెందిన బిజినెస్‌మాన్‌కు మార్పిడి చేశారు. శేషగిరి అంగీకారంతో జరిగిన ఆపరేషన్ కాదది.్పు. దిక్కు మొక్కు లేని వాళ్ళ శరీర భాగాలు తీసి ఇతరులకు అమర్చడం ఈ హాస్పిటల్లో జరిగే మామూలు కార్యక్రమమే

! నా దగ్గర వున్న వివరాలు పోలీసులకు ఇచ్చానంటే అరవింద్, అతని బాస్ కటకటాల పాలవుతారు''.

కోపంతో ఆ మాట అన్నాడేగాని మరుక్షణంలో తమాయించుకున్నాడు కాశి.

⁂

''సార్.. పంజాబ్ నుంచి మన్విత్‌సింగ్ వచ్చాడు. మిమ్మల్ని కలవాలంటున్నాడు.. పంపించమంటారా'' అడిగాడు కాశి ఇంటర్‌కామ్ నుంచి.

''చిన్నా చితకావాళ్ళను నా గదిలోకి పంపొద్దు.. అతనేం చేస్తున్నాడో, ఎవరి రిఫరెన్స్‌తో వచ్చాడో కనుక్కున్నావా?'' విసుగ్గా అడిగాడు డాక్టర్ అరవింద్.

''మన్విత్‌సింగ్ బిగ్‌షాట్.. జలంధర్‌లో ఆటో మొబైల్ ఇండస్ట్రీ వుందట.. ఆరిఫ్ రిఫరెన్స్ చెబుతున్నాడు''.

ఆరిఫ్ పేరు వినగానే ఎలర్ట్ అయిపోయాడు.

''ఆరిఫ్ పంపితే నీ దగ్గర ఎందుకు కూర్చోపెట్టుకున్నావ్? వెంటనే పంపించు.. అతను నా గదిలోకి వచ్చేక కూల్‌డ్రింక్స్ పంపించు'' అన్నాడు అరవింద్.

ఆరడుగుల పొడుగున్న మన్విత్‌సింగ్ దర్జాగా నడుచుకుంటూ డాక్టర్ అరవింద్ ఛాంబర్‌లోకి వచ్చాడు. అతని నీలం రంగు టర్బన్, బూడిద రంగు సూట్, నీలం రంగు నెక్ టైతో హుందాగా కన్పించాడు. ఇరవై ఎనిమిదేళ్ళు ఉంటాయేమోననుకున్నాడు.

''ఆయియే.. మన్విత్‌సింగ్ సాబ్.. ఆప్ కైసాహై?'' లేచి నిలబడి మన్విత్‌సింగ్‌కు షేక్ హ్యాండ్ ఇస్తూ పలకరించాడు డాక్టర్ అరవింద్.

హిందీలో మాట్లాడుకున్నారు ఇద్దరూ.

''మా నాన్న హైదరాబాద్ కార్పొరేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు. గుండెకు సంబంధించిన జబ్బుతో బాధపడుతున్నాడాయన.. గుండె నాళాలు కావాలి అర్జెంటుగా.''

''అదేమన్నా రెడీమేడ్‌గా దొరికే వస్తువా? ఉయ్ డోంట్ హావ్ ఎనీ హార్ట్ లైన్ బ్యాంక్ విత్ అజ్.. మా దగ్గర గుండె నాళాలు దొరకవ్. బ్రెయిన్ డెడ్ పేషెంటు నుంచి అప్పటికప్పుడు గుండెనాళాలు తీసి గుండె జబ్బుతో బాధపడుతున్న పేషెంట్‌కు అమర్చాలి! ఇట్స్ నాట్ ఎ ఈజీ టాస్క్'' అన్నాడు డాక్టర్ అరవింద్.

''ఆరిఫ్‌గారు అన్నీ చెప్పారు.. మీరు కోరినంత డబ్బు పే చేస్తాను.. ఎవరన్నా పేద పేషెంటును బ్రెయిన్ డెడ్‌గా చెయ్యండి.. అతని గుండె నాళాలు మా ఫాదర్‌కు మార్చండి.. ఎవ్రీథింగ్ ఈజ్ పాజిబుల్ ఇన్ యువర్ హాస్పిటల్.. అందుకే మీ దగ్గరకు వచ్చింది'' అన్నాడు మన్విత్‌సింగ్ డాక్టర్ వైపు సూటిగా చూస్తూ.

అతను పదే పదే ఆరిఫ్ పేరు చెప్పేసరికి కాదనలేకపోయాడు.

''సర్లేండి.. అన్నీ కుదిరేక మీకు ఫోన్ చేస్తాను.. మీ విజిటింగ్ కార్డు ఇచ్చి వెళ్ళండి'' అన్నాడు డాక్టర్. మన్విత్‌సింగ్ వెళ్లిపోయాక ఏదో అనుమానం వచ్చింది.. విజిటింగ్ కార్డులోని నెంబర్లకు ఫోన్ చేశాడు.. ఒక్కటీ కరెక్టు కాదు.

జలంధర్‌లో విజిటింగ్ కార్డులో వున్న ఇండస్ట్రీ లేనే లేదని తేలింది.. ఒక నెంబరు కర్నూలులో వున్న చెప్పుల షాపుది.. మరో నెంబర్ జలంధర్‌కు చెందినదేగాని అది పోలీస్ స్టేషన్‌ది.

⁂

- ఇంకా ఉంది

నేర్చుకుందాం



శ్రీ నరసింహ శతకములోని పద్యము

సీ. నీల మేఘ శ్యామ నీవె తండ్రివి మాకు
కమలవాసిని మమ్ము కన్నతల్లి
నీ భక్తవరులంత నిజమైన బాంధవుల్
నీకటాక్షము మా కనేక ధనము
నీ కీర్తనల్ మాకు లోక ప్రపంచంబు
నీ సహాయము మాకు నిత్యసుఖము
నీ మంత్రమే మాకు నిష్కలంకపు విద్య
నీ పదధ్యానంబు నిత్య జపము

తే. తోయజాతాక్ష! నీ పాద తులసిదళము
భోగముల కౌషధము బ్రహ్మ రుద్ర వినుత!
భూషణ వికాస! శ్రీధర్మ పురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురిత దూర!

భావం: ఓ నరసింహస్వామి మాకు తండ్రివి నీవే. లక్ష్మీదేవి యే మా కన్నతల్లి. నీ భక్తులే మా బంధువులు. నీ దయయే మా సొమ్ము. నీ పాటలే మాలోకం, నీ నామజపమే మా విద్య నీ పాద ధ్యానమే నిత్య జపం నీ పాదాల మీద పూజ చేసిన తులసీదళం రోగాలన్నింటిని రూపుమాపే మందు బ్రహ్మ రుద్రులచే పొగడబడుతున్న ఓ స్వామీ నీ వే మాకు అన్నియూ అని శతకకారుడు చెబుతున్నాడు.

మాటాట : 1540

నిర్వహణ: సుధామ

1			■	2		■
	■	■	3		■	4
5	6		■	7	8	
■		■	9	■		■
10	■	■		■	■	11
	■	12			■	
13			■	■	14	

ఆధారాలు

అడ్డం:
1. ఒజ్జ
2. మట్టి
3. దుర్గతి, నరకము
5. తాళము
7. ఉప్పు
12. పరాక్రమ వంతుడు
13. వేషం కట్టిన పాత్రధారి
14. సుఖము

నిలువు:
1. రోజా
2. మృదంగము
4. కురుపు
6. నడక
8. అసలుపై వసూలు చేసేది
9. వాసస్థానము
10. కోరిక
11. పుప్పొడి
12. పట్టణము, విడిచిపెట్టు ఇతగాడు

మాటాట - 1539 సమాధానం

■	■	1గా	య	2కు	డు	■
3కు	డి	■	■	లా	■	4ప
లా	■	5వి	ది	య	■	రి
6సా	ధ	న	■	7ము	రి	కి
■	■	8తి	క్క	■	■	ణి
9జం	■	■	■	10మం	■	■
11కు	రు	డి	■	12కు	రం	గి

మంచిమాట



ఆశామోహాలు

శ్వాసలేని మనిషి లేనట్లే ఆశ లేని మనిషి కూడా లేడు. మానవుడు సర్వ సహజంగా ఆశాజీవి. అతని ఆశ అనంతమైన ఆకాశమంత విశాలం- అంతులేని సాగర గర్భమంత అగాధం. అగ్నికి ఆజ్యం తోడైనట్లు ఈ ఆశకు మోహం తోడైతే మానవుని దుశ్చర్యలకు దుర్మార్గాలకూ అంతమే వుండదు.

ఈ ఆశా మోహములే మానవుని ఆధ్యాత్మిక సాధనకు ఆటంక ప్రాయమవుతుంటాయి. ప్రకృతిలో వున్న మరే జీవికీ లేని ఈ మాయరోగం ఒక్క మానవునికే ఉన్నట్లు గమనించవచ్చు. సృష్టిలోని ప్రతి జీవి కూడా తన కవసరమైనంత మేరకే ఆశిస్తుంది. అందులోనే సంతృప్తి స్వర్గాన్ని పొందుతుంది. ఉదాహరణకు ఒక నదిలో నీళ్ళు తాగే లేడిపిల్ల- తన పొట్టకు ఎన్ని నీళ్ళు కావాలో అన్నే తాగుతుంది.

అలాగే పక్షులు కూడా చెట్టుకొమ్మలపై అతి చిన్న స్థలం తమకు అవసరమైనంతవరకే తమ గూటిని నిర్మించుకొని హాయిగా ఆనందంగా జీవిస్తాయి. ఇలా ఏ జీవిని పరిశీలించినా 'ఆశ'లేని ఆనందమయ జీవితాన్ని పొందుతున్నాయి.

కానీ ఒక్క మానవుడు మాత్రం అందుకు భిన్నంగా ఆశామోహముల బారినపడి అనేకానేక పాపకర్మలకు పూనుకొంటున్నాడు. 'ఆశ' మానవుణ్ణి మూడు విధాలుగా బాధిస్తుండటం గమనార్హం. అత్యాశ, దురాశ, నిరాశ అనే మూడు విధాల వర్గీకరణలో రకరకాలుగా ప్రేరణ పొందిన మానవుడు తన దుఃఖానికి తానే బాధ్యుడవుతున్నాడు. ఒక సినీ కవి వేదాంత ధోరణిలో చెప్పినట్లు- ఆశామోహముల దరి రానీకోయి- అందులకే నీ సుఖమూ అంకితమోయి- మానవుడు తన సుఖాన్ని వదలుకుని దుఃఖ సాగరంలో మునిగిపోవటానికి మూలకారాణాలైన ఆశా మోహములకు ఎంత దూరమైతే అంత మంచిది.

ఆశ మనిషిని మనశ్శాంతికి దూరం చేస్తుంది. మోహం కోరికలకు ఆలంబనయై- గౌతమ బుద్ధుడు చెప్పినట్లు సర్వ దుఃఖములకు మూలహేతువు అవుతున్నది. ఇంక దురాశ వున్నది చాలదన్న చింతకు దారిచూపుతూ అన్ని దురాగతాలకూ కారణభూతమవుతున్నది. కానీ ఈ సందర్భంగా మనం ఓ అంధుని కథ మననం చేసుకోవాలి. తనకో కన్ను లేదని ఏడిస్తే ఒకటే కనిపించదు- అదే ఇంకొకడికి రెండు కళ్ళూ వున్నాయని ఏడిస్తే ఆ అంధునికి రెండు కళ్ళు కూడా కన్పించవు. కనుక దురాశ ఎప్పుడూ దుఃఖానికి చేటు. అసంతృప్తికి నిలయం.

జీవితానందానికి మనిషిని శాశ్వతంగా దూరం చేసే ఈ దురాశ- మళ్లీ నిరాశకు ప్రాణం పోస్తుంది. నిరాశతో మనిషి జీవితం నిశీధిమయమై ఆవేదనకు గురి అవుతుంది. ఆలోచనారహితమవుతుంది. ఆత్మార్పణకు దారి చూపుతుంది. అందుకనే ఆశను ఏ రూపేణా ఆశ్రయించని మానవుని జీవితమే సుఖవంతమూ- ఫలవంతమూ అవుతాయి.

మోహమనేది మాయ. ఆ జగన్మాయలో పడిన మానవ జీవితం ఆధ్యాత్మిక చింతనకు- చిత్తశుద్ధికి సుదూరమై- శాంతి సౌఖ్యాలు కోల్పోతుంది. శతకారుడు సెలవిచ్చినట్లు 'చిత్తశుద్ధి లేని శివపూజలేలయా' అన్నమాట అక్షరాల నిజమై రుజువవుతుంది. పురాణేతిహాసకాలంలో అసురులంతా ఈ ఆశా మోహముల మయాలో పడి - తమ వినాశనానికి తామే కారకులయ్యారు. వారెంతటి భక్తాగ్రేసరులైనా - అహంకార దర్పాలతో విర్రవీగి మారణకాండను సృష్టించినందువలనే ఆ స్థితి కలిగింది.

అసలే కలియుగం. అధర్మం మూడుపాదాలమీద నడుస్తుంటుంది. ధర్మాచరణ చేద్దామని మనసులో అనుకొన్నా దానికి ఎన్నో ఆటంకాలు ఏర్పడుతుంటాయి. వాటిని ఎదుర్కొని ముందుకు వెళ్లడం గగనకుసుమంగా ఉంటుంది. కనుక కలియుగంలో ఆశామోహాలకు తావివ్వకుండా ధర్మాచరణను చేయడం అంటే నియమనిష్ఠలతో యజ్ఞం చేయడం వంటిది. కలియుగంలో ధర్మాచరణలో కృతకృత్యులు కావాలంటే కేవలం భగవంతుని నామాన్ని ఉచ్చరిస్తూ ఉండాలి. ప్రహ్లాదుని ఆదర్శంగా తీసుకొని నిరంతరం భగవంతుని నామాన్ని జపిస్తుంటే అపుడు దురాశ అనే రక్కసి మన చెంతకు రాదు వ్యామోహపడకుండానే అనుకొన్న దాన్ని సాధిస్తాం. మనం ఆ నిజాన్ని గ్రహించి ఆశా వ్యామోహాల మాయలో పడకుండా శాంతి సౌఖ్యాలను స్వాగతిద్దాం- సర్వజన శ్రేయస్సును కోరుకుందాం! భగవంతుని చింతనే మనలను సదా కాపాడుతుంది.

- మరువాడ భానుమూర్తి

యాజ్ఞసేని



- త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యము 14

మగధ సామ్రాజ్యానికి సార్వభౌముడు 'జరాసంధుడు'.

జరాసంధుడు వృద్ధక్షత్రుడి కుమారుడు.

ఒక ముని యొక్క వరంతో వృద్ధక్షత్రుడి ఇద్దరి భార్యలకు ఒక్కొక్కరికి శరీరంలోని సగ భాగంతో ఒక కుమారుడు జన్మించగా వారు భయపడి ఆ రెండు



అర్థశరీర భాగాలను కోట ఆవలగల చదుకం వద్ద పారవేయిస్తారు. ఆ ప్రాంతంలో సంచరిస్తూ యుండే 'జర' అనే ఒక రాక్షసి ఆ వికృత శరీర భాగాలను మాంసఖండాలని భావించి భుజింపనెంచి వాటిని ఒకటిగా పట్టుకొనగా అవి ఒక బాలుడుగా మారి పెద్దగా ఏడుస్తాడు. ఆ ఏడుపును విన్న దాసీజనం, రాజపరివారం రాజు అక్కడికి వస్తారు. ఆ జర రాక్షసి ఒక అందమైన స్త్రీగా మారి ఆ పిల్లవాడిని రాజుకు అప్పగించి జరిగిన విషయాన్ని వివరిస్తుంది.

'జర' అనే ఆ రాక్షసిచే సంధింపబడినవాడు కాబట్టి ఆ బాలుడికి 'జరాసంధుడు' అనే పేరు పెట్టాడు రాజు.

జరాసంధుడు మహాబలవంతుడు. ఎందరో రాజులను పట్టి బంధించి వారిని కారాగృహంలో ఉంచుతాడు. రోజుకు ఒక్కడిని దేవికి బలిగా ఇస్తుంటాడు.

ఆ జరాసంధునికి ఛేదిదేశపు రాజైన శిశుపాలుడు సేనాపతిగా ఉంటాడు. శిశుపాలుడు శ్రీకృష్ణ బలరాములకు మేనత్త కొడుకు (సాత్త్వతిదమఘోషుల కుమారుడు).

జరాసంధునికి యిద్దరు కుమార్తెలు 'అస్తి, ప్రాప్తి' అనువారు. ఆ ఇద్దరు కుమార్తెలను జరాసంధుడు మధురానగరాధిపతి అయిన 'కంసుని'కి ఇచ్చి వివాహం చేస్తాడు.

శ్రీకృష్ణుడు మేనమామ అయిన కంసుని సంహరిస్తాడు. తన అల్లుడిని సంహరించాడని పగబూనిన జరాసంధుడు శ్రీకృష్ణునిపైకి పదునెనిమిది పర్యాయాలు దండెత్తిపోతాడు.

శ్రీకృష్ణుడు అతడి బారినుండి ప్రజలను రక్షింపనెంచి మధురను వదలి కుశస్థలం అనే ప్రదేశం వద్దకు పశ్చిమ సముద్రంలో రైవతికాద్రిపై ఒక కోటను నిర్మింపచేయించుకుంటాడు. యదువృష్ణి కుకుర భోజకాంధకులనందరినీ అక్కడికి తరలించి అక్కడే నివాసముంటాడు. జరాసంధుని తరచు దాడులనుండి తప్పించుకుంటాడు.

జరాసంధునికి మహాబలవంతులు, మాయాయుద్ధ నిపుణులు అయిన ఇద్దరు మిత్రులు హింసడిభకులు (కౌశిక చిత్రసేనులు) అనేవారు ఆప్తులు. జరాసంధునికి ఎల్లప్పుడూ కుడి ఎడమ భుజాలుగా ఉంటారు.

శ్రీకృష్ణుడు హింసడిభకులనిద్దరినీ ఉపాయంతో మట్టుబెట్టిస్తాడు. జరాసంధునికి పెద్ద దెబ్బ తగులుతుంది.

అంతేగాక పడమటి దేశపు రాజు ప్రాగ్జ్యోషితపురాధిపతి (నరకాసురుని కొడుకు) అయిన భగదత్తుడు, అంగ, వంగ, పుండ్రరాజులు, కిరాతరాజుల్లో పౌండ్రవాసుదేవుడు, తూర్పు దక్షిణ రాజులైన కరూశుడు, కలభుడు, నకులుడు, సంకర్షణుడు, సూపహితుడు, మనోదత్తుడు, చక్రుడు, సాల్వేయుడు, యవనులు జరాసంధునికి భయపడి అతడిని సేవిస్తూండేవారు.

ఉత్తర దిక్కున ఉన్న పదునెనిమిది రాజవంశీయులవారు కూడా జరాసంధునికి భయపడి ఉండేవారు.

అయితే హస్తినాపురం మీదకు రావటానికి జరాసంధుడు ప్రయత్నించలేదు. అతడికి కొంత భయము కూడా వున్నది. కారణం అక్కడ జయింపశక్యం గాని మహావీరుడైన భీష్మపితామహుడు, అస్త్రగురువులైన ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు ఉన్నారనీ, వారిని జయింప అవశ్యమనీ, వారితో వైరం మంచిదిగాదని తలంచటమే.

అలాంటి బలలవంతుడైన జరాసంధుడు స్వయంవరానికి వచ్చి ఎలాంటి సమస్యలను తెచ్చి పెడతాడోనని ద్రుపదునికి భయం పట్టుకుంది. ద్రౌపదిని తన మనుమడైన మేఘనందికి భార్యగా చేయమని కబురు కూడా పంపాడు.

ద్రుపదుడికి కురు రాజ్యంతో తలపడే ధైర్యం కూడా లేదు. ఇదివరలో ద్రోణుడి చేతిలో పరాభవింపబడినాడు కావున రాగల ఆపదలను గురించి పసిగట్టి ముందుగానే తగు జాగ్రత్తలను తీసుకొనవలసిన ఆవశ్యకత పెరిగింది. అట్టి పరిస్థితులలో శ్రీకృష్ణవాసుదేవుని సహాయం అర్థిస్తే అటు కురు రాజ్యంతోనూ, ఇటు జరాసంధునితో కూడా ఎట్టి ప్రమాదం ఉండకపోవచ్చుని తలంచి, దృష్టద్యుమ్నుని గురుదేవులు సాందీపాని ద్వారా శ్రీకృష్ణుని ప్రార్థించి అతడిని తోడ్కొని రమ్మని పంపుతాడు. దృష్టద్యుమ్నుడు శ్రీకృష్ణవాసుదేవుని దర్శించి తన తండ్రి ప్రార్థన మన్నించి కాంపిల్యానికి రావలసినదిగా కోరుతాడు. అందులకు శ్రీకృష్ణుడు అంగీకరిస్తాడు.

శ్రీకృష్ణుడు సాత్యకిని వెంట నిడుకొని కాంపిల్యానికి వస్తాడు.

ద్రుపద మహారాజు సంతోషంతో ఎదురేగి శ్రీకృష్ణునికి స్వాగతం పలుకుతాడు. చేయవలసిన మర్యాదలు చేస్తాడు

- ఇంకా ఉంది

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
ఆకస్మిక ధనలాభముంది. రాజకీయ రంగంలోనివారికి, క్రీడాకారులకు అద్భుతమైన అవకాశాలు లభించును. అన్నింటా విజయాన్నే సాధిస్తారు.
- **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. భయాందోళనలు దూరమవుతాయి. ఋణప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబంలో మనశ్శాంతి లోపిస్తుంది.
- **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
వృత్తి ఉద్యోగ రంగాల్లో స్థానచలన సూచనలున్నవి. ఆర్థిక పరిస్థితిలో మార్పులుంటాయి. ఋణప్రయత్నాలు చేస్తారు. ఆత్మీయుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది.
- **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
నూతన వస్తు, వస్త్ర, ఆభరణాలు పొందుతారు. ఆకస్మిక ధనలాభముంటుంది. విద్యార్థుల ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. వినోదాల్లో పాల్గొంటారు. చర్చలు సదస్సులు మిమ్మల్ని ఆకర్షిస్తాయి.
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
అనారోగ్య బాధలు తొలగుటకు డబ్బు ఎక్కువ ఖర్చు చేస్తారు. తీర్థయాత్రకు ప్రయత్నిస్తారు. దైవదర్శనం ఉంటుంది. స్త్రీలు మనోల్లాసాన్ని పొందుతారు.
- **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
ప్రయత్న కార్యాలన్ని వెంటనే ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభమేర్పడుతుంది. సంపూర్ణ ఆరోగ్యంగా వుంటారు. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. కుటుంబ సౌఖ్యం లభిస్తుంది.
- **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
కుటుంబమంతా సంతోషంగా నుంటారు.అనుకొన్న పనులన్నీ పూర్తిచేసకుంటారు. సంపూర్ణ ఆరోగ్యమేర్పడుతుంది. స్థిరనివాసముంటుంది.
- **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
ఆర్థిక ఇబ్బందులుండవు. నూతన వస్తు, ఆభరణాలను ఖరీదు చేస్తారు. స్నేహితులను కలుస్తారు. ఇతరులకు మంచి సలహాలు, సూచనలిస్తారు. సంఘంలో గౌరవం పెరుగుతుంది.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
కళాకారులకు, మీడియా రంగాలవారికి మంచి అవకాశాలు లభిస్తాయి. దేహాలంకరణకు ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా వుంటుంది. బంధు, మిత్రులను కలుస్తారు.
- **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
ఋణప్రయత్నాలు ఫలించును. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. స్త్రీలకు స్వల్ప అనారోగ్య బాధలుండును.
- **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
నూతన గృహ కార్యాలపై శ్రద్ధ వహిస్తారు. ఆకస్మిక ధనలాభంతో ఆనందిస్తారు. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు.
- **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
శుభవార్తలు వింటారు. బంధు, మిత్రులతో కలిసి విందులు వినోదాల్లో పాల్గొంటారు. ఆకస్మిక ధనలాభాన్ని పొందుతారు.

రచనలు పంపవలసిన చిరునామా: ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక,
36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

ఆధార్‌తో లాభమేనా?

ఆధార్ అనేది 12 అంకెల విశిష్ట సంఖ్య. ఈ విశిష్ట సంఖ్యను తెలిపే పత్రమే ఆధార్ కార్డు. దేశంలో ఎక్కడ ఉన్నా ఆధార్ విశిష్ట సంఖ్య ద్వారా ప్రతి వ్యక్తి పూర్వోత్తరాలను గ్రహించడమేగాక, వర్తమాన కార్యకలాపాలను గుర్తించగలిగేలా ప్రభుత్వం సమాచార శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. టెలిఫోన్ నెంబర్, బ్యాంకు అకౌంట్లు, ప్యాన్ కార్డు, ఎన్నికల కార్డు, చిరునామా, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు ఆసరాగా ప్రతి వ్యక్తి కార్యకలాపాలను మానిటర్ చేసే వ్యవస్థ నేడు భారత్‌కు దక్కింది. భారతదేశ జనాభా నేటి గణాంకాల ప్రకారం 129 కోట్ల 4 లక్షల 34వేల 056, కాని దేశంలో 105 కోట్ల ఆధార్ కార్డులను జారీ చేశారు. హిందువులు 80.5 శాతం, ముస్లింలు 13.4 శాతం, క్రైస్తువులు 2.3 శాతం, సిక్కులు 1.9 శాతం, ఇతరులు 1.9 శాతం మందికి ఆధార్‌లు అందాయి. ఇంకా దాదాపు 24 కోట్ల మందికి ఆధార్ కార్డులు అందాల్సి ఉంది. బ్యాంకు ఖాతా తెరవాలన్నా, నగదు బదిలీ చేయాలన్నా, స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేయాలన్నా, ప్రవేశపరీక్షకు దరఖాస్తు పెట్టాలన్నా, బీమా పాలసీ తీసుకోవాలన్నా, పాస్‌పోర్టు పొందాలన్నా, గ్యాస్ కనెక్షన్ తీసుకోవాలన్నా, చివరికి విమాన టిక్కెట్ కొనుగోలు చేయాలన్నా ఆధార్ విశిష్ట సంఖ్యను ఇవ్వాల్సి వస్తోంది. రానున్న రోజుల్లో ప్రతి కార్యక్రమానికి ఆధార్‌ను తప్పనిసరి చేసినా ఆశ్చర్యం లేదు. ప్రస్తుతం ఉన్న బ్యాంకు ఖాతాలకు, టెలిఫోన్లకు, డిపాజిట్లకు, ఇతర కీలక అంశాలకు ఆధార్‌ను అనుసంధానం చేసే గడువు మార్చి 31తో ముగియనుంది. తర్వాత అనుసంధానం కాని బ్యాంకు ఖాతాల్లోని నిధులు ఎస్క్రో ఖాతాలకు వెళ్లే ముప్పు లేకపోలేదు. ప్రభుత్వం చెప్పే లెక్కలు ఎలా ఉన్నా ఆధార్ కార్డులు జారీ అయినా చేతికి అందని వారు, ఆధార్ కార్డులో పొరపాట్లు పడి ఇబ్బందులు పడుతున్న వారు, సమాచారంలో దోషాలు, గతంలో ఆధార్ కార్డుకు ఇచ్చిన రిజిస్టర్డు టెలిఫోన్ నెంబర్లు లేక ఇబ్బందులు పడుతున్న వారు లెక్కలేనంత మంది. ఆధార్ బయోమెట్రిక్‌లోనూ లోపాలు ఉన్నాయని మరికొంత మంది ఫిర్యాదు చేస్తున్నారు. ప్రతి వ్యక్తి తన జీవితానికి సంబంధించి అన్ని రకాల వివరాలను ఆధార్‌తో అనుసంధానమయ్యే రోజు కూడా దగ్గరలోనే ఉంది. ఈ కారణం చేతనే ఆధార్ కార్డు అతి ముఖ్యమైనదిగా మారింది.

ఆధార్ డాటా లీక్ అవుతుందా?

ఆధార్ డాటా లీక్ అవుతుందనేది అపోహ మాత్రమే. ఆధార్ డాటాకు రెండంచెల భద్రతా వ్యవస్థ ఉంది. వర్చ్యువల్ ఐడి ద్వారా ప్రతిసారీ ధృవీకరణకు ఆధార్ నెంబర్‌ను షేర్ చేసే అవసరం ఉండదు. 16 డిజిట్లతో ఉండే వర్చ్యువల్ ఐడి ర్యాండమ్‌గా జనరేట్ అవుతుంది. ఆధార్ నంబర్‌కు బదులు ధృవీకరణకు ఈ కొత్త ర్యాండమ్ ఐడీని వాడుకోవచ్చు.

వ్యక్తులను మార్చే వీలులేదు

ప్రతి వ్యక్తి కళ్లను ఐరిష్ పద్ధతిలో స్కాన్ చేయడంతో పాటు పది చేతి వేళ్ల ముద్రలను సేకరించాలని యుఐడిఎఐ సంస్థ నిర్ణయించింది. దాని వల్ల ఒకరి డాటా మరొకరు పొందేందుకు లేదా మార్చేందుకు ఎలాంటి అవకాశం లేదు. రానున్న రోజుల్లో ఆధార్ సంఖ్యను 16 అంకెలకు పొడిగించే యోచన ఉంది.

ఆధార్‌లో తప్పులుంటే...

ప్రభుత్వ పథకాలు అన్నింటికీ ఆధార్ కార్డును అనుసంధానం చేశారు. అయితే అందులో ముద్రణ సమయంలో తప్పులు దొర్లడం సహజం. చాలా మందికి తమ పేరు, పుట్టిన తేదీ సరిగా పడకపోతే దానికోసం ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం కూడా లేదు. ఇంటర్ నెట్ సదుపాయం ఉంటే ఇంట్లో కూర్చుని వాటిని మార్చుకోవచ్చు.

https://ssup.uidai.gov.in/web/guest/update అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆధార్ నెంబర్‌ను ఎంటర్ చేసిన తర్వాత కింద నల్లటి అక్షరాల్లో కనిపిస్తున్న వెరిఫికేషన్ కోడ్ టైప్ చేయాలి. సెండ్ బటన్ క్లిక్ చేస్తే మొబైల్ నెంబర్‌కు ఒటిపి వస్తుంది. ఆ ప్రాసెస్ చేసినపుడు మొబైల్ పక్కనే ఉండాలి. ఎడిట్ పేజీకి వెళ్లి సూచన మేరకు వివరాలను అప్‌డేట్ చేయాలి.

కొత్త ఆధార్ కార్డు కోసం

కొత్త ఆధార్ కార్డు కోసం https://eaadhaar.uidai.gov.in/ అనే సైట్ ఓపెన్ చేయాలి. ఎన్‌రోల్‌మెంట్ నెంబర్ లేదా ఆధార్ నెంబర్ సెలెక్టు చేసుకుని కింద ఉండే కాలమ్‌లో ఎంటర్ చేయాలి. పూర్తిపేరు, పిన్‌కోడ్ తర్వాత కాలమ్ కింద కనిపించే అక్షరాలు, మొబైల్ నెంబర్ నమోదు చేయాలి. గెట్ వన్ టైమ్ పాస్‌వర్డు క్లిక్ చేస్తే మొబైల్‌కు ఎస్‌ఎంఎస్ ద్వారా పాస్‌వర్డు వస్తుంది. దానిని ఎంటర్ చేయగానే పీడీఎఫ్ రూపంలో ఆధార్ కార్డు డౌన్‌లోడ్ అవుతుంది.

రిజిస్టర్ మొబైల్ నెంబర్ లేకపోతే

ఆధార్ కార్డులోని తప్పులను సవరించేందుకు ఆధార్ వెబ్‌సైట్లో నమోదైన మొబైల్ నెంబరే ప్రధాన ఆధారం. అది ప్రస్తుతం వాడటం లేదంటే ఆన్‌లైన్ ఆధార్ అప్‌డేట్ కుదరదు. ఎందుకంటే ఆ మొబైల్‌కు ఒటిపి వస్తుంది. దాని ద్వారానే మార్పులు చేయడం సాధ్యపడుతుంది. ఒక వేళ కార్డు తీసుకునే సమయంలో ఇచ్చిన నంబర్ మారిపోయి ఉంటే దగ్గర్లోని ఆధార్ నమోదు కేంద్రానికి వెళ్లి మొబైల్ నెంబర్‌ను మార్చుకునేందుకు దరఖాస్తు చేయాలి. అలా వీలు కాని వారు పోస్టు ద్వారా యుఐడిఎఐ, పోస్టు బాక్స్ -99, బంజారా హిల్స్, హైదరాబాద్- 500034 చిరుమానాకు తమ దరఖాస్తు ఫారం పంపించాలి.

ఆధార్ ఎందుకు?

వృత్తి, వ్యాపారం రీత్యా ఇల్లు మారుతున్న వారికి ఆధార్ శాశ్వత నివాస గుర్తింపును ఇస్తుంది. 2006లో కేంద్రం ప్రత్యేక సంస్థను స్థాపించి ఆధార్ గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ప్రారంభించింది. పాన్‌కార్డు, ఇన్‌కంటాక్స్ రిటర్నులు, సంక్షేమ పథకాలకు ఆధార్‌ను తప్పనిసరి చేశారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర, బ్యాంకు ,బీమా, పన్నుల సేవలతో పాటు రాయితీలు, లబ్ధి, పించన్లు, ఉపకార వేతనాలు, సామాజిక , పథకాల లబ్ధి, విద్య, ఉద్యోగం, ఆరోగ్యరక్షణ తదితర అంశాలకు ఆధార్ అనుసంధానం చేయడం వల్ల ఆధార్ సమాచారం సిఐడిఆర్‌లో అత్యంత ఖచ్చితంగా అధునాతనంగా ఉండటం తప్పనిసరి. జన సంఖ్యా సంబంధ నవీకరణకు కూడా ఇది అవసరం కావచ్చు. జీవితంలో జరిగే సహజ మార్పులు, వివాహం కావడం మూలంగా నివాసులు తమ పేరు, చిరునామా మార్చుకోవల్సిన అవసరం రావచ్చు.

ఆధార్‌తో చాలా లాభాలు

ఆధార్ విశిష్ట సంఖ్య ఉండటం వల్ల కొన్ని పనులు చాలా తేలిక అయిపోతాయి. మన డాటాను వెరిఫై చేయడం క్షణాల్లో పూర్తవుతుంది. పాస్‌పోర్టు దరఖాస్తు సమయంలో ఆధార్ నెంబర్‌తో వెరిఫై చేసుకోవచ్చు. అలాగే సెల్‌ఫోన్‌కు కొత్త సిమ్ తీసుకోవాలంటే ఆధార్ తప్పనిసరి. ల్యాండ్ లైన్ తీసుకోవాలన్నా ఆధార్ ఇవ్వాల్సిందే. రేషన్ పొందేందుకు పౌర సరఫరాల విభాగానికి ఆధార్ సమర్పించాల్సిందే. మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు జరుగుతుందో లేదో తెలుసుకునేందుకు ప్రభుత్వం ఆధార్‌ను తప్పనిసరి చేసింది. ఆధార్ కార్డును ఆదాయపన్ను విభాగంలోని పాన్‌తో అనుసంధానం చేస్తున్నారు. ఇలా అనుసంధానం చేసిన వారు ఐటిఆర్‌ను ప్రింట్ తీసి పంపించాల్సిన అవసరం లేదని కూడా ఆదాయ పన్నుశాఖ ప్రకటించింది. బ్యాంకింగ్ ఖాతాకు , ఖాతాలోని చిరునామా మార్పునకు, ఆధార్ ఉపయోగపడుతుంది. ఆధార్ ఉంటే చాలు ఇక ఏ ఇతర గుర్తింపు పత్రాలు అవసరం లేదు. డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ పెన్షనర్లు బ్యాంకులో ఆధార్ నెంబర్ ఇస్తే వారి ప్రక్రియ మరింత సులువు అవుతుంది. మ్యూచువల్ ఫండ్స్ యుఐడిఎఐ జారీ చేసిన ఆధార్ లెటర్, ఈ ఆధార్‌ను ప్రామాణికంగా అంగీకరించాలని సెబి, ఐఆర్‌డిఎలు నిర్ణయించాయి. నెలవారీ పించన్లకు కూడా ఆధార్‌ను తప్పనిసరి చేశారు. ప్రావిడెంట్ ఫండ్ ఈపీఎఫ్ ఖాతా నుండి డబ్బు ఉపసంహరించుకోవాలంటే ఆధార్ కావాలి. అలాగే డిజిటల్ లాకర్ ద్వారా సర్టిఫికేట్లను ఆన్‌లైన్‌లో భద్రపరుచుకోవాలన్నా, వర్చ్యువల్ ఆధార్ నెంబర్ కావాలన్నా ఆధార్ అవసరమే.

డేటా దుర్వినియోగం కారాదు



దేశంలో ప్రతి పౌరునికి ఒక గుర్తింపు కార్డులా ఆధార్ కార్డు ఉపయోగపడుతుంది. ఇతర దేశాల్లో సామాజిక భద్రత కార్డు మాదిరిగా ఇక్కడ ఆధార్‌కార్డు వల్ల ప్రజలు ప్రయోజనం పొందుతున్నారు. ఆధార్ అన్నదీ ప్రతి ఒక్కరికి చాలా అవసరం. అయితే డేటా దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. తప్పుడు వ్యక్తుల చేతుల్లో ఆధార్ డేటా పడితే వారి వ్యక్తిగత సమాచారం బహిర్గతమయ్యే ప్రమాదం ఉంది. సాధారణంగా ప్రభుత్వ వ్యవస్థలో కూడా 5శాతం మంది దుర్వినియోగానికి పాల్పడటం అనేక సందర్భాల్లో రుజువైంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరికి వ్యక్తిగత స్వేచ్ఛ ఉంది. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలగకుండా ఉండాలి. ఆధార్ కార్డు డేటాతో దుర్వినియోగానికి పాల్పడితే అతని వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం వాటిల్లినట్టే లెక్క. ఆధార్ కార్డులో డేటాను సక్రమంగా పొందుపరచాల్సి ఉంది. అందులో తప్పులు దొర్లితే దానివల్ల అనర్హులు అర్హులుగా మారే ప్రమాదం ఉంది. ఆధార్‌ను ఆదాయ పన్ను శాఖకు అనుసంధానం చేస్తే తప్పులేదు. దానివల్ల పన్ను ఎగవేత లేకుండా సక్రమంగా పన్ను వసూలు చేసే వీలుంటుంది. అదేవిధంగా మొబైల్ సెల్‌ఫోన్లకు ఆధార్ కార్డు అనుసంధానం చేయమంటున్నారు. దీనివల్ల కూడా ప్రభుత్వానికి కొన్ని ఉగ్రవాద శక్తులను గుర్తించే అవకాశం ఉంటుంది. ఇపుడు సాధారణంగా అనేక కేసుల్లో నేరస్థులను సెల్‌ఫోన్ ఆధారంగా గుర్తించగలుగుతున్నారు. కాగా, ఇటీవల ఆధార్ కార్డును అన్నింటికీ అనుసంధానం చేస్తే ప్రమాదమని సూచించింది. ఆధార్ వల్ల లాభాలు ఉన్నాయి, మరోపక్క నష్టాలూ ఉన్నాయి. ఇటీవలి కాలంలో ఆధార్ కార్డులో వయస్సు తికమకగా పడటంవల్ల అనర్హులు పించన్లు అందుకుంటుండగా, అర్హులు పించన్లకు దూరమయ్యారు. ఇటువంటి వాటిని ప్రభుత్వం సరిదిద్దాల్సి ఉంది. అన్ని వర్గాల వారికి ప్రయోజనం కలిగేలా ఆధార్ కార్డును ఉపయోగించగలిగితే అందరికీ మేలు జరుగుతుంది. ఇక ఎన్నికల సమయంలో సర్వే పేరుతో ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చిస్తోంది. ఆధార్ కార్డుతో ఎన్నికలు నిర్వహించగలిగితే ఆ దుబారా వ్యయాన్ని నియంత్రించవచ్చు.

- ప్రొఫెసర్ జిఎస్‌ఎన్ రాజు
వైస్ ఛాన్సలర్, సెంచూరియన్ వర్శిటీ.

ఆధార్ ఉండాల్సిందే!



స్వాతంత్ర్యానంతరం దేశంలో తొలిసారిగా తెరపైకి వచ్చిన 'ఆధార్'ను కొందరు తమ ప్రయోజనాల కోసం వ్యతిరేకిస్తున్నారు. వాస్తవానికి వారి వాదన అర్థరహితం. సత్ప్రవర్తన కలిగిన వారెవరూ దీనికి భయపడాల్సిన అవసరం లేదు. నేను అనునిత్యం గ్రామీణ ప్రజానీకంతో మమేకమై ఉంటున్న వ్యక్తిని. గ్రామాల్లో దీన్ని ఏఒక్కరూ వ్యతిరేకించడం లేదు. అయితే సాంకేతిక లోపాలతో అక్కడక్కడా ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించడంతో పాటు ప్రతి వ్యక్తి సంపూర్ణ డేటాను కూడా ఆధార్‌లో సంక్షిప్తం చేస్తే ఏదైనా నేరం జరిగినప్పుడు సంబంధిత వ్యక్తుల పూర్తి సమాచారాన్ని క్షణాల్లో రాబట్టే అవకాశం ఉంటుంది. అలాగే ఏదైనా కీలక బాధ్యతను అప్పగించే సమయంలో ముందుగా అతని వ్యక్తిగత సమాచారాన్ని తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఆధార్ కారణంగా ఒక్క కృష్ణా జిల్లాలోనే కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఆదా చేసే అవకాశం లభించింది. చౌకడిపోల్లో ఆధార్‌తో గడచిన రెండేళ్లలో దేశంలోనే తొలిసారి పెద్దమొత్తంలో 170 కోట్ల రూపాయల ప్రభుత్వ సబ్సిడీని అక్రమార్కుల పాలు కాకుండా కాపాడగలిగారు. ప్రస్తుత ఖరీఫ్‌లో 60వేల మెట్రిక్ టన్నుల సబ్సిడీ ఎరువులను ఆదా చేయగలిగారు. ప్రతి ఏటా సొసైటీల ద్వారా 2లక్షల 70వేల మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు జరిగితే ఆధార్ కారణంగా ఈ ఏడాది కేవలం 2లక్షల 10వేల మెట్రిక్ టన్నుల అమ్మకాలే జరిగాయి. ఇలా ఆధార్ కార్డుల వల్ల అనేక విధాలుగా సత్ఫలితాలు కనిపిస్తున్నాయి.

- యలమంచిలి బాబూరాజేంద్రప్రసాద్
ఎమ్మెల్సీ, కృష్ణా జిల్లా

లోపాలను సవరించాలి



ఒక మంచి సదుద్దేశ్యంతో లోగడ కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వం 'ఆధార్' కార్డు తీసుకుని వచ్చింది. ప్రజలందరికీ ఈ 'ఆధార్' కార్డు భారతీయులనే నిర్ధారణకు ఉపయోగపడుతుంది. ఈ కార్డుతో ఎంతో మేలు జరుగుతుంది. అయితే ఇంకా అందరికీ 'ఆధార్' అందడం లేదు. ముఖ్యంగా నిరక్షరాస్యులు, గూడు లేని వారికి, సంచారం చేసే వారికీ 'ఆధార్' అందలేదు. వారి గురించి కేంద్రం ఆలోచన చేయలేదు. వారికి ఈ కార్డు ఎలా తీసుకోవాలో తెలియదు, చిరునామా ఏదీ ఇవ్వడానికీ ఆస్కారమే లేదు. ఈ సమస్యను అధిగమించి వారికీ 'ఆధార్'తో గుర్తింపునివ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. దీనిపై దృష్టి సారించకుండా, వ్యక్తుల 'గుట్టు'ను బట్టబయలు చేసేలా నియంతృత్వ చర్యలకు కేంద్రం పాల్పడింది. దీంతో అనేకానేక చిక్కు సమస్యలు తలెత్తి, చివరకు కోర్టుల్లో కేసులు పడ్డాయి. నాడు కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ భారతీయులన్న గుర్తింపు కార్డు ఇవ్వాలనుకుంటే, ఈ ప్రభుత్వం అన్నింటికీ అనుసంధానం చేస్తూ ఇబ్బంది పెడుతోంది. దేశ ప్రజలకు వ్యక్తిగత స్వేచ్ఛ లేకుండా చేస్తోంది. 'ఆధార్' నెంబర్‌తో వ్యక్తిగత స్వేచ్ఛ కోల్పోతున్నారు. ఎవరి వ్యక్తిగత స్వేచ్ఛను హరించరాదు. ఆధార్ కార్డుపై ఉండే నెంబర్‌తో వ్యక్తిగత విషయాలన్నీ బట్టబయలు అవుతున్నాయి. ఇది ఎంతవరకు సమంజసం. కేవలం 500 రూపాయలు చెల్లిస్తే చాలు, వ్యక్తిగత విషయాలన్నీ ఇట్టే బయట పెడుతున్న వైనాన్ని ఒక జర్నలిస్టు తన కథనం ద్వారా బయటపెడితే, సదరు జర్నలిస్టుపై కేసు నమోదు చేయడం దుర్మార్గం. జరుగుతున్న లోపాల గురించి వెలుగులోకి తేవడం నేరమా? దేశంలోకి చొచ్చుకుని వచ్చిన బంగ్లాదేశ్, పాక్ టెర్రరిస్టులూ 'ఆధార్'ను సంపాదిస్తున్నారంటే లోపం ఎక్కడ ఉందో ప్రభుత్వం తెలుసుకోవాలి. అటువంటి లోపాలను సరి చేసి పగడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రంపైనే ఉంది. ఇంకా విషయంలో లోపాలను సరి చేసుకుని పగడ్బంధీగా అమలు చేసేందుకు అవసరమైతే జాతీయ స్థాయిలో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి సలహాలు, సూచనలు తీసుకుంటే మంచిది.

- కనుకుల జనార్ధన్ రెడ్డి
మాజీ ఎమ్మెల్సీ
చైర్మన్, రాష్ట్ర సేవాదళ్, తెలంగాణ కాంగ్రెస్



వివరాలన్నీ భద్రంగా ఉండాలి

ఆధార్ కార్డులోని ఒక పౌరుడి వ్యక్తిగత అంశాలకు గోప్యత, భద్రతను కల్పించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. భద్రత లేనందు వల్ల కీలకమైన సమాచారం లీకవుతుంది. దాని వల్ల వ్యక్తిగత గోప్యత హక్కుకు భంగం వాటిల్లుతుంది. అలాగే మన దేశంలో పౌరుల వ్యక్తిగత సమాచారం శత్రు దేశాలకు చేరుతుంది. ఆదార్ కార్డు విషయంలో సుప్రీం కోర్టు అనేక తీర్పులు ఇచ్చింది. కేంద్రం కూడా అనేక రకాలైన ఆదేశాలు ఇస్తూ వెళుతోంది. గడువులను పొడిగిస్తున్నారు. మొబైల్ ఫోన్, బ్యాంకులు, బీమా కంపెనీలు, ఇంటి రిజిస్ట్రేషన్, బ్యాంకు ఖాతాను తెరవాలన్నా, రుణం తీసుకోవాలన్నా, ప్రభుత్వ బెనిఫిట్లు పొందాలన్నా ఆదార్ కార్డు జిరాక్స్‌ను అడుగుతున్నారు. చివరకు రైల్వే శాఖ ఐఆర్‌సిటిసి కూడా ఆదార్ కార్డును అనుసంధానం చేస్తే ఆన్‌లైన్ ద్వారా గరిష్టంగా నెలకు ఇప్పుడు తీసుకునే టిక్కెట్లను ఆరు నుంచి 12కు పెంచింది. ఆదార్‌ను సంక్షేమ పథకాలతో అనుసంధానం చేయడం మంచిదే. దీని వల్ల అవకతవకలను నిరోధించవచ్చును. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు దేశంలోని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వేల కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతున్నాయి. ఇవి లబ్ధిదారుడికి చేరాలంటే ఆదార్ ఉండాల్సిందే. ఫీజు రీ ఎంబర్స్‌మెంట్‌కు కూడా ఆదార్ అనుసంధానం చేశారు. దీనిని కూడా అంగీకరించవచ్చును. కాని ప్రైవేట్ ఏజన్సీలు కూడా ఆదార్ కార్డు నంబర్, జిరాక్స్‌ను చూపించమంటున్నాయి. దేశంలో నిరక్షరాస్యత 40 శాతం ఉంది. ఈ నేపథ్యంలో ఆదార్ కార్డు డాటా లీకు కాకుండా పటిష్టమైన విధనాన్ని కేంద్రం అమలు చేయాలి. ప్రతి ఒక్కరు ఆదార్ కార్డు, నంబర్ అడుగుతుంటే జనం ఆందోళనకు గురవుతున్నారు. ఆదార్ కార్డును సామాజిక సంక్షేమ ప్రగతికి ఉపయోగించుకుంటే చాలు. అంతేకాని ఆర్థిక రంగంలో కూడా వినియోగిస్తున్నారు. ఈ వేలం వెర్రి ఇలా పెరిగితే అనర్థాలకు దారితీస్తుంది. ఒక పౌరుడి వ్యక్తిగత సమాచారాన్ని ప్రైవేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లడం దేశ ప్రయోజనం దృష్ట్యా మంచిది కాదు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరిచి ఆదార్ డేటా దుర్వినియోగం కాకుండా కళ్లెం వేయాలి. ఇందులో చిక్కులేమైనా ఉంటే తొలగించాలి.

- కె శివకుమార్
ప్రధాన కార్యదర్శి, వైకాపా, తెలంగాణ రాష్ట్ర శాఖ

ప్రభుత్వానిదే బాధ్యత



మా పార్టీ ఆధార్ వ్యవస్థకు ఏమాత్రం వ్యతిరేకం కాదు. ఆధార్ వద్దని, తీసుకోవద్దని తామెప్పుడూ చెప్పలేదు. మొదట్లో ఇది కేవలం ఒక గుర్తింపు సంఖ్య మాత్రమేనని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. ఇప్పుడు అన్నింటికీ ఇది తప్పనిసరి అంటున్నారు. కానీ జారీ చేయడం ప్రారంభించిన సమయంలో పౌరులకు తగిన సమాచారం ఇవ్వలేదు. హడావుడిగా కాలపరిమితులు నిర్ణయించి ప్రజలను గందరగోళంలోకి నెట్టారు. దీంతో పరుగులు తీసి మరీ ఆధార్ నమోదు చేయించుకున్నారు. ఆధార్ నమోదు కేంద్రాల సంఖ్య తక్కువగా ఉండడమే కాకుండా కేంద్రాల్లోనూ సరిగ్గా సాంకేతిక సహకారం లేకపోవడం వల్ల అనేక తప్పులు దొర్లాయి. ఆ తర్వాత కొంతవరకు సరిచేసి కాలపరిమితి లేకుండా అందరికీ ఇచ్చారు. మంచిదే, కాదనం కానీ సంక్షేమ పథకాలకు ఆధార్‌ను అనుసంధానం చేయడం వల్ల ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో ఆధార్ ఇబ్బందుల వల్ల సంక్షేమ పథకాలు అర్హులకు అందడం లేదు. ఇలాంటి పరిస్థితిలో సంక్షేమ పథకాలకు ఆధార్‌ను అనుసంధానం చేయడం అనేది కొన్ని రోజులు ఆగిన తర్వాత చేపడితే మంచిది. ఎందుకంటే అందరి చేతికి ఆధార్ వచ్చాకే సంక్షేమ పథకాలకు అనుసంధానం చేస్తే బాగుంటుంది. ఈలోగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు వీలవుతుంది. ఈమధ్య కాలంలో పత్రికల్లోనూ, ప్రసార మాధ్యమాల్లోనూ విపరీతి ప్రచారం జరుగుతోంది. ఎంతో విలువైన పౌరుల ఆధార్ డేటా కారు చౌకగా అంగట్లో దొరుకుతోందని అంటున్నారు. ఈ ప్రచారం కరక్టయితే మనం పెద్ద ప్రమాదాన్ని ఎదుర్కొనాల్సి వస్తుందేమో. ఆధార్ డేటా అమ్ముడు పోతోందని దేశవ్యాప్తంగా పెద్ద అలజడే వచ్చింది. ఇదే నిజమైతే ఆధార్ డేటాను భద్రంగా ఉంచాల్సిన బాధ్యత నూటికి నూరు శాతం కేంద్ర ప్రభుత్వం పైనే ఉంది. ఇప్పటికే అనేక లోపాలు, వ్యవస్థలో ఉన్న లోపభూయిష్టం విధానాల వల్ల ప్రతి దానిలో అక్రమాలకు అంతే లేకుండా పోతోంది. ఈ పరిస్థితిలో ఆధార్ డేటాకు కూడా భద్రత లేకపోతే ఇక ఏం చేయాలి. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఇలాంటి విషయంలో చాలా సీరియస్‌గా తీసుకోవాలి. ఎంతో ప్రతిష్టాత్మకంగా, వేల కోట్లు వెచ్చించి చేపట్టిన ఈ ప్రాజెక్టు నిరుపయోగం కారాదు. డేటా ఇతరుల చేతికి గాని వెళితే ఇక ప్రభుత్వం ఆశించిన లక్ష్యం ఎలా నేరవేరినట్లు అవుతుంది. ఇంకా చెప్పాలంటే నకిలీ ఆధార్ కార్డులు చలామణిలోకి వచ్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. చాలా సులభంగా ఆధార్ కార్డులు నకిలీవి సృష్టిస్తున్నారని వింటున్నాము. ఇక ఆధార్ కార్డు కూడా నకిలీది వస్తే వ్యవస్థలో మనం ఎక్కడ ఉన్నట్లు. మొదటికే మోసం వస్తుంది. ప్రభుత్వం జాగ్రత్త వహించాలి. ఆధార్ డేటాను పటిష్ట పర్చి, భద్రత కల్పించాలి. అలా చేస్తేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. లేదంటే అభాసుపాలవుంది.

- కె.రామకృష్ణ
సిపిఐ, ఎపి రాష్ట్ర కార్యదర్శి

ఆధార్‌పై అపోహలు వద్దు



ఆధార్ కార్డులపై అపోహలు పెట్టుకోవద్దు. సామాజిక అభివృద్ధికి, వ్యక్తిగత అభివృద్ధికి ఆధార్ దోహదపడుతుంది. అవినీతికి ఆస్కారం లేకుండా చూసేందుకు ఉపయోగపడుతుంది. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు సజావుగా సాగాలంటే ఏదో ఒకరకమైన నియమావళి, కట్టుబాట్లు ఉండాలి. ఇందుకు దోహదపడేదే ఆధార్ కార్డు. కేంద్ర ప్రభుత్వం యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) ద్వారా ఆధార్‌ను తీసుకువచ్చింది. దేశంలోని ప్రతి పౌరుడిని గుర్తించేందుకు ఆధార్ ద్వారా ఒక యూనిక్ నెంబర్ ఇస్తున్నారు. అంటే 120కోట్ల మందికి 120కోట్ల నెంబర్లు లభిస్తాయి. జనాభా ఎంత ఉంటే అంతమందికి ఈ నెంబర్లు ఇస్తారు. ప్రతి వ్యక్తి ఏ ప్రాంతానికి చెందిన వాడో, ఎక్కడ ఉంటున్నాడో తదితర వివరాలు తెలుసుకునేందుకు ఇది తోడ్పడుతుంది.

ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి తదితర పనులకు వెచ్చించే డబ్బు ప్రజలది. ప్రభుత్వం నేరుగా నోట్ల కట్టలను ముద్రించదు. ప్రజల నుండి పన్నులు తదితర రూపాల్లో లభించే డబ్బునే ప్రజలకోసం వ్యయం చేస్తుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ప్రజా సంక్షేమంకోసం పకడ్బందీగా, చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. ప్రతి పైసా ప్రజలకోసమే ఉపయోగపడాలన్న ఉద్దేశంతో పనిచేస్తున్నారు. అరవై ఏళ్ల ఆంధ్ర ప్రదేశ్ పాలనలో తెలంగాణ ప్రజల జీవనం సమస్యల మధ్య నడిచింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత కెసిఆర్ ప్రభుత్వం ఒక నిర్దిష్ట లక్ష్యం, మంచి ఉద్దేశంతో పనిచేస్తోంది.


రైతులు, వృత్తిపనివారు, ఉద్యోగులు, వ్యాపారులు, వాణిజ్యవేత్తలు, స్వయం ఉపాధితో జీవిస్తున్నవారు, కార్మికులు తదితరుల సంక్షేమం కోసం కేసీఆర్ అనేక పథకాలు, కార్యక్రమాలు చేపట్టారు. సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు మాత్రమే చేరేందుకు ఆధార్‌ను ఉపయోగిస్తున్నారు. ఇందుకు ఎవరూ అభ్యంతరం చెప్పనవసరం లేదు. ప్రభుత్వం ఖర్చుచేసే నిధుల్లో ప్రతి పైసా పేదలకు చేరాలన్నదే కెసిఆర్ తపన. ఇందుకు మనమంతా సహకరించాలి. బంగారు తెలంగాణ సాధించేందుకు తోడ్పడాలి.

- గువ్వల బాలరాజు
ఎమ్మెల్యే, అచ్చంపేట నియోజకవర్గం
నాగర్‌కర్నూలు జిల్లా

ఇద్దరూ ఇద్దరే..!

త్వరలోనే మరో క్రేజీ మల్టీస్టారర్ సినిమాకు సన్నాహాలు జరుగుతున్న విషయం తెలిసిందే. బాహుబలి తరువాత రాజమౌళి తెరెకెక్కించే సినిమా ఇదే. మెగా హీరో రామ్‌చరణ్, నందమూరి హీరో ఎన్టీఆర్ కలిసి నటించే ఈ సినిమాకు సన్నాహాలు జరుగుతున్నట్టు జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ సినిమా దసరాకు మొదలుపెట్టే ఆలోచనలో ఉన్నారట రాజమౌళి. ప్రస్తుతం అటు చరణ్, ఇటు ఎన్టీఆర్ వేరే సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇక రాజమౌళి ఈ సినిమా స్క్రిప్ట్ విషయంలో సీరియస్‌గా పనిచేస్తున్నారట. ఎందుకంటే ఇద్దరు క్రేజీ స్టార్స్‌తో తీస్తున్న సినిమా కాబట్టి అంచనాలు కూడా ఆ రేంజ్‌లోనే ఉంటాయి మరి! వాటిని అందుకోవాలంటే ఆ రేంజ్ స్క్రిప్ట్ ఉండాల్సిందే. అయితే తాజాగా ఈ సినిమాకు టైటిల్ ఫిక్స్ చేసినట్లు ప్రచారం సాగుతోంది. ఇంతకీ టైటిల్ ఏమిటో తెలుసా.. 'ఇద్దరు.. ఇద్దరే'నట! అప్పట్లో అక్కినేని హీరోలు నాగేశ్వరరావు, నాగార్జున కలిసి నటించిన సినిమా అది. ఇప్పటికే ఈ సినిమాపై రకరకాల గాసిప్స్ వస్తున్నాయి. మరి ఇందులో ఏది కరెక్ట్ అన్న విషయాన్ని రాజమౌళియే చెప్పాలి.





నాగార్జున మల్టీస్టారర్?

కొత్తదనాన్ని అందించడంలో నాగ్ స్టయిలే వేరు. అందుకే చిన్నా పెద్దా తేడా లేకుండా భాషా భేదం లేకుండా ఎప్పటినుంచో మల్టీస్టారర్లు చేస్తున్నారు నాగ్. మల్టీస్టారర్లు పూర్తిగా మరుగునపడిపోయిన సమయంలో మోహన్‌బాబుతో అధిపతి, శ్రీకాంత్‌తో నిన్నే ప్రేమిస్తా లాంటి సినిమాలు చేశాడు. నాగ్ హిందీ, తమిళ భాషల్లోనూ వేరే హీరోలతో కలిసి నటించాడు. ఈమధ్యే తమిళ యువ కథానాయకుడు కార్తితో కలిసి నటించిన 'ఊపిరి' మంచి ఫలితాన్నందించింది. ఇప్పుడు నానితో కలిసి శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో ఓ మల్టీస్టారర్ చేయడానికి నాగ్ రెడీ అవుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా సెట్స్ మీదకి వెళ్లకముందే నాగ్ పేరుతో మరో మల్టీస్టారర్ వార్తల్లోకి వచ్చింది. అందులో నాగార్జునతో కలిసి నటించే కథానాయకుడంటూ ప్రచారంలో వున్న హీరో ఎవరో తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. తమిళంలో ఎలాంటి బ్యాగ్రౌండ్ లేకుండా కేవలం తన టాలెంట్‌తో స్టార్ హీరోగా ఎదిగిన ధనుష్‌తో కలిసి నాగ్ ఓ మల్టీ లాంగ్వేజ్ మల్టీస్టారర్ చేయబోతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ కాంబినేషన్‌లో సినిమా తీసేదెవరన్నది తెలియరాలేదు. కానీ ఇద్దరూ కలిసి ఓ కథ గురించి చర్చించినట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. నిజంగా ఇదే నిజమైతే ఇటు నాగ్ అభిమానులు.. అటు ధనుష్ అనిమానులకు ఆనందాన్నిచ్చే విషయమే..



గ్లామర్ డోస్?

ఈమధ్య హీరోయిన్స్‌గా క్రేజ్ తెచ్చుకోవడం పెద్ద విషయం ఏమీ కాదు.. ఎందుకంటే హీరోయిన్స్‌గా ఛాన్స్ పట్టేయ్యాలంటే బికినీ మంత్రం జపిస్తే చాలు.. అవకాశాలు క్యూ కడతాయి. ఒకవేళ మొదటి సినిమా అనుకున్న రేంజ్ క్రేజ్ రాలేదా.. రెండో సినిమాకే రెచ్చిపోయి అందాలు ఆరబోస్తే సరి! ఈ విషయాన్ని చాలామంది భామలు ఫాలో అవుతున్నారు. తాజాగా నిఖిల్ హీరోయిన్ కూడా డోస్ పెంచేసింది. నిఖిల్ హీరోగా వచ్చిన సూర్య వర్సెస్ సూర్య సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన త్రిదా చౌదరి. మొదటి సినిమా హిట్ అయినా కూడా ఈ అమ్మడికి ఆశించినంత స్థాయిలో అవకాశాలు రాలేదు. దాంతో గ్లామర్ డోస్ పెంచేందుకు సిద్ధం అయినట్టు హింట్ ఇచ్చే.. బీచ్‌లో బికినీలతో ఫొటో షూట్‌లు ఇచ్చిన ఈ భామ ప్రస్తుతం సందీప్‌కిషన్ సరసన మనసుకు నచ్చింది సినిమాలో నటిస్తోంది... తాజాగా ఈ సినిమాలో బికినీలో షాక్ ఇవ్వనుంది. ఈ బికినీ అందాల్లో త్రిదాని చూడ్డానికి కళ్లు చాలవని అంటున్నాయి సినీ వర్గాలు.



త్రిదా చౌదరి

ఆ కల ఇలా నిజమైంది..



అమలాపురంలో సరదాగా తిరిగే గోపి అనే కుర్రాడు ఓ పర్సన్‌కోసం హైదరాబాద్ వెళ్ళాడు. అక్కడ అతను ఎదుర్కొన్న పరిణామాలు ఏంటనేది తెలియాలంటే 'ఇగో' చిత్రాన్ని చూడాల్సిందే అంటున్నారు హీరో ఆశీష్ రాజ్. సుబ్రమణ్యం దర్శకత్వంలో ఆశీష్‌రాజ్ హీరోగా నటించిన చిత్రం 'ఇగో'. ఈనెల 19న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో ఆశీష్‌రాజ్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ- నటన అంటే చిన్నప్పట్నుంచే ఇష్టం. 4వ తరగతిలో నటించే ఛాన్స్ వచ్చింది. రావణుడి పాత్ర వేశాను. పలు యాడ్స్‌లో నటించాను. అటునుంచి సినిమాలవైపు వెళ్లాలని కలలు కన్నాను. ఆ కల ఇలా నిజమయింది. మహేష్‌బాబుతో కలిసి ఓ యాడ్ ఫిల్మ్‌లో నటించా. కానీ అందులో నేను పెద్దగా కనిపించలేదు. అలాగే ఓ సినిమాలోనూ నటించాను. అది విడుదల కాలేదు. ఆకతాయి చిత్రంతో హీరోగా పరిచయం అయ్యాను. హీరోగా 'ఇగో' నాకు రెండవ చిత్రం. ఇద్దరు ఇగోయిష్టుల ప్రేమకథ ఇది. ఇందులో నేను గోపిగా కనిపిస్తా. ఫ్యామిలీ ఫ్రెండ్స్‌కి చెందిన అమ్మాయి ఇందు పరిచయమవుతుంది. మేం టీజింగ్ చేసుకుంటూ ఉంటుంటాం. ఓ టైమ్‌లో మా ఇగోలు దెబ్బతింటాయి. నీకంటే రిచ్ అబ్బాయిని పెళ్లిచేసుకుంటా అని ఆమె, నీకంటే అందమై అమ్మాయిని చేసుకుంటా అని నేను ఒకరినొకరు వాదించుకుంటాం. ఈ క్రమంలో నేను ఓ సోషల్ కాజ్‌కోసం హైదరాబాద్‌వస్తాను. అక్కడ చోటుచేసుకున్న ట్విస్ట్‌వల్ల జీవితమే మారిపోతుంది అని అన్నారు.

స్టార్‌డమ్ అంటే మాటలు కాదు..!

వెండితెర వెలుగుల వెనుక వున్న తారల పరిస్థితి చూస్తే వారి జీవితాలు ఇలా కూడా వుంటాయా? అనిపించక తప్పదు. సినీమాయ ప్రపంచలో వెలుగులు వెలగాలని వచ్చేవారికి ఎన్నో అవరోధాలు, ఇండస్ట్రీలో ఎన్నో ఆటుపోట్లు జరుగుతూనే వుంటాయి. ఒక్క అవకాశం దొరికితే చాలు పరిశ్రమలో స్థిరపడవచ్చని ఎన్నో అపోహలతో వచ్చేవారి బాధలు వర్ణనాతీతం. నటనమీద వున్న ఆసక్తితో ఎన్నో వందలమంది చిత్రసీమకి వచ్చినా కూడా వారిలో ఏ కొంతమందికో ఆ అవకాశం లభిస్తుంది. బ్యాక్‌గ్రౌండ్ లేకుండా వచ్చేవారికి నూటికి నూరుశాతం ఖచ్చితంగా అవకాశాలు రావనే చెప్పాలి. నేరుగా సినిమాల్లో నటించాలని వచ్చినవారు కూడా కష్టమని భావించి అసిస్టెంట్ డైరెక్టర్లుగా కొంతకాలం పనిచేయడం నూటికి నూరుపాళ్లు జరుగుతుంది. అలా అసిస్టెంట్ డైరెక్టర్లుగా పనిచేస్తూనే సినీ పరిశ్రమలో పరిచయాలు పెంచుకుని చిన్నచిన్నగా క్యారెక్టర్ ఆర్టిస్టులుగా నటిస్తూ వాళ్ల టైమ్ బాగుంటే చిన్న బడ్జెట్‌తో సినిమాలు నిర్మించే నిర్మాతల దృష్టిలో పడినట్లయితే అలాంటి నిర్మాతలు తీసే సినిమాల్లో హీరోలుగా నటించగలుగుతారు. ఆ సినిమా కనుక సక్సెస్ అయితే వరసగా సినిమాలు చేతిలో వుండి మంచి పొజిషన్‌కి వెళతారు. లేకుంటే ఇక అంతే సంగతులు. ఒక్కసారి స్టార్‌డమ్ వచ్చాక తిరుగుండదు. తిరిగి చూసుకోవాల్సిన అవసరం వుండదు. కానీ ఖర్మకాలి అవకాశాలు రాకనో, తీస్తున్న సినిమాలు ఏదో సమస్యవల్ల విడుదల కాకపోయినట్లయితే అంతకుముందున్న పొజిషన్ కాపాడుకోవడం కష్టమే.

మనిషికి ఆశ వుండటం సహజం. కానీ అత్యాశ వుండటం చాలా ప్రమాదకరం. కానీ చిత్ర పరిశ్రమలో ఆశ కూడా పెట్టుకోకూదు. ఎవర్ని ఎప్పుడు ఏం చేస్తుందో, ఏం జరుగుతుందో ఊహించలేని పరిస్థితి. రంగుల ప్రపంచంలో తారస్థాయికి ఎదిగిపోవాలని వచ్చినవారి జీవితాలు, ఆశలు మధ్యలోనే ఆవిరైపోతున్నాయి. ఎందుకంటే పొజిషన్ మెయింటైన్ చేయకపోతే ప్రేక్షకుల్లో, జనాల్లో గుర్తింపు వుండదు. యధావిధిగా పొజిషన్ మెయింటైన్ చేయాలంటే సినిమాలు ఎక్కువ చేతిలో వుండాలి. ఏదో తమకున్న నాటక పరిజ్ఞానంతో, యువతులైతే మోడలింగ్‌లో చేసిన అనుభవంతో సినీ పరిశ్రమకి వచ్చి అవకాశాలు దొరక్క, ఈ కలల ప్రపంచాన్ని వీడి సాధారణ జీవితం గడపలేక, వేరే ఎలాంటి భవిష్యత్ కార్యక్రమాలపై దృష్టి నిలుపలేక వారివారి జీవితాలను, వారిని నమ్ముకున్న వారిని మోసం చేయలేక జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు. అవకాశాలు వచ్చినా స్టేటస్ నిలుపుకోవడానికి చెడుమార్గాలు అన్వేషించాల్సి వస్తుంది.


హీరోయిన్ కావాలని వచ్చిన యువతులు నేరుగా హీరోయిన్ వేషాలు లభించక చిన్నచిన్న పాత్రలు చేసుకుంటూనే అవకాశాల కోసం పోరాడుతూనే వున్నారు. చివరకు సీరియల్‌లోనైనా హీరోయిన్ పాత్రలు దొరకవా అన్న ధోరణిలో సినిమాల కోసం, ఇండస్ట్రీలో పేరు సంపాదించడం కోసం వెంపర్లాడుతున్నారు. ఇక కొత్తగా ఎవరైనా అమ్మాయిలు సినిమా అవకాశాల కోసం పరిశ్రమలో కనపడితే వారికి సినిమాల్లో అవకాశాలు ఇప్పిస్తామని చెప్పి తమ మాయమాటలతో లోబరచుకుని వారి జీవితాన్ని నాశనం చేస్తున్నారు. అలా వచ్చినవారికి తీరా తాము మోసపోయామన్నది గ్రహించాక అది బయటపడితే పరువుపోతుందని కొందరు యువతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఒక నటిగా, నటునిగా సినిమా పరిశ్రమలో వెలిగిపోవాలని ఆశతో, ఆశయంతో, అకుంటిత దీక్షతో ఇంటి ని కుటుంబాన్ని వదిలి సినీ మోజు లో వచ్చిన వారు కాస్త పొజిషన్ వచ్చాక మళ్లీ అవకాశాలు రాకపోయేసరికి జీవితాల్ని చాలించుకునే పరిస్థితికి వస్తున్నారు.

ఒకప్పుడు సినిమాల్లో నటించాలంటే నాటకాలు వేసిన అనుభవం, వారి కుటుంబ నేపథ్యం చూసిగానీ సినిమాల్లో అవకాశాలు దక్కేవికావు. కానీ ఇప్పుడలా లేదు. నటనమీద ఆసక్తి, అనుభవం వుండి కాస్త గ్లామర్‌గా వుంటే చాలు. అయితే కొంతకాలంగా సినిమాల్లో నటించాలనే ఆశతోకాక టివీ చానళ్లు నిర్వహించే షోల్లో అవకాశం దక్కించుకుని తమ సత్తాను చాటుతున్నారు. టివీ చానళ్లు కూడా నటనాసక్తి వున్నవారికి వారిలో వున్న కళను బయటకు తేవడానికి ఎంతో ముందుకొస్తున్నాయి. కొత్తగా వచ్చే నటీనటులకు టీవీ చానళ్లు మంచి జీవితాన్నిస్తున్నాయని చెప్పవచ్చు. ఇప్పుడు వస్తున్న నటులంతా కూడా తాము కేవలం సినిమాల్లోనే కాకుండా టీవీ సీరియళ్లలో, షోలలో నటించి ప్రేక్షకులను గంటల తరబడి టీవీల ముందు అతుక్కు పోయేలా చేస్తున్నాయి. చిన్న సినిమాల్లో హీరోలుగా నటించేవారు టీవీ షోల్లో నటించి వారి టాలెంట్‌ను వెండితెరపై ప్రదర్శిస్తున్నారు. ఒకప్పుడు సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టులుగా వెలుగొందినవారు కూడా ఇప్పుడు టీవీ సీరియళ్లలో నటించి మెప్పిస్తున్నారు. నటన ఎక్కడ వున్నా అది ప్రేక్షకుల్ని మరచిపోకుండా చేయాలి. అది హీరో పాత్ర, హీరోయిన్, సైడ్ క్యారెక్టర్, విలన్ కావచ్చు ఏదైనా నటించిన పాత్రకు న్యాయం చేస్తే చాలు.

ఈమధ్య డజన్ల సంఖ్యలో కొత్తవారు వెండితెరకు పరిచయమైనారు. టీవీ షోల్లో చిన్న చిన్న పాత్రలుచేసిన కమెడియన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులు వెండితెరకు వస్తున్నారు.

అనుకున్నంత తొందరగా ఏదీ కూడా తమ సొంతం కాదు. సాధించడానికి ఎంతో శోధన చేయాలి, కష్టపడాలి, కష్టనష్టాలు అనుభవించాలి. అలా అయితే గెలుపులోని తీయదనాన్ని ఆస్వాదించవచ్చు. ఇప్పుడు కామెడీ ఆర్టిస్టులుగా బుల్లి తెరమీద కనిపిస్తున్నవారంతా ఎంతో ప్రావీణ్యం కలవారే. ఒకరికి మంచి మరొకరు అన్నట్లు ఎవరికివారే గొప్పవారు.సినిమాల్లో నటించాలనే బలమైన కోరికతో ఇంటి నుంచి వచ్చినవారు రాగానే ఎలాగు అవకాశాలు రావన్నది నిజం. కాబట్టి తెలిసి కూడా అవివేకంగా ప్రవర్తించకూడదు. ఒక్క సినిమాతోనే జీవితంలో స్థిరపడలేం. అలాంటి అవకాశాలు ఎన్ని రావాలి? ఎన్ని సినిమాల్లో నటించాలి. ఒక్క సినిమా హిట్ కాగానే మిడిమిడి జ్ఞానంతో పొజిషన్ మారిందనుకోవద్దు. ప్రేక్షకులు ఎవర్ని ఎప్పుడు ఎలా దీవిస్తారో ఎలా స్టార్‌డమ్ కల్పిస్తారో ఎవరికీ తెలియదు. స్టార్‌డమ్ అంటే మాటలు కాదు...! కాబట్టి నటించే పాత్రలు మంచిగా వుండేలా, కథ జనాలను మంత్రముగ్ధుల్ని చేసేలా వుండేవిధంగా ఎంపిక చేసుకోవాలి. లేకుంటే సినీ వినీలాకాశంలో కనుమరుగు కావాల్సిందే. తమకున్న నటన, ఏదైనా రంగంలోకాని వున్న ప్రావీణ్యాన్ని నెమ్మదినెమ్మదిగా పరీక్షించుకుంటూ ఒక్కోమెట్టు ఎక్కాలి. కానీ ఒకేసారి ఎగిరి మెట్లన్నీ దాటాలని చూస్తే వెనక్కి రావాల్సిందే. స్టార్‌డమ్ కోసం అహర్నిశలు కష్టపడాలి. అవకాశాలు రాకుంటే నిశ్చలత్వంతో వుండాలి. మన దగ్గర టాలెంట్, అదృష్టం వుంటే అన్నీ ఏదో ఒక సమయాన మన దగ్గరికి వస్తాయి.

- శ్రీనివాస్ పర్వతాల



నో రూమర్స్ ప్లీజ్..



హిందీ చిత్రం 'క్వీన్' నాలుగు దక్షిణాది భాషల్లో రీమేక్ అవుతున్న సంగతి తెలిసిందే. వీటిలో తెలుగు వెర్షన్‌లో తమన్నా నటిస్తోంది. ఆయితే ఇటీవల చిత్ర దర్శకుడు నీలకంఠకు తమన్నాకు మధ్య మనస్పర్థలు వచ్చాయని వార్తలు వస్తున్నాయి. ఈ వార్తలపై స్పష్టతనిచ్చేందుకు తమన్నా రంగంలోకి దిగింది. సినిమా నిర్మాణ వ్యవహారాలతో తనకు సంబంధం లేదని, ఆ వార్తల్లో నిజం లేదని, సినిమా బాధ్యత మొత్తం నిర్మాత మనుకుమారన్ చేతిలోనే ఉందని ఆమె అంది. నా కారణంగా సినిమా నుంచి దర్శకుడు నీలకంఠ తప్పుకున్నారని వస్తున్న వార్తలపై క్లారిటీ ఇవ్వాలనుకుంటున్నాను. సినిమా నిర్మాణం విషయంలో నాకు కానీ నా టీమ్‌కు కానీ ఎలాంటి అధికారం లేదు. సినిమా పరంగా నిర్ణయాలు తీసుకోవాల్సింది నిర్మాతే. నీలకంఠ సర్ అంటే నాకు గౌరవం ఉంది. నిర్మాత మనుకుమారన్ నవంబర్‌లోనే సినిమాలో కొన్ని మార్పులు చేశారు. నాలుగు భాషల్లో వస్తున్న ఈ సినిమా మాకు డ్రీమ్ ప్రాజెక్టు లాంటిది.